సత్య దేహం

రాత్రి పన్నెండు గంటలు. తూర్పుకి వెళ్ళే ప్యాసెంజర్ వచ్చే వేళయింది.

కాస్త ముసురుగా వుందేమో — బండికి జనం అట్టేమంది లేరు.

అసిస్టెంట్ స్టేషన్ మాస్టరు — రాఖాల్ భట్టాచార్య టికెట్ల అమ్మకం ముగించాడు. లేచాడు. నల్లకోటూ, ముఖమల్ టోపీ వేసుకుని, లాంతరు చేత పుచ్చుకుని బయటికి వచ్చాడు.

భూతంలా గర్జిస్తూ, ప్యాసెంజర్ ప్లాట్‌ఫారం మీదకు వచ్చింది, ఆగింది.

బండి ఆగిందో లేదో, గోల ! ఏదో పెద్ద గోల ! !— ఇంటర్ కంపార్టుమెంటు లోంచి పెద్ద గోల. "గార్డుగారూ !— గార్డుగారూ !! —" అంటూ అరుపులు. "ఏమిటి సంగతి ? ఏం జరిగింది ?" అంటూ రాఖాల్ లాంతరుతో సహా పరుగెత్తు కెళ్ళాడు. ప్లాట్‌ఫారం మీద నించునే, కంపార్టుమెంటులోకి తొంగి చూచాడు. ఎవరో వ్యక్తి చచ్చిపోయాడు ! ఆ చచ్చినవాడు సన్యాసి దుస్తుల్లో వున్నాడు ! !

"అస లెలా చచ్చిపోయాడు ?" అని అడిగాడు రాఖాల్.

"ఫతూయా స్టేషన్ వచ్చేవరకూ బాగానే వున్నాడు. అక్కడనుంచి బండి బయల్దేరింది. గంజాయి గొట్టం పైకి తీస్తూ, మనిషి వణికిపోయాడు; కాళ్ళూ చేతులూ తన్నుకున్నాడు. ఒకళ్ళిద్దరం కలిసి పట్టుకోబోయాం, కాని మావల్ల కాలేదు. బల్లమీదనుంచి కిందకు పడి, నోటమ్మట నురుగులు కక్కుకున్నాడు. అంతే, దగ్గరకు వచ్చి చూస్తే, శ్వాసలేదు. ఇదంతా జరిగి పది నిమిషా లయింది."

ఇంతలో గార్డు వచ్చా డక్కడికి. కథంతా విన్నాడు. "దింపండీ శవాన్ని !" అన్నాడు.

"శవా న్నిక్కడ దింపితే, ఏముంది ? డాక్టరా, పోలీసులా ? —"

"అలా వీల్లేదు; రైల్లో శవా న్నుంచటానికి వీల్లేదు. డాక్టర్‌కీ పోలీసులకీ మెసేజి పంపించండి. వాళ్ళే వస్తారు." అంటూ గార్డు శవాన్ని దింపించేశాడు. శవంతో పాటు శవం తాలూకు సామాన్లు, ఒక ట్రంకు, కమండలం కూడా రాఖాల్‌కి అప్పగించాడు గార్డు.



ఈ తతంగ మంతా జరిగేటప్పటికి పావుగంట పైన పట్టింది. బండి బయల్దేరింది.

శవాన్ని ప్లాట్‌ఫారంమీద వదిలేస్తే ఏ నక్కలైనా పీక్కు తింటా యని, శవాన్నీ, సామాన్లనూ పార్శిల్ రూమ్‌లో పెట్టించి తాళం వేశాడు రాఖాల్. పనివాళ్లను ఇళ్లకు పొమ్మని, యాక్సిడెంట్ మెసేజి పంపి, రాఖాల్ పడుకున్నాడు.

పడుకోవడమైతే పడుకున్నాడు గాని, నిద్ర పట్టందే! అతని తలకాయ ఆ సన్యాసిని గురించే ఆలోచిస్తోంది. 'ఎవ రీ సన్యాసి? ఏమి టితనికథ? కేవలం బికారిలా తిరిగే ఈ సన్యాసి ఇన్టర్‌లో ప్రయాణం చేయడ మేమిటి? పైకి ఇలా బికారిలా కనబడేవాళ్ళ దగ్గరే బోలెడంత డబ్బుంటుం దంటారు. ఈ సన్యాసి అలాంటి వాడేనేమో! ఇతని పెట్టెలో ఏమాత్ర ముంటుందో?_'

బయట మెరపు మెరిసింది.



రాఖాల్ మనస్సులో ఏదో ఊహ మెదిలింది.

బయట మేఘ మురిమింది.

రాఖాల్ మనస్సులో ఏదో భయం కదిలింది.

మళ్ళీ ఏదో ఆశ పట్టి పీడిస్తోంది.

ఆ క్షణంలో రాఖాల్ భట్టాచార్యకి తన స్థితి అంతా — తన కథ అంతా — కళ్ళకు కట్టినట్టయింది.

* * * * * *

చిన్నప్పుడే తండ్రి పోయాడు. తల్లి నానాపాట్లూ పడి, కాస్తలో కాస్త చదువు చెప్పించింది. వర్ధమాన్‌లో మేనమామల ఇంట్లో ఉంటూ, స్కూల్‌ఫైనల్ వరకు చదివాడు లీలావతి అనే పిల్లను పెళ్ళాడాడు.

దాంపత్యం, ప్రేమ అనే మాటలను రాఖాల్ నవలల్లో చదివాడు. ప్రసంగాల్లో విన్నాడు. అంతే. ఆ ఆనందం ఎటువంటిదో అతనికి లీలావతిలో ఎప్పుడూ కనిపించలేదు ఎప్పుడైనా అత్తవారింటికి వెళితే, 'మరి రెండురోజు లుండండి' అనిగాని, 'మళ్ళీ ఎప్పుడు రావటం ?' అనిగాని మాటవరసకైనా అని ఎరగదు. ఆమె దంతా అదొక ముభావం. రాఖాల్ ఉత్తరాలు రాసినా సరిఅయిన సమాధానం లేదు. ఒకసారి బతిమలాడి భార్యను తీసుకొచ్చాడు. పదిహేను రోజులైనా నిండకుండానే యేడ్చి రాగాలెట్టి, ఫుట్టింటి కెళ్ళిపోయింది.

ఈసారైనా పట్టుబట్టి భార్యను తీసుకురావాలని గట్టి ప్రయత్నం చేశాడు. వారం రోజులు సెలవుకోసం పెడితే మంజూరు కాలేదు, అందుకని ఒకనాడు సుస్తీగా వున్నట్టు నటించి, సిక్ రిపోర్టు ఇచ్చి రైలెక్కాడు.

అది మయనామతీ గ్రామం. రాఖాల్ గడపలో అడుగు పెడుతూనే ఇల్లంతా దిగాలుమని ఉండటం చూశాడు. దాసీది తప్ప మరెవరూ అతన్ని పలకరించలేదు. రాఖాల్ అన్న కూతురు మాత్రం 'బాబాయ్ !' అంటూ పిలిచింది. అన్న కూతురు వల్ల కొంతవరకూ సంగతులు తెలుసుకున్నాడు.

నలువేపులా కలయజూచాడు. కావలసినవాళ్ళు కనబడలేదు. వదినగారు మాత్రం కనబడింది. అడిగిన ప్రశ్నలకు ముక్తసరిగా సమాధానాలు చెప్పింది. మంచినీ ళ్ళడిగాడు రాఖాల్.

"కాళ్ళూ చేతులూ కడుక్కో, ఫలహారం చేదువుగాని" అంటూ లోపలి కెళ్ళింది.

కాళ్ళు కడుక్కు వచ్చాడు రాఖాల్. గుమ్మం వైపు చూశాడు, ఫలహారం లీలావతి చేతి కిచ్చి పంపిస్తుందని వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాడు. కాని, చిన్న



పళ్ళెంలో రెండు రసగుల్లాలు, గ్లాసుతో మంచినీళ్లు పట్టుకుని వదినగారే వచ్చింది. అన్నను గురించి అడిగాడు. తెలియదు అందామె. సాయంత్రం లీలావతిని తీసు కెళదామనే ఉద్దేశాన్ని వెల్లడించాడు. అందుకు సమాధానం చెప్పలేదు గాని, ఆమె కళ్ళు రెండు కన్నీటిబొట్లు రాల్చాయి.

''ఏమిటి జరిగింది వదినా ? ఏమిటి జరిగింది ?" అంటూ రాఖాల్ ఆదుర్దాగా అడిగాడు.

ఆమె ఏమీ మాటాడలేదు.

"లీలావతి కేమైనా ప్రమాదం వచ్చిందా, వదినా ?'' అని మళ్ళీ అడిగాడు.

"ఏం జరిగిందని చెప్పేది, నాయనా ! — తెల్లారుజామునుంచీ దాని జాడ తెలియలేదు."

నిలువునా నీళ్ళుగారిపోయాడు, రాఖాల్.

"ఎక్కడి కెళ్ళిందీ ?"

"ఏమో నాయనా, దేవుడికే తెలియాలి. దాన్ని వెదుకుదా మనే వెళ్ళారు మీ అన్నయ్య."

"అయితే వదినా! — ఏమైనా దెబ్బలాడుకుని వెళ్ళిపోయిందా? లేదా, నువుగాని ఏమైనా కేకలేశావా?"

"అబ్బే, దెబ్బలాట కేముంది, నాయనా! — సాయంత్రం వేళ నూనె వొలక బోస్తే... కాస్త జాగ్రత్తగా ఉండమ్మా' అన్నాను. అంతే, మూతిముడుచుక్కూర్చుంది. రాత్రి అన్నం సరిగా తినలేదు. తెల్లారేటప్పటికి మనిషే కనబడకపాయె! — "

రాఖాల్‌కి ఆశా, నిరాశా రెండూ ఒకేసారే కలిగాయి పరిశోధన ప్రారంభించాడు. "రాత్రి ఎక్కడ పడుకుంది? కూడా ఎవ రున్నారు? ఎప్పుడు వెళ్ళిపోయింది?" అంటూ అడిగాడు.

"రోజూలాగే మామూలుగా, మా అమ్మాయిని దగ్గిర పెట్టుకుని గదిలోనే పడుకుంది. అమ్మాయి తెల్లగా తెల్లారేక లేచింది. లేచి చూస్తే, పక్కన లీల లేదు. పెరటిగుమ్మం తలుపుమాత్రం తెరచివుంది." అన్నది వదిన.

"అయితే, ఏ చెర్లోనో పడివుంటుంది. సందేహంలేదు. నే పోయి పల్లెవాళ్ళని పిలుచుకువస్తా." అంటూ చెప్పులు తొడుక్కోబోయాడు.

'ఆగు నాయనా, ఆగు. నీళ్ళల్లో పడి చస్తేమాత్రం దాన్ని మనం రక్షించగలమా? అలా గనక జరిగివుంటే, సాయంత్రానికి తేలనే తేలుతుంది. కానిపక్షంలో మనకి మనమే అల్లరి చేసుకోవడ మెందుకు? ఒక సంగతి చెబుతున్నా, విను: నిన్న సాయంత్రం వాళ్ళ పుట్టింటినించి ఎవరో దాసీది వచ్చింది. తెల్లవారేక లీల దానితో వెళ్ళిపోయింది. ఇదీ జరిగిన సంగతి."

రాఖాల్‌కి వళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకినట్టయింది. వదిన అనుమానం గ్రహించాడు.

"వదినా, అలా ఎన్నటికీ జరగదు వదినా! — నీళ్ళలోనే పడి చచ్చిపోయి వుంటుంది. లేదా, పుట్టింటికైనా చేరుకు నుంటుంది. అంతేగాని, మరొకలాగా జరగదు. అది అలాటి మనిషి కాదు. ఎందుకైనా మంచిది, పెరటివేపు నాలుగు పక్కలా చూసొస్తాను."

అన్నిచోట్లా తిరిగి చూశాడు రాఖాల్. చెరువులో నీళ్ళు మనిషి మునిగేపాటి లోతైనా లేవు. పెద్దచెరువుకి పోయి వెదకటం మంచి దనుకున్నాడు. కాని, అక్కడికి వెళ్ళటంతోనే ఊళ్ళో ఎరిగినవాళ్ళంతా రాఖాల్‌ను చుట్టేశారు.

"ఏం రాఖాల్! ఎప్పు డొచ్చావ్? ఏమిటిలా వచ్చావ్?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

ఈ ప్రశ్నలకు తట్టుకోలేక, అంతటితో వెదకటం పని కట్టిపెట్టి, ఇంటికి తిరిగి వచ్చేశాడు.

అన్న కూతురు స్వర్ణలత పినతండ్రి దిగులు కనిపెట్టింది అయితే, అతనితో ఏం మాటాడాలో, ఎలా పలకరించాలో తెలియలేదు. ఏమీ తోచక, "బాబాయ్! — చిలుంగొట్టంలో పొగాకు వేసి తీసుకురానా?" అని అడిగింది.

నీళ్ళు నిండిన కళ్ళతో "అమ్మాయ్! — మీ పిన్ని ఏమయిం దమ్మా?" — అని అడిగాడు.

"నాకూ తెలియదు, బాబాయ్! — వాళ్ళ పుట్టింటికిగాని వెళ్ళిందేమో, ఒకవేళ?—"

"నాకూ అలాగే అనిపిస్తోంది. ఏదైనా చీటీ రాసి పక్కలో పెట్టిందేమో?"— అంటూ, ఇద్దరూ వెళ్ళి పక్కచుట్ట విప్పి దులిపి చూశారు, దిండు గలీబుకూడా తీసి చూశారు. ఎక్కడా ఏమీ కనిపించలేదు.

అన్న వచ్చాడు. "విన్నావా కథ అంతా?" అని అడిగాడు, రాఘాల్ కేసి చూసి.

"విన్నాను. జాడేమైనా దొరికిందా?"

"లేదు; ఇంతవరకూ ఏమీ దొరకలే."

"నోరు తెరిచి ఎవరినైనా అడగటానికికూడా వీల్లేకొచ్చింది".

"ఏమిటి ఉపాయం ఇప్పుడు? ఊరు ఊరంతా గోలయిపోదూ?" అన్నది వదినగారు.

"ఏం చేస్తాం?— అక్కడికీ, వాళ్ళమ్మకి జబ్బు చేసిందనీ, వసంతపూర్ నుంచి మనిషి వచ్చి తీసుకువెళ్ళాడనీ, అడిగినవాళ్ళందరికీ చెప్పాను," అన్నాడు అన్న.

"కచ్చితంగా అక్కడికే వెళ్ళివుంటుం దన్నయ్యా!" అన్నాడు రాఘాల్. ఇదివరకు కూడా నాతో రావటం దాని కిష్టంలేదు. ఈసారి నే వస్తున్నా నని తెలిసి, ఆ భయంతోటే పుట్టింటికి పారిపోయుంటుంది."

"నువు చెప్పేది మరీ బాగా వుంది. ఆడది, అందులోనూ అర్ధరాత్రివేళ మూడు కోసులదూరం ఒక్కర్తే నడిచి వెళ్ళగల దంటావా?" అన్నది వదిన.

ఆమె మాటలకు అన్న అవుననీ కాదనీ చెప్పలేక, "ఒకవేళ వెళ్ళిందే అనుకుందాం, అలా వెళ్ళటం మంచిపనా? లోకం వింటే ఏమనుకుంటుంది? సంసారుల పిల్లకి ఏమిటీ బుద్ధి? అన్నాడు.

"నేను భోంచేసి వసంతపూర్ వెళతాను. సంగ తేమిటో కనుక్కుంటాను."

"సరే వెళితే వెళ్ళావుగాని, దాన్ని మాత్రం మరెన్నడూ ఈ ఇంటికి తీసుకు రావద్దు, మరెక్కడికైనా తీసుకువెళ్ళు, నీ యిష్టం. అదిమాత్రం ఇహ ఈ ఇంట్లో అడుగు పెట్టటానికి వీల్లేదు. అలాంటిది నా తోడికోడ లని చెప్పుకోలేను," అంటూ ఖచ్చితంగా చెప్పేసింది వదినగారు.

రాఖాల్ స్నానానికి లేచాడు. అప్పుడు "బాబుగా రున్నారా ?" అంటూ చౌకీదార్ వచ్చాడు.

అన్న వెళ్ళి ఏమిటి సంగ తని అడిగాడు.

"బాబుగారు రాత్రి చిన్నమ్మగారిని పుట్టింటికి పంపించారా ?" అని ప్రశ్నించాడు చౌకీదార్.

"ఊఁ. ఏం ?"—

"ఏం లేదు బాబూ, రాత్తిరి రౌండు తిరుగుతా వుంటే పొలిమేరకాడు ఇద్ద రాడోళ్ళు కనబడ్డారు. ఒకామె ఇదవ, రెండోఆమె పునిస్త్రీ. ఆళ్ళను చూసి నా కను మానం వేసింది. 'ఎవరు మీరు ? ఎక్కడి కెళుతున్నారు ?' అని అడిగాను. ఏవేవో అబద్దా లాడినారు. చివరకి — అమ్మగోరు మన చిన్నమ్మగా రని చెప్పింది ముసి లామె. అవునో కాదో తెల్సుకుందామని తమకాడికి వచ్చినాను."

"అవును, నిజమే," అన్నాడు అన్న.

చౌకీదార్ వెళ్ళిపోయాడు.

ఇప్పు డా కుటుంబంలో అందరకూ పుట్టెడు బరువు దించిన ట్టయింది.

రాఖాల్ మనస్సులో దిగులంతా మాయమయ్యింది. అన్నగారు మాత్రం కొరకొర లాడుతూనే వున్నాడు. "ఛీ ఛీ! ఏమి టీ పని ? ఏమి టీ అప్రతిష్ఠ ? పుట్టింటికి వెళ్ళా లనుంటే ఇదా పద్ధతి ? చెబితే వెళ్ళొద్దంటామా ? అర్ధరాత్రిపూట ఇలా వెళితే, ఎవ రేమనుకుంటారో అనే ఇంగితజ్ఞానమైనా లేకపోయెకదా! ఛి ఛీ! "—

స్నానానికి వెళ్ళిన రాఖాల్ రెండు గంటలయినా తిరిగి రాలేదు. అంత సేపూ ఏదో ఆలోచిస్తూనే వున్నాడు.

"బతికినంత కాలమూ అవమానంతో కుళ్ళి చావక తీర దనుకున్నాను. కాని, ఆ అవమానంనుంచి బయట పడ్డాను. అయినా, ఇలాంటి భార్యవల్ల ప్రయోజనం ఏమిటి ? బలవంతం మీద దగ్గర అట్టేపెట్టుకుంటే, ఒరిగే లాభ మేముంది ? దాని వల్ల నాకు సుఖం కలుగుతుందన్నమాట వట్టిది. భ్రాంతి; నాతో రాకపోతే పోయె, నే వచ్చేదాకా అయినా ఆగలేకపోయిందే ? ఒక్కసారి నా కంటబడితే తనకు వచ్చే నష్ట మేమిటో? పోతే పోనీ. నే నిక అత్తవారింటి కెళ్ళను. దానితో ఎలాంటి సంబం



ధమూ పెట్టుకోను. మళ్ళీ పెళ్ళి చేసుకుంటా. అంతే."... ఈ విధంగా, స్నానం చేస్తూ నీళ్ళలో వున్న రాఖాల్ ఉడికిపోయాడు.

భోజన మయ్యాక అట్టే పడుకుని, మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. నేను మళ్ళీ పెళ్ళి చేసుకోవడ మనే సంగతి ఏలాగూ ఖాయమే. అయితే, మరొక్కసారి లీలావతితో ఈ విషయం తేల్చేసుకుంటాను. వస్తుందా నా వెంటబడి రానే వస్తుంది. లేదా హాయిగా మరోపెళ్ళి చేసేసుకుంటా."

గడియారం చిన్నముల్లు రెండు గంటలు చూపిస్తోంది. ఉత్తరీయం పైన వేసుకుని, గొడుగూ సంచీ చేత పట్టుకుని బయల్దేరాడు రాఖాల్.

వసంతపూర్‌లో రాఖాల్ మామగారు కృష్ణదాసు ఘోషాల్ సంపన్న గృహస్థు. మధ్యాహ్నం నిద్రనుంచి లేచి, సావిట్లో బల్లమీద కూచుని టపా చూసుకుంటున్నాడు. ఇరుగింటి పొరుగింటి పెద్దమనుషులతో బాతాఖానీ కొడుతున్నాడు.

అటువంటి సమయంలో — పీక్కుపోయిన ముఖంతో, చెమటలు కక్కుకుంటూ రాఖాల్ వచ్చి చేరాడు.

"రావోయ్ రాఖాల్ ! — ఒరేయ్ అల్లు డొచ్చా డని ఇంటో చెప్పండర్రా ! ! — ఏం నాయనా, ఇంటిదగ్గర అంతా ఖులాసా ? అవునుగానీ, వచ్చినవాడివి లీలను

కూడా తీసుకరాలేకపోయావా ? వాళ్ళమ్మ ఇవాళ కంటతడి పెట్టుకుంది — 'పిల్ల పడమటికి వెళుతూంది, మళ్ళీ ఎప్పుడొస్తుందో, యేమో. వెళ్ళేముందైనా ఒక్కసారి చూడలేకపోయాను, పాపిష్టిదాన్ని...' అంటూ, పరిపరివిధాల అనుకుంది." అని మామగారు ఏకరువు పెట్టాడు.

లీలావతి ఇక్కడకూడా లేదని వినేసరికి రాఖాల్ బుర్ర గిర్రున తిరిగింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. బల్లమీద కూచున్నవాడు కూచున్నట్టుగానే కింద పడ్డాడు. స్పృహలేదు.

"ఏమిటి, ఏమిటీ ? ఏమిటయింది ? — అల్లుడు ! — అల్లుడూ...! — నాయనా, రాఖాల్ !" అంటూ కంగారుతో గంతులువేశాడు మామ. ఇంట్లోవాళ్ళంతా ఇవతలికి వచ్చారు. రాఖాల్‌కు ఉపచారాలు చేశారు, నీళ్ళు చల్లారు; విసనకర్రతో విసిరారు. అంతలో డాక్టరుకూడా వచ్చాడు, చూశాడు.

కాస్సేపటికల్లా రాఖాల్ తేరుకున్నాడు కాని, నీరసంచేత కూచోలేక పోయాడు. ఇద్దరు మనుషులు చెరోపక్కనా పట్టుకుని, అతన్ని లోపలికి తీసుకెళ్ళి పడుకో బెట్టారు.

కృష్ణదాస్ ఇవతలకి రావటంతోనే మరొక వింతవార్త ! — జమీందారుగారి చిన్న తమ్ముడు నవీన్ రాత్రినుంచీ కనిపించటంలేదు. నలువైపులా గాలించినా లాభం లేకపోయింది. మరొక పుకారు ఏమిటంటే — అతను సైరిభి అనే దాసీదాంతో సంత దారిని వెళుతూండగా ఎవరో చూశారట ! కానీ, సైరిభి నడిగితే 'ఆ గొడవే నాకు తెలియదు' అంది.

ఆ పట్టు పట్టు రాఖాల్, ఐదు రోజులదాకా తేరుకోలేకపోయాడు.

అతడు మళ్ళీ ఖుస్రూపూర్ చేరుకోగానే, పిడుగులాంటి మరొకవార్త చెవిని బడింది — ఒక్కనెల నోటీసుతో అతన్ని పనినుంచి తొలిగించారు.

* * * * * *

రాఖాల్ మళ్ళీ మళ్ళీ తన స్థితిని గురించి ఆలోచించాడు. ఏ కాశీకో పోయి, శేష జీవితం గడిపివేద్దా మనుకున్నాడు. అయితే, చేతిలో కాసు లేక, ఉపవాసాలతో చిక్కి చావాల్సి వస్తుందేమోనని ఒక వంక భయం కలిగింది. కానీ—'ఫరవా లేదు. లోకంలో ఎంతమంది బతకటంలేదు? నా ఒక్క ప్రాణి కింత తిండే దొరక్కపోతుందా ?' అని మళ్ళీ ధైర్యం తెచ్చుకున్నాడు.

ఈ ఆలోచన ఇలా వుండగా, సన్యాసిని గురించిన సమస్య రాఖాల్ మనసును పట్టి వదలనేలేదు :

"ఈ సన్యాసి పెట్టెలో కొద్దో గొప్పో, డబ్బో దసగమో ఉండేవుంటుంది. అది నేనే ఎందుకు తీసుకోగూడదూ? అంతా పోలీసులే మింగాలా? అంతా సర్కార్కే దక్కాలా? ఆ డబ్బు నేనే తీసుకోవటంలో తప్పేమిటి? దోవలో ఎక్కడైనా ఏదైనా వస్తువు దొరుకుతుంది; చూస్తూ అలా దాన్ని వదలేసిపోతామా?"

రాఖాల్ మెల్లిగా లేచాడు. రెండుసార్లు అటూ యిటూ పచార్లు చేశాడు. కటిక చీకటి; హోరున వర్షం. ఎవరూ లేరు. నెమ్మదిగా పార్సిల్ గదిముందుకు వచ్చాడు. దీపం తగ్గించి, తాళం తీయబోయాడు. చెయి వణికింది. తాళంచెవుల గుత్తి కిందకు జారింది. చచ్చిన సన్యాసి మళ్ళీ బతకలేదుకదా? వాడు చచ్చి భూతం కాలేదుకదా. కొంపతీసి? రాఖాల్‌కు భయంవేసింది. ఆఫీసు రూమ్‌కు వెళ్ళిపోయాడు.

రూమ్‌లో కుర్చీలో కూచుని మళ్ళీ ఆలోచించాడు. "నే నేం చిన్న కుర్రవాడినా, లేక ఆడదాన్నా?— దెయ్యం, దెయ్యం! అంటూ పారిపోయివచ్చాను. చచ్చినవాడు మళ్ళీ బతకడ మనేది ఎక్కడైనా వుందా? నా వూహ అంతా అజ్ఞానం, వట్టి అజ్ఞానం; వదులుకోను, ఈ అవకాశం వదులుకోను. పోయి, నా అదృష్టం ఎలావుందో చూసుకుంటా..."

రెండు గంటలకి సరిగా ఇరవై నిమిషా లుంది. రాఖాల్ ధైర్యంగా పార్సిల్ రూమ్‌లోకి వెళ్ళి గడియేసుకున్నాడు. రకరకాల పార్సిల్సు మధ్య కాషాయ వస్త్రాలు

ధరించిన ఆ సన్యాసి కరువు వాచే నిద్రపోతున్నట్టున్నాడు. శవంమీది గుడ్డ తప్పించాడు, రాఖాల్. మొలని ఒక పట్టుగుడ్డ సంచి. ఆ సంచిలో రెండు తాళంచెవులు, ఒక టికెట్టు, కొంత డబ్బు ఉన్నాయి.

తాళంచెవితో పెట్టె తెరిచాడు రాఖాల్. అందులో రెండు సిల్కు కాషాయ వస్త్రాలు, ఒక దోమతెర, అద్దం, గ్లాసు, ఇంకా ఏవేవో వస్తువులు, హిందీ భాగవతం, రామాయణం కనిపించాయి. ఇంకా — ఒక పెద్ద సంచీ, కావిరంగు గుడతో చుట్ట బెట్టిన దస్తరంకూడా వున్నాయి.

సంచీ, దస్తరం బయటకు తీసి, తక్కినవి మళ్ళీ పెట్టెలో పెట్టేశాడు. పెట్టెకు తాళం వేసి, తాళంచెవి సన్యాసి మొలసంచిలో పెట్టేశాడు. టికెట్టుకేసి పరీక్షగా చూశాడు. ఆ సన్యాసి సిరాథునించి హౌరా వెళ్ళుతున్నట్టు తేలింది. శవంమీద గుడ్డ కప్పి, సంచీ దస్తరం చేతబట్టుకుని రాఖాల్ లేచాడు. లాంతరు శవం ముఖంవేపు తిప్పి ఒక్కసారి చూశాడు. గతుక్కుమన్నాడు !—

ఇంత సేపూ చచ్చిపడివున్న సన్యాసి ఇప్పుడు నవ్వుతున్నాడు ! !— అతని పళ్ళుకూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి ! ! ! రాఖాల్‌కి వళ్ళు చల్లబడింది. ధైర్యంచేసి ఒక్క అంగలో గుమ్మం దగ్గరకి పోయాడు. ఇవతలికి వచ్చి తలుపులు వేసేశాడు. గబగబా ఆఫీసు గదిలోకి వచ్చిపడ్డాడు. డ్రాయర్ లాగి దస్తరం, సంచీ దాచేసి, కూజాలో నీళ్ళు రెండు గ్లాసులు గడగడమని తాగేశాడు.

రాఖాల్ ఆఫీసు గదిలో ఉన్నాడేగాని; అతని మనస్సంతా నవ్వుతున్న ఆ సన్యాసిమీదనే ఉంది. తలుపు తాళం వేసినప్పటికీ గుండెధైర్యం చిక్కబట్టలేక పోతున్నాడు.

ఉన్నట్టుండి బయట ఏదో చప్పుడు. హడిలిపోయాడు రాఖాల్ వెల వెల బోయాడు. పాలిపోయాడు. కళ్ళు రెండూ పెద్దవిచేసి, గుమ్మంవేపు చూస్తూండి పోయాడు; చప్పుడు చేరువ కొచ్చింది. రాఖాల్‌కు భయం ఎక్కువయింది. చివరికి— ఒకవ్యక్తి గదిలో అడుగుపెట్టాడు. అతను చచ్చిపోయిన సన్యాసికాదు. అతని దెయ్యమూకాదు, సిగ్నల్‌మాన్ మహావీరసింగ్ !—

నోరు తెరచి రాఖాల్ "ఇంత ఆలస్యంగా వచ్చావేం ? కాస్త పెందలాడే రాకూడదూ ? ఆఫీసులో శవం వుంది; ఇక్కడ నే నొక్కణ్ణే ఉన్నాను......" అంటూవుంటే, మహావీర్‌సింగ్ పకపక నవ్వుతూ, "ఇప్పుడేగా బాబా రెండు కొట్టింది. మీరేగా నన్ను రెండింటికి రమ్మన్నారు. అయినా, భయమెందుకు బాబా ! బతికున్నవాళ్ళు చచ్చినవాళ్ళకి భయపడతారా ఎక్కడైనా ?" అని అన్నాడు.

ఆ రాత్రి సిగ్నల్‌మాన్ అక్కడే పడుకున్నాడు.

'డ్రాయర్ లాగితే, సిగ్నల్‌మాన్ లేస్తాడేమో!— సంచీ తీస్తే ఆ గలగల ధ్వనికి అతని కనుమానం కలుగుతుందేమో!— ఈ వస్తువులు ఇంటికి చేర్చటం ఎలాగ?' ఇదే రాఖాల్ సమస్య

ఇంతలో ఫోన్ మోగింది. సిగ్నల్‌మాన్‌ను లేపాడు రాఖాల్. "ఇరవైనాలుగో నంబరు గూడ్సుబండి ఫతూయా స్టేషన్ వదిలింది. లే, లే!" అంటూ తొందర పెట్టాడు.

"సీతారాం, సీతారాం!" అనుకుంటూ సిగ్నల్‌మాన్ లేచి, తలపాగా చుట్టుకుని, సిగ్న లివ్వడానికి వెళ్ళాడు. ఇదే సమయమని రాఖాల్ డ్రాయరు తెరచి, సంచీ దస్తరం బయటికి తీసి, గబగబా ఇంటికి వెళ్ళాడు.

సంచిలో కొంత డబ్బుంది గాని, దస్తరంలో మాత్రం డబ్బూ దస్కం ఏమీ లేదు. రాఖాల్ అంచనా తప్పిపోయింది. దస్తరం నిండా ఏవేవో కాగితాలు, ఉత్తరాలు, పేపరు కటింగులూ ఉన్నాయి. ఉత్తరాలమీద 'శ్రీ శ్రీ శ్రీ మోహాంత భజనానందగిరి, తిన్‌తారియామర్ ఛాయా సిరాధూ' అని చిరునామా ఉంది పుస్తకాలు చూసి స్వామిజీ బెంగాలీ అయివుంటా డని అనుకున్నాడు రాఖాల్.

ఇంతలో ఇరవైనాలుగో నెంబరుబండి తాలూకు రెండోగంట వినిపించింది. సిగ్నల్‌మాన్ మళ్ళీ వస్తాడు. రాఖాల్ రూపాయలూ, దస్తరం పెట్టెలో పెట్టి, తాళం వేసి, గబగబా స్టేషన్‌కి వచ్చిపడ్డాడు.

తెల్లవారింది.

పంచాయతీ పెద్దలూ, అధికారులూ, డాక్టరూ వచ్చారు. శవాన్ని బయటికి తీశారు. పరీక్షచేసి, సర్టిఫికెట్ ఇచ్చాడు డాక్టరు. సన్యాసి సామాన్లన్నీ వెతికారు. పది రూపాయిలూ, కొంత చిల్లరా దొరికింది. ఆ డబ్బు ఖర్చుపెట్టి దహన క్రియలు జరపడానికి నిశ్చయించారు.

ఈ సన్యాసి ఏ దేశపువాడై ఉంటా డని అధికార్లకు అనుమానం వచ్చింది.

"బెంగాలీ" అని రాఖాల్ నోరుజారాడు. చటుక్కున నాలిక కరుచుకుని, ఎందు కన్నానా ఈ మాట అనుకున్నాడు.

రాఖాల్ ఈ మాట అనగానే, "బెంగాలీ అని నీ కెలా తెలుసు?" అని అడిగాడు ఇన్‌స్పెక్టరు.

"నా కేం తెలియదండీ. అతని మొహం చూస్తే అలా అనిపించింది" అని చెప్పి సద్దుకున్నాడు.

"ఈ సన్యాసి మన అసిస్టెంట్ స్టేషన్‌మాస్టర్ లాగే ఉన్నాడు. ఇద్దరి పోలికలూ ఒకలాగే ఉన్నాయి. ఒకవేళ అతని తమ్ముడు కాదుకదా? ఆ గడ్డమూ, జడలూ లేకపోతే అచ్చం మన రాఖాల్ బాబే! సన్యాసి పెదిమలకంటె రాఖాల్ బాబు పెదిమలు కాస్త పలచన, అంతే. ఇద్దరూ ఒక్క అచ్చున పోసినట్టున్నారు" అంటూ నలుగురూ నాలుగు విధాల అనుకోసాగారు.

"మీ తమ్ముడే అయితే, వేరే ఎవరికోసమో వెదకట మెందుకూ? దహన క్రియలు మీరే జరపండి" అన్నాడు, ఇన్‌స్పెక్టరు, నవ్వుతూ.

అంతా గొల్లున నవ్వారు.

రాఖాల్‌కూడా సిగ్గుతో ముసిముసి నవ్వులు నవ్వాడు. దహనక్రియలు జరపడం రాఖాల్‌మీదే పడింది.

* * *

చాలా రోజుల తరవాత –

రాఖాల్ మనస్సు ఇవాళ కాస్తంత ఆనందంగా వుంది. హాయిగా వుంది. ఏదో ఆలోచిస్తోంది.

'సన్యాసి తాలూకు సొత్తు అయిదువంద లుంది. దీనికితోడు ప్రావిడెంట్ ఫండు, పోస్టాఫీసులో డబ్బు, అన్నీ కలుపుకుని రెండుమూడేళ్ళు గడపవచ్చు. ఈ లోగా ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోతుందా? లేదా, ఏదయినా వ్యాపారం చేస్తా. చిన్న దుకాణం పెట్టుకుంటా......' ఈ విధంగా రాఖాల్ ఆ రాత్రంతా ఆలోచిస్తూ గడిపాడు.

ఏదేనా పుస్తకం చదువుదా మనిపించింది. దగ్గరున్న డిటెక్టివ్ నవల తీశాడు. నడవలేదు. అయినా అది ఇదివరకోసారి చదివిందే. సన్యాసి దస్త్రంలో ఏముందో చూదా మని పైకి తీశాడు. అందులో ఉత్తరా లన్నీ హిందీలో ఉన్నాయి.

పేపర్ కటింగులు తీసి చూశాడు.

"బాళులీపాడా, ఈ నెల 12 వ తేదీని జమీందారు నగేంద్రనాధ్ చటర్జీ శ్రాద్ధ క్రియలు నిర్విఘ్నంగా ముగిశాయి. చటర్జీగారి జ్యేష్ఠ పుత్రులు చాలాకాలంగా ఎక్కడున్నదీ తెలియకపోవటంవల్ల కనిష్ఠపుత్రులు శ్రీ దేవేంద్రనాథ్ చటర్జీ కర్మకాండ నిర్వర్తించారు." అనే వార్త ఎర్రసిరాతో చుట్టూతా గియ్యబడివుంది.

మరొక కటింగు:

"నూరురూపాయలు బహుమతి!

గత లక్ష్మివారంనాడు నా పెద్దకుమారుడు చి॥ భవేంద్రనాధ్ చట్టోపాధ్యాయ్ ఇల్లు విడిచి ఎక్కడికో వెళ్ళిపోయాడు. వయసు 14 సంవత్సరములు. ఎవరయినా



కుర్రవాని ఆచూకీ తెలియజేసినా, తీసుకువచ్చి అప్పగించినా రూ. 100/- లు బహుమతి ఇవ్వబడును.

నగేంద్రనాథ్ చట్టోపాధ్యాయ్."

రాఖాల్ ఆలోచించాడు : 'ఈ సన్యాసి కేవలం సన్యాసికాదు. గొప్పఇంటి బిడ్డ. ఇంటినుంచి పారిపోయి, మళ్ళీ ఇన్నాళ్ళకు ఇంటికి వెళుతున్నాడులా వుంది. తండ్రి ఆస్తి పాస్తులు స్వాధీనం చేసుకుందుకి వెళుతున్నాడులా వుంది. ఇదేదో కొత్త కథలా కనిపిస్తూంది. ఈయన చరిత్ర తప్పక చదివి తెలుసుకోవలసిందే.'

సన్యాసి జీవితం మొదటిభాగ మంతా ఒక కథలాగా వుంది. రెండోభాగం డైరీ లాగా రాసివుంది. యాదాలాపంగా పేజీలు తిరగేస్తూవుంటే --

"...ఈ వ్యర్థసన్యాసాన్ని వదిలేసి, మళ్ళీ గృహస్థాశ్రమంలోకి వెళ్ళటానికి నిశ్చయించుకున్నాను..." అనే మాటలు అతన్ని ఆకర్షించాయి.

రాఖాల్ పుస్తకం మూసేసి, పక్కమీదినుంచి లేచాడు. అటూ ఇటూ పచార్లు ప్రారంభించాడు. ఉండి వుండి కిటికీలోంచి బయటికి చూస్తున్నాడు. అతని ముఖంలో భయం, విషాదం, అంతలోనే రవంత సంతోషం—ఇలా రకరకాల భావాలు కన

బడుతున్నాయి. తనలో తనే ఏమిటో నవ్వుకుంటాడు. అలా పచార్లు చేస్తూ చేస్తూ, ఆలోచిస్తూ ఆలోచిస్తూ, ఉన్నట్టుండి ఇలా అన్నాడు:

"రాఖాల్ !— చచ్చిపో; నువు చచ్చిపో. చచ్చిపోయి ఖగేంద్రంగా జన్మించు..."

* * * * *

"ఇదుగో కనకం ! — ఈ ప్రకటన చూశావా ? నే చెప్పినట్టు విను. ఈ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టు. జాసులీపాడా రాణీగారికి నువు తప్పక నచ్చుతావు. నీ కీ ఉద్యోగం తప్పక దొరుకుతుంది. కొన్నాళ్ళపాటు నువ్వు ఆమె సహచరిగా నటించాలి. ఇదే ఈ నాటకంలో నీ పాత్ర. చిన్నరాణీకి భర్త పోయాడు. ఆమె ఇంకా ముక్కుపచ్చలారని ముద్దుగుమ్మ. నువ్వామెను నాకు భార్యగా చేయాలి. ఆమెను నువ్వు ఒప్పించాలి. ' నా పని సఫలం చేశావంటే, నీకు గొప్ప బహుమతి ఇస్తాను. అంత వరకూ నెలకు రెండువందలు జీత మిస్తాను." అంటూ ఖగేంద్రనాధ్ కనకలతను ఆశ పెడుతున్నాడు.

కనకలత పకపక నవ్వి, "బాగానేవుంది నీ నాటకం. ఒకవేళ ఆమె కురూపి అయితే ? "

"ఏం ? — కురూపి అయితే ఎవరూ పెళ్ళి చేసుకోరా ? "

"ఓహో — ఆమె డబ్బుకోసం ఎత్తు వేస్తున్నావా ? "

"నేను అలాంటివాణ్ని కాను. వితంతు వివాహం చేసుకుని, బంగాళా దేశానికి ఆదర్శపురుషుడి నవుతాను."

"అయ్యో ! — ఈ దేశాన్ని గురించి చింతతో నీకు నిద్ర ఎక్కడ పడుతుందీ, పాపం ! — అవునుగాని, ఆ ఎస్టేటంతా ఆమె చేతిలోనే వుందా ? "

"ఉండడ మేమిటి ? ఆమెదే పెత్తనమంతా. లక్షకు పైన రాబడి. అందుకనే ఈ హంగామా."

"ఆమె సనాతన కుటుంబానికి చెందినది. నిన్ను పెళ్ళాడటానికి చటుక్కున ఒప్పుకుంటుం దనుకున్నావా ? "

"అంత చప్పున ఒప్పుకునే దయితే నేను నీ గుమ్మంలో కెందుకు వస్తానూ ? — నువ్వక్కడికి వెళ్ళి ఆమెను వశపరచుకోవాలి. వితంతు వివాహాన్ని గురించి ఆమెకు నూరిపోయాలి. ఆమెకు ఎనిమిదో ఏట పెళ్ళయింది. రెండు నెలలకే భర్త పరారీ అయ్యాడు మామగారూ, మరిదీ పోయారు. ఆమెకు ఒక ముసలి అత్తగారు మాత్రం మిగిలుంది. ఒంటరిగా ఉండలేక ఈ ప్రకటన వేయించింది—నువు చదువుకున్న దానివి. సంగీతజ్ఞానం వుంది. దరఖాస్తు పెడితేచాలు, నీ కీ ఉద్యోగం దొరికితీరుతుంది."

* * * * *

ఆమెకు ఇరవై యేళ్ళుంటాయి. చూస్తే పునిస్త్రీలాగానే కనబడుతూంది. ముఖంలో విషాదం, కళ్ళమ్మట నీళ్ళు నిండివున్నాయి. బాళలీపాడా జమీందార్ల భవనం దగ్గిర — గంగలో కొట్టుకువచ్చి — మెడమీద గాయాలతో, కొనప్రాణా లతో గట్టు చేరుకుం దామె. చినరాణి ఇందుమతీదేవి స్నానానికి వెళ్ళినప్పుడు గట్టుకి చేరి, కొనప్రాణంతో ఆమెను చూసింది. బయట పడేసి బతికించింది. ఆమెకు స్పృహవచ్చి కోలుకున్నాక చినరాణి అడిగింది: "అమ్మా!— నీ పే రేమిటి ?"

"సురబాల"

"మీ పుట్టిల్లు ఏ వూరు ? అత్తా రేవూరమ్మా ?"

ఈ ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పలేదు. ఏడుపు మొదలెట్టింది. ఇక రాణి ఆమెనుగురించి అట్టే తెలుసుకుందికి ప్రయత్నించ వేదు. దాసీలను కూడా ఏమీ అడగ వద్దని కట్టడి చేసింది. రోజూ తనే వచ్చి చూసివెళుతూంది.

వారం రోజుల తరవాత —

"అమ్మాయీ! — నువ్విక్కడికి వచ్చి వారం దాటింది. నీవా ళ్ళెక్కడున్నారో ఏమీ చెప్పావుకాదు. నీకోసం వాళ్ళేం బెంగ పెట్టుకున్నారో? ఏం బెగిలిపోతు న్నారో! — వాళ్ళకి కాస్త కబురు చెయ్యటం మంచిదికాదూ ? — వచ్చి నిన్ను తీసుకు వెళతారు," అన్నది చినరాణి.

"రాణీగారూ! — నా కోసం బెంగ పెట్టుకునేవాళ్ళు గాని, నే నిక్కడున్నా నని తెలిసి సంతోషించేవాళ్ళు గాని నా కెవరూ లేరు. మీరు నాకు జీవనాధారం కల్పిస్తా నంటే నా దొక మనవి :"

"ఏమి టది చెప్పు తల్లీ ! —"

"తమది జమీందారీ. దేవుడి దయవల్ల మీకు దేనికీ లోపంలేదు. నే బతికివున్నంత కాలమూ నాకు మీ యింట్లో ఆశ్రయం ఇప్పించండి. నన్నూ ఒక దాసీగా భావించండి. నన్ను వదిలెయ్యకండి" అంటూ జాలిగా ప్రార్థించింది సురబాల, కళ్ళనీళ్లు రాలుస్తూ.

రాణి ఇందుమతి సురబాల కళ్లు తుడిచింది. ఓదార్చింది. "ఈ భాగ్యానికే ఇంత భయ మెందుకు తల్లీ! — నిన్ను పంపించేస్తానని నే నెప్పుడూ అనలేదే ? లేదమ్మా. లేదు. నిన్నెక్కడికీ వెళ్ళనివ్వను. నా దగ్గరే ఉంచుకుంటా. ఊరుకో. ఏడవకమ్మా. ఏడవకు..."

ఇందుమతి దుఃఖం కాస్సేపటికి ఆగింది.

"చూడమ్మా చెల్లాయ్ ! — నేనూ ఒంటరిగా వున్నాను. నాకూ తోడు కావాలని మా దివానుగారు పత్రికలో వేయించారు. వేరే ఎవరినో పిలవటం దేనికీ, నిన్నే నాకు తోడుగా వుంచుకుంటా, ఏం ? — "

*　　　　　　*　　　　　　*

"అమ్మా ! — మనం పత్రికలో వేయించిన ప్రకటనకి వచ్చిన దరఖాస్తు లివిగో. ఇందులో నాలుగు మన కేమీ పనికిరావు. ఈ అయిదో దరఖాస్తు పంపిన మనిషి మనకి పనికివచ్చేలా కనిపిస్తుంది. రామాయణం, భారత భాగవతాలు శ్రావ్యంగా చదివి విని పించ గలదట. మనకి కావలసినదీ అలాంటి మనిషే. కనుక మీ మనస్సుకి కాస్త సంతోషం కలిగించగలదై వుండాలి. అంతేకదమ్మా ?" అని అడిగాడు దివాను.

సురబాలను సహచరిగా పెట్టుకుంటా నని చెబుదా మనుకుంది చినరాణి. కాని సందేహించింది. ఇప్పుడు దివాన్ మాటలు విన్నమీదట అసలే వీల్లేకపోయింది. దివానుకి నచ్చిన దరఖాస్తు చూసింది.

"ఈ అమ్మాయినే నియమించా లని నా ఉద్దేశం. ఏమంటా రమ్మా ?" తన వుద్దేశం వెల్లడించాడు దివాన్.

"అలాగే కానియ్యండి. సురబాలా వుంటుంది; ఆమెనూ రానియ్యండి. మీ కెలా మంచిదని తోస్తే అలాగే చేదాం బాబయ్యగారూ !" అంది చినరాణి.

"అయితే, అలా గని ఉత్తరం రాయనా ? — "

"రాయండి. రాస్తూ, ప్రయాణపు ఖర్చులకూ, బట్టలకూ వాటికీ కూడా డబ్బు పంపండి."

*　　　　　　*　　　　　　*

ఆర్డరు ప్రకారం కనకలత ఖగేంద్రనాధ్‌తో బాశులీపాడా జమీన్‌లో అడుగు పెట్టింది. ఆమెను అంతఃపురంలోకి పంపించి ఖగేంద్రుణ్ని కచేరీహాల్లో కూచో పెట్టారు ఉద్యోగులు.

ఖగేన్ ఫలహారం ముగించి కూచున్నాడు. దివాను వచ్చాడు. "ప్రయాణం సుఖంగా జరిగిందా ?" అంటూ దివాన్‌జీ, దిక్కులు చూస్తున్న ఖగేంద్రుడ్ని కుశల ప్రశ్నలు వేశాడు.

ఖగేంద్రు డేదో సమాధానం చెప్పాడు.

ఎస్టేటులో కేసు లేమైనా దొరకుతాయేమో అని కదిపిచూచాడు. కాని, అదేం లాభం లేకపోయింది. కోర్టువ్యవహారాల్లోనూ, లిటిగేషన్‌లలోనూ ఆరముగ్గిన దివాన్జీ వేసిన రెండు మూడు ప్రశ్నలకే ప్లీడర్ ఖగేంద్రుడు బోల్తాకొట్టాడు. తన తెలివి

తక్కువను సరిదిద్దుకుందుకు ప్రయత్నించాడు. కాని, లాభం లేకపోయింది. దీనితో ఖగేంద్రుడికి దివాన్జీ ముఖం చూడటానికికూడా సిగ్గుగావుంది.

ఏ దెలావున్నా, అతనికి జమీందారీలో అతిథి మర్యాదలు సవ్యంగానే జరుగుతున్నాయి. అందు కేం లోటులేదు. కనకలత ద్వారా ఇందుమతీదేవితో పరిచయం చేసుకోవాలని ఎన్నో విధాల తాపత్రయపడ్డాడు ఖగేంద్రుడు.

"ఒకసారి రాణి నీ ముఖం చూసిందంటే, మన పని తేలికవుతుంది" అని కనకలత మాట.

రోజు గడిచింది, రెండు రోజు లయింది, మూడవ రోజునకూడా చిన్నరాణి ముఖం చూస్తే — తన అంద చందాలను ఆమెకు ప్రదర్శించే అవకాశం మాత్రం అతనికి దొరకలేదు.

నాల్గో రోజున "మా చెల్లెల్ని ఒకసారి కలుసుకోవాలి" అని గుమాస్తా నడిగాడు ఖగేంద్రుడు.

"సరే, రాణీగారి కీ సంగతి తెలియజేస్తాం. వా రనుమతిస్తే, వెళ్ళి మీ చెల్లెల్ని కలుసుకోవచ్చు" అన్నాడు గుమాస్తా.

దివాణంలో ఈ నిర్బంధాలు చూస్తూవుంటే ఖగేంద్రుడికి తన పథకమంతా తలకిందు లయేట్టు కనిపించింది.

ఎలా అయితేనేం, రాణిగారి అనుమతి దొరికింది. నిర్ణీతసమయానికి నౌకరు వచ్చి ఖగేంద్రుడ్ని అంతఃపురం వరకూ తీసికెళ్ళాడు. అక్కడ ఒక పరిచారికకు అప్పగించాడు. పరిచారిక అతన్ని ఒక గదిలో కూచోబెట్టి, "మీ రిక్కడే ఉండండి" అని చెప్పి వెళ్ళిపోయింది.

కాస్సేపటికి కనకలత వచ్చింది.

ఇద్దరూ ఏమిటేమిటో మాట్లాడుకున్నారు చివరికి విడిపోయారు. దాసీది వచ్చి, ఖకేంద్రుణ్ని మళ్ళీ వచ్చినచోటికి తీసుకుపోయింది.

*   *   *   *

అందచందాలతో తీర్చిదిద్దిన చినరాణీగారి గదిలో చిత్రాలమధ్య ఖగేంద్రుడి చిత్రాన్ని కూడా ఉంచబోయింది కనకలత. కానీ, రాణీ "మీ అన్నఫోటో నీ గది లోనే వేసుకో" అన్నది.

అందుకు కనకలత కల్లబొల్లిగా ఏడుస్తూ, "అమ్మా, నాకు తల్లిలేదు. తండ్రి లేడు. నాకు 'నా' అన్నవాడల్లా ఒక్కఅన్న. వాడుతప్ప నాకీ ప్రపంచంలో మరెవ్వరూ లేరు. వాడినే చూస్తూ ఉండాలని నేకోరుకుంటా. పగలల్లా నేను మీ గదిలోనేకదా వుండేది ? ఇక ఈ ఫొటో నా గదిలో వున్నా ఒకటే, లేకపోయినా ఒకటే." అంటూ కంటతడి పెట్టుకుంది. అమాయకురాలు ఇందుమతీదేవి అనుమతించింది.

చినరాణి గది అంతా అధునాతన విధానంలో అలంకరింపబడింది. ఆ అలంకారాల మధ్య ఇందుమతిని వలలో వేసుకుందుకు ఉపాయాలు పన్నుతూవుంది కనకలత. కానయితే, ఆమె అందరిలాంటి ఆడమనిషికాదు. చాలా స్థయిర్యం కలది. బాగా ఆలోచించిగాని ఏ నిర్ణయానికీ రాదు. ఆమె నిర్ణయాన్ని మార్చటం ఎవరికీ తరం కాదు ఇదే కనకలతకు కొరకరాని సమస్య అయికూచుంది.

*   *   *   *

ప్రియమయిన సోదరి కనకలతకి —

చినరాణిగారు నీ మీద ఇంత ఆదరం, స్నేహం చూపుతున్నందుకు ఆమెకు నే నెంతో కృతజ్ఞుణ్ని.

అమ్మా నాన్నా నిన్ను నా చేతుల్లో పెట్టిపోయారు. పెళ్ళయిన మూడేళ్ళకే నీకు వైధవ్యం ప్రాప్తించింది. నీ ఈ దుఃఖం నన్ను దహించివేస్తూంది.

సుశీలబాబు నీమీద చాలాకాలంగా ఆశలు పెట్టుకుని వున్నాడు. ఆ సంగతి నీకూ తెలుసు. నువ్వు అంగీకరిస్తే నిన్ను పెళ్ళి చేసుకుంటాడట. లేకపోతే ఆజన్మ బ్రహ్మచారిగా వుండిపోతాడుట.

కనుక, నా మాట విను. వివాహానికి సమ్మతించు. ఇందులో తప్పేమీ లేదు నా మాట మీద నీకు నమ్మకం లేకపోతే రాణిగారి నడుగు నువ్వంటే ఆమెకు అపేక్ష కదా ? — జీవితాన్ని ఇలా అంధకారంలో వుంచుకోమని ఆమె ఎన్నటూ సలహా ఇవ్వరని నా దృఢవిశ్వాసం. ఆమె బుద్ధిమంతురాలు. పెళ్ళి చేసుకోమనే ఆమె నీకు సలహా ఇస్తారు.

* * * * *

——ఇదీ కనకలతకు ఖగేంద్రుడు రాసిన ఉత్తరం. ఉత్తరంతో పాటు, వితంతు వివాహాన్ని గురించి రెండు పుస్తకాలు కూడా పంపాడు.

కనకలత ఈ ఉత్తరమూ, పుస్తకాలూ దేవికి చూపించింది. వాటిని చూస్తూన్న రాణి ముఖకవళికలు గమనిస్తూనేవుంది.

ఇందుమతి ఉత్తరాన్ని కింద పారేసింది. పుస్తకాలను కిటికీలోంచి తోటలోకి విసిరేసింది. గుమ్మంవేపు పోబోయింది.

''ఎక్కడికీ వెళుతున్నారు ?'' — అని అడిగింది కనకలత.

''అపవిత్రమయిన నా చేతులు గంగలో కడుక్కు రావటానికి'' అంటూ రాణి వెళ్ళిపోయింది.

గతుక్కుమంది కనకలత.

* * * * *

ఠంగుమని గడియారం గంట కొట్టింది. అంతా నిశ్శబ్దం. చిన్నరాణి ఇందుమతీదేవి ఏదేదో ఆలోచిస్తూంది. కనకలత — ఆమె కథ, ఆమె ప్రవర్తన, వీటిని గురించే ఆలోచన. ఆ ఆలోచన కనకలత మీదినుంచి తన మీదికే మళ్ళింది. పెళ్ళిఅయి ఈ ఇంటో అడుగుపెట్టేసరికి ఆమెకు ఎనిమిదేళ్ళు. భర్తకు పధ్నాలుగేళ్లు. అప్పుడు వారంరోజులు మాత్రమే తా నిక్కడ ఉంది. ఆ వారంరోజుల్లోను సిగ్గు మూలంగా భర్తతో సరిగా మాటయినా మాటాడ లేకపోయింది. ఆతరువాత తను పుట్టింటికి వచ్చిన రెండు నెలలకే భర్త పరారీ అయ్యాడు. భర్త ముఖమైనా ఆమెకు లీలగా మాత్రమే జ్ఞాపక ముంది...

అతన్ని గురించిన మరికొన్ని వూహలు ఆమెలో ఇంకా అలా శాశ్వతంగా ఉండిపోయాయి. అతను ఈ గదిలోనే భోంచేసేవాడు. ఈ గదిలోనే చదువుకునే వాడు. ఈ గదిలోనే నిద్రపోయేవాడు. ఇదుగో — ఇక్కడే అతని పెంపుడు పావురా ఉండేవి. ఈ తోటలోనే పెంపుడు కుక్కతో పరుగులెత్తుతూ ఆడేవాడు. ఉదయాన్నే గంగాస్నానం చేసి, ఇటునుంచే తిరిగి వచ్చేవాడు. ఆ వ్యక్తి — ఆమె నాథుడు —

ఆమె దేవుడు ఏడీ?— ఎక్కడ వున్నాడు? ఏళ్ల మీద ఏళ్లు గడిచినా, అతని జాడ మాత్రం తెలియటం లేదు. అత డింక బతికి వుండడని అత్తమామలు నిరాశ చేసు కున్నారు. తలచుకుంటే ఆమె మనస్సు మరింత అంధకార మయింది...

అప్పటినుంచి ఆమె తన భర్తను మామూలు మానవుడుగా భావించుకోవటం మానివేసింది. పుణ్యాత్ముడుగా, దైవంగా, అమరుడుగా, స్వర్గంలో ఒక దివ్య జ్యోతిగా వెలుగుతున్నా డనుకునేది తన భర్త తనకోసం ఆ అమరలోకంలో నిరీ క్షిస్తూ ఉంటాడు. ఇహంనుంచి ముక్తి లభించగానే తను తన భర్తదగ్గరకు వెళ్ళి పోతుంది. అప్పుడు ఆమే, అతనూ కలుసుకోగల్గుతారు...

ఠంగున గంట కొట్టింది ఏదేదో ఆలోచిస్తూ అప్పుడే నిద్రపోతున్న ఇందుమతీ దేవి గతుక్కుమని లేచింది. కళ్లు తెరిచి చూసింది. సూర్యోదయం కావస్తూంది గబగబా లేచి గంగాస్నానానికి బయల్దేరింది.

దోవలో సురబాల ఎదురయింది.

"నీకు రాత్రిళ్ళు కలలు వస్తాయా ?—" అడిగింది చినరాణి.

"ఆఁ: అప్పుడప్పుడు వస్తూవుంటాయి."

"అయితే, నీ కల లెప్పుడైనా నిజమయినాయా ?—"

"తెల్లారగట్ల వచ్చిన కలలు నిజమవుతా యంటారు. నే నొకసారి పుట్టింటి దగ్గ రుండగా నా కొక ఉత్తరం వచ్చినట్టు కల వచ్చింది. మర్నాడు నిజంగానే నా భర్త దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. మీకూ కలలు వస్తాయా ?—" అని అడిగింది సురబాల.

"అప్పుడప్పుడు — ఇవాళ తెల్లారగట్ల నా కో కల వచ్చింది."

"అయితే — తప్పకుండా ఫలిస్తుంది. ఇంతకీ ఏమి టా కల ?—"

"ఇప్పుడు కాదు. మధ్యాహ్నం చెబుతా."

"భగవంతుడు మి మ్మల్ని అన్యాయం చేశాడు ఇన్ని సుగుణాలు, ఇన్ని తెలివి తేటలు, ఇంత ఐశ్వర్యం ఇచ్చిన ఆ దేవుడు మీ కింత కష్టం ఎందుకు తెచ్చిపెట్టాడో నా కేం తెలియటంలేదు. నాకు కష్టాలు వచ్చాయంటే అందుకు తగినన్ని కారణా లున్నాయి. కాని, మీ కేమిటి; ఈ కష్టా లేమిటి ?—"

"లేదు చెల్లీ !— దేవుడు ఆలోచించకుండా ఏ పనీ చెయ్యడు ఏ దెలా వున్నా ఈ కష్టాలకూ, దుఃఖాలకూ ఫలితం చివరికి మంచిగానే పరిణమిస్తుంది ఇది మాత్రం నిశ్చయం" అన్నది చినరాణి.



''నేనూ మీలాగే ఇలా అనుకుని నమ్మగలిగినట్టయితే — నాకూ మనశ్శాంతి లభించివుండేది'' అన్నది సురబాల, తెల్లబోయి.

*　　　　*　　　　*

మధ్యాహ్నం :

"ఏం అమ్మా, ఏం కల వచ్చిందీ, నాకు చెబుతా మన్నారు, చెప్పనేలేదే ! — ఏమి టా కల ? ఎవర్ని గురించి వచ్చింది ? —"

''చెబుతా విను, చెల్లీ ! — రాత్రి ఎందుకో మనసు బాగుండక, చాలా నేపటిదాకా నిద్ర పట్టింది కాదు. ఏమిటేమిటో ఆలోచిస్తూ పడుకున్నా ఎప్పుడు నాకు నిద్ర పట్టిందో తెలియదు. కానీ, నా కో కల వచ్చిన సంగతి బాగా జ్ఞాపక ముంది—

''వంటినిండా నగలు పెట్టుకున్నానుట నేను. పట్టుబట్టలు కట్టుకున్నానుట. నుదుట కల్యాణపు బొట్టు వుందిట. నా చుట్టూ పేరంటాళ్లు గుమికూడి వున్నారట. నన్ను వేళాకోళా లాడతారట ఇంతలో చీకటిపడింది. దీపాలు వెలిగాయి. 'పెళ్ళికొడుకు వచ్చాడు, పెళ్ళికొడుకు వచ్చాడు ! !' అంటూ కోలాహలం. శంఖారావం..."

"తర్వాత ? —" అడిగింది సురబాల, ఎంతో ఉత్సాహంగా.

''ఇంకేముంది — మెళకువ వచ్చేసింది. కళ్ళు తెరచి చూస్తే, అప్పుడే తెల్లతెల వారుతూంది.''

"చాలా మధుర స్వప్నం కదూ. అయితే ఈ కల నిజ మెలా అవుతుంది ? —" నిట్టూర్చింది సురబాల.

చినరాణి కళ్ళలో నీళ్ళు మిలమిల మెరిశాయి. "ఎందుక్కాదు చెల్లీ ! — తప్ప కుండా నా కల ఫలిస్తుంది. అయితే ఈ జన్మలో కాదు. పరలోకంలో — నా భర్త విహరించే స్వర్గంలో — అయితే, స్వర్గానికి వెళ్ళేంత సుకృతం నా కుందో లేదో. అయినా, వారు నన్ను స్వర్గానికి తప్పకుండా తీసుకు వెళతారు. అక్కడ మళ్ళీ మాకు వివాహం జరుగుతుంది. నే పెళ్ళికూతు ర్నవుతాను..." చినరాణి అశ్రువు లలో ఆశా, ఆనందమూ మిలమిలా మెరిశాయి.

"తప్పకుండా అలాగే జరగాలి. దేవు డలాగే చెయ్యాలి. మీలాంటి సౌభాగ్యం నాకూ్కడా కలగా లని నన్నూ దీవించండి" అంటూ, చినరాణి పాదధూళి తీసుకుంది సురబాల.

''అదేఁటి ? — నా కాళ్ళమీద చేతులు వేస్తా వెందుకు ? — ''

"నేను పవిత్రమైన మీ పాదధూళికి కూడా తగను. నా జీవితగాథ కూడా మీకు చెబుతాను, ఎప్పుడో...''

ఉన్నట్టుండి, బిగ్గరగా శంఖారావాలు వినవచ్చాయి. చినరాణీ, సురబాలా చెవులు రిక్కించి విన్నారు. ఆశ్చర్యపోయారు. ఒకరిముఖా లొకరు చూసుకున్నారు.

ఇంతలో ఒక పండు ముత్తయిదువ కుంకుమబరిణెతో ఆయాసపడుతూ వచ్చింది. "అమ్మా !— మన బాబుగారు బతికేవున్నారు. ఉత్తరం వచ్చింది..." అంటూ, వణుకుతున్న చేతులతో ఇందుమతీదేవి పాపిట్లో కుంకుమబొట్టు పెట్టింది.

ఈ ఆనంద ప్రవాహానికి ఇందుమతి తట్టుకోలేకపోయింది. లతలాగా అల్లల వణికిపోయింది; పడిపోయింది. కాని, సురబాల పట్టుకుంది. మూర్ఛపోయిన చిన రాణిని లోపలికి తీసుకువెళ్ళారు

* * *

ఖుస్రుపూర్ వదిలిన రాఖాల్ భట్టాచార్య, భవిష్యత్తునుగురించి రకరకాలుగా ఊహించుకోసాగాడు. కాశీకి వెళుతున్నా నని చెప్పి బయల్దేరినవాడు అలహాబాద్‌లో దిగాడు. అక్కడ కర్మకాండ చేయించుకున్నాడు. ఏవేవో గుడ్డలు కొన్నాడు. కావి రంగు కొని, వాటికి పట్టించాడు. అలహాబాదులో రెండురోజు లుండి, కాశీకి ప్రయాణం కట్టాడు.

అక్కడ ఒక యిల్లు అద్దెకు తీసుకున్నాడు. వాళ్ళ సంప్రదాయానికి సంబంధించిన పుస్తకాలు సంపాదించి చదివాడు. ఖుస్రుపూర్ వదిలినప్పటినించీ ఎవడేనా నీ పేరేంటి అని అడిగితే భవేంద్రనాథ ఛటోపాధ్యాయ్ అని చెప్పేవాడు. రోజూ భోజనానంతరం భవేంద్రుడి ఆత్మకథ చదివేవాడు. అందులోని సంగతు లన్నీ బాగా చదివి జీర్ణం చేసుకున్నాడు.

పదిహేనురోజులు గడిచాయి.

ఒకసారి బాళులీపాడా వెళ్ళి అక్కడి పరిస్థితులూ పరిసరాలూ చూసుకురావటం ఎంతయినా అవసర మనిపించింది.

ముసల్మాను దుస్తులు కుట్టించాడు. పల్లెటూరు చెప్పులు కొన్నాడు. ఒక ఫకీరుకి డబ్బు లిచ్చి భిక్షాపాత్రా ఇంకా ఏవేవో కొన్నాడు.

ఫకీరువేషంలో బాళులీపాడాలో అడుగు పెట్టాడు రాఖాల్. ఆ చుట్టుపక్కల గ్రామా లన్నీ తిరిగాడు. భవేంద్రుడి జీవితానికి సంబంధించిన స్థలా లన్నీ తిరిగి చూచాడు. అతని చరిత్రలో తారసపడిన దివాను, ఎస్టేటు ఉద్యోగులు — వీళ్ళని గుర్తుపెట్టుకున్నాడు. ఇలా ఒక వారంరోజులు అక్కడ గడిపి, మళ్ళీ కాశీకి తిరిగి వచ్చేశాడు.

*　　　*　　　*

కాశీక్షేత్రం

పరమ పూజ్యులయిన శ్రీ నాన్నగారి
పాదసన్నిధికి : నమస్కారములు —

చాలా కాలానికి ఇప్పుడు అధముడు, అయోగ్యుడు అయిన మీ కుమారుడు పశ్చాత్తాపం పొంది రాయునది : పదహారేళ్ళక్రితం నేను ఇల్లు విడిచిపోయాను. నా వార్తలు మీకు తెలియవు. నేను బతికివున్నా ననే ఆశకూడా మీరు వదులుకుని వుంటారు. ఇల్లు వదిలాక కొంతకాలం అలహాబాదులో వున్నాను. నాకోసం మీరు 'వంగవాసి' పత్రికలో వేసిన ప్రకటన చూశాను. నన్ను పట్టుకుంటా రని మన దేశస్థులు లేని ప్రదేశాలకు పారిపోయాను తిన్‌తారియా మఠాధిపతి గిరిమహారాజు అనుగ్రహాన్ని సంపాదించాను; వారి శిష్యుడ నయ్యాను. వారు చనిపోయాక వారి స్థానాన్ని పొందాను.

కాని; ఇప్పుడీ సన్యాసి జీవితమంటే రోతగావుంది. రెండేళ్ళనుంచీ ఇంటికి రావాలని అనుకుంటున్నాను. అయితే మనస్సు స్థిరపరుచుకోలేకపోయాను.

రెండు నెలలక్రితం మీరు కలలోకి వచ్చారు. కళ్ళజబ్బుతో షేడ్సు తగిలించుకుని పసుపుపచ్చ చేతిగుడ్డ పుచ్చుకుని మీరు నన్ను ఇంటికి రమ్మన్నట్టు కనిపించారు. ఆవేళ నా కెంత ఏడుపు వచ్చిందో చెప్పలేను. మర్నాడే మఠాన్ని వదిలిపెట్టాను. పుణ్యక్షేత్రాలు చూసుకుంటూ కాశీ చేరుకున్నాను.

పూరీ, రామేశ్వరం కూడా దర్శించుకుని, జ్యేష్ఠమాసం ఆఖరికి ఇంటికి వద్దామని అనుకుంటున్నాను. కానీ, నా మనస్సు నన్ను నిలవనియ్యటంలేదు. కనుక, వచ్చే ద్వాదశినాడు బయల్దేరి త్రయోదశినాటికి బాబులీపాడా చేరుకుంటాను.

అమ్మకు నా నమస్కారములు. తమ్ముడు దేవేన్‌కి నా దీవనలు. తక్కిన పెద్దలకు నా నమస్కారములు. పిన్నలకు ఆశీస్సులు.

విధేయుడు

భవేంద్ర

తా. క :— ఇక్కడ మన పండా కాశీనాథ్ మిశ్రా గురించి వాకబు చేశాను. వారు రెండేళ్ళ క్రితమే కాలం చేశారట.

* * * * * *

కచేరీలో లెక్కలూ అవీ తనిఖీ చేస్తూ పెద్దమనుషులతో బాతాఖానీ వేస్తూ టేబిల్ ముందు కూచున్నాడు దివాన్ రఘునాధ మజుందార్.

తపాల బంట్రోతు వచ్చాడు. "నమస్కారం బాబూ !— చనిపోయిన పెదబాబు గారి పేర రిజిస్టరీ ఒకటుంది" అంటూ, కవరు తీసి టేబిల్‌మీద పెట్టాడు.

"బాబుగారు పోయి రెండేళ్ళయిందే. ఇన్నాళ్ళకి వారిపేర ఎవరు రాసివుంటారు ఈ కవరు. ఎక్కణ్ణించి వచ్చిం దసలూ ?— బెనారస్ సిటీ — ఓ . . . కాశీలో మన పండా వున్నాడు......" అనుకుంటూ కవరు తీసుకున్నాడు దివాను.

ఉత్తరా లన్నీ చూశాక ఆఖర్న రిజిష్టరు కవరు చింపాడు దివాన్. ఉత్తరం బయటికి తీశాడు, చూశాడు. చూస్తూనే అతని ముఖం వెలవెలబోయింది. కాళ్ళూ చేతులూ వణకసాగాయి.

"ఏమిటి సంగతి, ఏమిటి సంగతి ? — దుర్వార్త కాదుకదా," అంటూ పెద్దమనుషులు ప్రశ్నించారు.

ఉత్తరం చదువుతున్న దివాన్ ముఖకవళికలు రకరకాలుగా మారాయి ఒకసారి సంతోషంతో ముఖం విప్పారింది. ఒకసారి కనుబొమలు ముడిపడ్డాయి. మరొక సారి కోపంతో పెదవులు కంపించాయి. మళ్ళీ ముఖం వికసించింది. ప్రసన్నమయింది.

ఒకసారి చదివి పూర్తిచేశాక మళ్ళీ రెండోసారి చదివాడు. చదివి ఆ ఉత్తరం సొరగులో పెట్టి తాళంవేశాడు. దీర్ఘంగా నిట్టూర్చి, చూస్తూ వూరుకున్నాడు.

"ఏంటా వుత్తరమేనా ?—" ప్రశ్నించారు పెద్దలు.

"ఉహూఁ" అంటూ లేచాడు దివాను.

"ఏం, అప్పుడే లేచారు ?"

"పనివుంది. ఇవాళ ఏకాదశి కదూ ?"

"ఆఁ—అయితే మేమూ లేస్తామహ" అంటూ లేచారు పెద్దలు.

లేచిన పెద్దలు అక్కడినించి వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళారు. వెళుతూ వెళుతూ, వచ్చిన ఆ వుత్తరాన్ని గురించి రకరకాలుగా తర్కించుకోసాగారు.

* * * * *

అంతఃపురానికి వెళదామని దివాన్‌జీ లేచాడు; కానీ, ఆలోచిస్తూ కాసేపు అలా నించుని, మళ్ళీ కూచున్నాడు. ఉత్తరం తీసి మళ్ళీ ఒకసారి పట్టి పట్టి చదివాడు. తల పట్టుకుని దీర్ఘాలోచనలో పడ్డాడు :

'ఇప్పుడేమిటీ గత్యంతరం :— ఈ వార్త ఇంట్లో చెప్పడమా, మానడమా ?—ఈ ఉత్తరం రాసింది నిజంగా భవేంద్రుడో, మరెవరేనా మోసకాడో !— ఇప్పుడీ వార్త

చెప్పగానే సంతోషంతో అందరూ ఉక్కిరి బిక్కి రవుతారు. ఒకవేళ మోసగాడే అయితే పరిస్థితి దారుణంగా పరిణమిస్తుంది. కానీ- ఇప్పుడే ఈ సంగతి బయట పెట్టను. రానీ- అతను వచ్చాక చూద్దాం. అయినా పదహారేళ్ళయింది చూసి. గుర్తు పట్టడంకూడా కష్టమే. ఏదెలా వున్నా, మోసగాడయితే మాటల్లో పట్టుబడకపోడు. అప్పుడా మోసగాడ్ని గట్టిగా నాలుగు తగిలించి పోలీసులకు అప్పగిస్తే సరి...

'ఒకవేళ అతను నిజంగా భవేంద్రుడే అయితే?- అయితే - ఆహా - అందరికీ ఎంత ఆనందం! ఎంత ఆనందం!!— ఈ ఉత్తరం మోస మవుతుందా?- ప్రతీ చిన్న విషయమూ ఇంత వివరంగా రాసివుందే. ఇన్ని విషయాలు పైవాళ్ళ కెలా తెలుస్తాయి?— అవును. ఇతను నిజంగా భవేంద్రుడే అయివుంటాడు. అవును, భవేంద్రుడే...

'ఇప్పు డీ వార్తా కప్పిపుచ్చానంటే, రేపు అతను వచ్చాక — అతను నిజంగా భవేంద్రుడే అయితే, నామీద అందరకూ అనుమానం కలగవచ్చు; భవేంద్రుడి రాక నాకు ఇష్టం లేదనీ, జమీందారీకి నేనే సర్వాధికారి నవుదా మని చూస్తున్నా ననీ అంటారు. తప్పదు ఈ వాదు తప్పదు. ఈ విషయం మేలుకోరే దాచానని నే నంటే, అప్పు డెవరేనా నమ్ముతారా? ఉహుఁ — నమ్మరు. వచ్చి వచ్చి పెద్ద చిక్కులో పడ్డానే?... ఎంత విషమసమస్య వచ్చిపడిందీ?—

'ఇవాళ ఏకాదశి. పెద్దరాణి, చినరాణి — ఇద్దరూ ఉపవాసమే. వాళ్ళు నీరసంగా వున్న సమయంలో ఇంత ఆనందాన్ని తట్టుకోగలరా?—ఏదేనా దుర్ఘటన జరిగితే?— పోనీ, ఇవాల్టికి ఆగి, రేపు ఫలహారం చేశాక చెబితే......?

'అహఁ — అదేమీ పిల్లేదు — ఇంతటి శుభవార్తను ఒక రాత్రల్లా దాచివుంచే అధికారం నాకు లేదు. వెళతాను, ఇప్పుడే వెళతాను. వెళ్ళి, పెద్ద రాణిగారికి చెబుతాను. చెప్పి, కాస్త హెచ్చరికకూడా చేసి వుంచుతాను...'

* * * *

ఈ వార్త విన్ని పెద్దరాణి సంతోషంతో, దుఃఖంతో ఉక్కిరిబిక్కి రయిపోయింది. ఆ ఆనందంలో దివాన్‌జీ హెచ్చరిక ఆమెకు వినబడనేలేదు.

అంతఃపుర మంతా ఆనందంలో మునిగిపోయింది. పూజామందిరంలో శంఖాలు పూరించారు. కుంకుమబరిణతో ముత్తయిదువ రొప్పుతూ తోటలోకి పరుగెత్తింది.

చినరాణి మూర్ఛపోయింది.

* * * *

"నీకేకాదు నాయనా! — నాకూ కలిగిందా సందేహం. నాకు రాత్రల్లా నిద్ర పట్టలే. కాని, కోడలు చెప్పిన సంగతినిబట్టి కాస్త మనసు కుదుటపడేలా వుంది. దానికి రాత్రి ఒక కల వచ్చిందట..." అంది పెదరాణి.

"ఈ కలలమీదా, కథలమీదా ఆధారపడి ధైర్యంగా వుండడానికి వీల్లేదమ్మా. ఏ పశ్చిమ కోస్తాకో వెళ్ళి వాకబు చేస్తే బాగుండును."

"దానికైనా వ్యవధి ఏదీ? — రేపు లేదు ఎల్లుండి కుర్రవాడు రానే వస్తున్నాడు. వాడు వచ్చాక, 'నువ్వు, నువ్వు అవునో కాదో మాకు సందేహంగా వుంది. మేము వాకబు చేసేవరకు బయటివేపు గదిలో ఉండు' అని ఎలా చెప్పగలం? — వాడు నిజంగా నాబిడ్డ భవేనే అయితే ఇక్కడ ఒక్క నిమిషం ఉంటాడా? వెంటనే మళ్ళీ వెళ్ళిపోడూ? — వాడి కెంత అభిమానమో నీకుమాత్రం తెలీదూ? — పోనీ, ఇవాళే నువు బయల్దేరి కలకత్తా వెళ్ళు. వాడ్ని గుర్తుపట్టటానికి గాని, కూడా రావటానికి గాని వీలుంటుంది. వాడి మాటల ధోరణినిబట్టి కొంత నిజం బయటపడక మానదు."

"ఎంతోమంది జనం వుంటారు. అంతమందిలోనూ నేనతన్ని గుర్తుపట్ట గలనా? — ఉత్తరాన్నిబట్టి చూస్తే అచ్చుమచ్చు మన భవేంద్రబాబే అనిపిస్తుంది. లేకపోతే ఇన్ని పాతసంగతులు ఎలా జ్ఞాపకం వుంటాయి? వాళ్ళ నాన్నగారు పచ్చ జేబురుమాలు ఉపయోగించేవారని ఎలా చెప్పుకో గలుగుతాడు? పాపం, పెదబాబు గారు భవేన్‌కోసం ఎంతెలా పరితపించిపోయారో తలుచుకుంటే గుండె చెరువయి పోతుంది. కళ్ళ జబ్బుతో బాధపడుతూ, 'నా కళ్ళ వెలుగే పోయాక నాకీ కళ్ళుండి ఏం ప్రయోజనం? — అంటూ వాపోయారు" అనిచెప్పి కంటతడి పెట్టుకున్నాడు దివాన్.

రాణి కళ్ళమ్మట జలజల నీళ్ళు రాలాయి.

"ఏమయితే అయింది, దేవుడిమీద భారం వేసి నువ్వు వెళ్ళిరా. దేవు డెప్పుడూ అన్యాయం జరగనివ్వడు. లే — ఇంక ఆలస్యం చెయ్యకు. పెందరాళే భోజనం ముగించుకుని బయల్దేరు" అన్నది రాణి, కళ్ళు తుడుచుకుంటూ.

*　*　*　*

కలకత్తానించి దివాన్ ఇచ్చిన టెలిగ్రాం చూసుకున్న రాణికి ఆనందాశ్రువులు పొంగుకు వచ్చాయి.

ఆవేళ కచేరీకి సెలవు ప్రకటించారు.

ఊళ్ళో జనమంతా పిల్లా జెల్లాతోసహా స్టేషన్‌కి పరుగెత్తారు.

అంతఃపురంలో అంతా ఎంతో ఆనందంగా ఉన్నారివేళ.

సూర్యాస్తమయ సమయానికి ఊరి పొలిమేరన బాజా భజంత్రీలు వినిపించాయి. మరి కాస్సేపటికల్లా పల్లకీలో దివాన్ వచ్చి దిగాడు. ఆయాసపడుతూ హడావిడిగా అంతఃపురంలోకి వెళ్ళాడు "అమ్మా! — మరేం భయంలేదు. మన భవేన్ వచ్చేస్తున్నాడు. అమ్మవారి గుడిదగ్గర పూజ చేయిస్తున్నాడు. కబురు అందజేద్దామని నేను ముందుగా వచ్చాను."

"కుర్రవాణ్ణి ఎలా కలుసుకున్నావసలు ?— మన మనుకున్నట్టు మరేం భయపడనక్కర్లేదుకదా ?—"

"ఏం భయంలేదు. మన భవేనే. కాశీరైలు వచ్చేవేళకి నేను హౌరా స్టేషన్‌లో నించుని, అటూ ఇటూ చూస్తున్నాను. వేలకొద్దీ జనం రైల్లోంచి దిగారు. నేను వాళ్ళ ముఖాలకేసి చూస్తూ నించున్నాను. అంతలో — కాషాయవస్త్రాలు ధరించిన ఒక కుర్రవాడు నా పక్కనించి వెళుతూ నా ముఖంకేసి చూశాడు. చూసి, 'మీ దేవూరు ?—' అని అడిగాడు. 'బాళులీపాడా' అన్నా. ఆ మాట వింటూనే నా ముఖంకేసి పరీక్షగా చూసి, 'దివాన్ బాబయ్యగారా !—' అన్నాడు. 'ఆఁ !— నువ్వు భవేన్‌వా ?—' అంటూ, ఇద్దరం ఒకళ్ళ నొకళ్ళు కౌగిలించుకున్నాం. అతనికీ నాకూ కూడా ఏడుపు అగలేదు పొర్లి పొర్లి వచ్చింది."

రాణి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

మేళ తాళాలు, జనం చేసే కోలాహలం దగ్గిరికి వచ్చేశాయి. దివాన్ బయటికి వచ్చాడు.

పల్లకీ ద్వారందగ్గర ఆగింది. రాఖాల్ దిగాడు.

రాణి అతన్ని అమాంతం హృదయానికి హత్తుకుంది.

అంతఃపురంలో శంఖధ్వనులు మారుమోగాయి.

* * *

"ఈ వచ్చినవాడు నిజంగా భవేంద్రుడే నంటారా ?— అహఁ— కాదు; ఎవడో మోసగాడు."

"దివాను ఆవులిస్తే పేగులు లెక్కపెడతాడు. ఆయన కళ్ళలో దుమ్ముకొట్టడం ఎవడితరం ?— వచ్చినవ్యక్తి నిజంగా భవేంద్రబాబే అతను భవేంద్రుడు కాకపోతే హౌరాస్టేషన్లో దివానుని ఎలా గుర్తుపట్ట గలిగా డంటావు ?"

"లక్ష మోసాలలో ఇదీ ఒక మోసం. ఆస్తీ, అధికారమూ చేజిక్కించుకోవా లని దొంగఎత్తుతో వచ్చినవాడు ఆమాత్రం ఆనుపానులు తెలుసుకోకుండా వస్తాడటండీ ?—"



"మరయితే – పదహారేళ్ళ క్రితం పెదబాబుగారు. పచ్చ జేబురుమా లుపయోగించటం ఎలా తెలుసుకుని వుంటా డంటారూ ?"

"ఎలా గేమిటి ?– ఎక్కడో దివాను మాటల సందర్భంలో ఎవరితోనైనా అని వుంటారు. ఆ మాటలు ఈ మోసగాడికి సమయోచితంగా ఉపయోగపడివుంటాయి. లేకపోతే, పని గట్టుకుని ఉత్తరంలో ఈ మాటలు రాయవలసిన అగత్యం ఏమిటి, చెప్పండి ?" ఇలాంటివి నాలుగు సంగతులు రాస్తే, జనం సులభంగా నమ్మేస్తారు కదా అని ఆలోచన......"

"వచ్చినవ్యక్తి అసలువాడు కానీ నకలువాడుగానీ, అతను ఈ వూరి జమీందారు; లక్షాధికారి అతన్ని నువ్వు వంచకుడు వంచకుడని ప్రచారం చేస్తున్నావే: ఈ మాట గనక ఆ వ్యక్తి చెవిని పడితే నిన్ని వూళ్ళో ఉండనిస్తాడా ?– నువ్వన్నమాట ఆ నోట, ఆనోట పాకి, చివరికి ఎలాగూ జమీందారుకి చేరుతుంది ఒకవేళ అతను నిజంగా వంచకుడే అయితే, పరిస్థితి మరీ విషమిస్తుంది, ఏమనుకున్నావో."

"అలాగా ?–"

మరొకసంగతి –

"పల్లకీలోంచి దిగి, భవేన్‌బాబు కాళ్ళు కడుక్కుంటూ వుండగా – నవుకరు రామా అతనికి దణ్ణంపెట్టి తువాలుపట్టుకు నించున్నాడు. 'రామా' అని భవేన్ పలకరించేసరికి వాడికి కళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి. 'చూశావా, రామా !– బాబుగారు గుర్తుపట్టగలరా ?– అని అడిగావు. నువ్వు ఎత్తుకు పెంచినవాడివికదా, నిన్నెలా మరిచిపోతాడు మా బాబు ?–' అన్నదిట పెద్దరాణి. 'రామాకి ఆ గాయపుమచ్చ నా వల్లనే కదమ్మా వచ్చింది' అంటూ చిన్నప్పటి సంఘటన లేవో గుర్తు చేశాట్ట భవేన్."

ఇంకో సంగతి –

"భవేన్‌బాబు ఏదో వ్రతం పట్టాడట. ఆ వ్రతం ఏడేళ్ళు పట్టాలిట. ఇంకా ఆరునెలలుంది. వ్రతం పూర్తి అయ్యేవరకు ఆయన సన్యాసిగానే వుంటాడట. కాషాయ వస్త్రాలే ధరిస్తాడట. చినరాణిని ముట్టనయినా ముట్టడట......

ఇలా, నకలు భవేంద్రుణ్ని గురించి రకరకాలుగా, కథలు కథలుగా చెప్పుకోసాగారు లోకులు.

*　　　　*　　　　*

"నాయనా !– నా దొక్కమాట వింటావా ?– ఒకసారి కోడల్ని కలుసుకో. అది సాక్షాత్తు లక్ష్మి. దాన్నిచూస్తూంటే నా గుండె చెరువై పోతోంది" అంది పెదరాణి.

"వ్రతం పూర్త్యయ్యేవరకూ కలుసుకోవడం మంచిదికాదమ్మా."

"పోనీ నాయనా, ఎడంగానే వుంటుంది. ఊరికే మాటాడడంలో దోషం ఏముంది ?– ఏం ?– ఉండు. అమ్మాయిని ఇక్కడికే పిలుచుకువస్తా."

*　　*　　*　　*　　*

పట్టుచీర గరగర !–

గాజుల గలగల !–

గుమ్మంకేసి చూశాడు రాఖాల్.

సగం మేలిముసుగు ధరించి లోపలికి అడుగుపెట్టింది, ఆ ముద్దుగుమ్మ–అందాల బరిణె – చినరాణి ఇందుమతి ! !–

"రా, రా !" అన్నాడు రాఖాల్.

ముందుకి వచ్చింది ఇందుమతి. మోకరిల్లి నమస్కరించబోయింది.

"ఉహుఁ హుఁ – నమస్కారం చెయ్యకు, నా కింకా అశౌచం వుంది."

"ఉంటే వుందిలెండి" అంటూ నమస్కరించిం దామె.

ఆమె కంఠం విన్నాడు. చెమ్మగిలిన ఆమె కళ్ళకేసి చూశాడు. శరీర మంతటా ఒక్కసారి ఏదో విద్యుత్ ప్రవహించిన ట్టయిం దతనికి.

''కూచో...''అంటూ సోఫా చూపించాడు.

ఆమె కూచుంది.

"ఎలా ఉన్నావు ?–"

''బాగానే వున్నా."

కాస్సేపు నిశ్శబ్దం.

"నేను జ్ఞాపకమున్నానా ?"

''ఉన్నారు.''

మళ్ళీ నిశ్శబ్దం.

''అంతా విన్నావుగా ?–"

"ఆఁ – విన్నాను."

''ఇంకా ఆరు నెలలు నే నిలాగే వుండాలి."

ఆమె మాటాడలేదు

''నువ్వేమీ బాధపడవుకదా ?''

"ఎందుకు ?"

"..................''

"మిమ్మల్ని రోజూ ఒక్కసారి చూడగలిగితే, అంతే చాలు నాకు.''

మరింక మాటాడ్డాని కేమీ తోచిందికాదు.

గ్రహించిం దామె.

"చాలా అలసిపోయిన ట్టున్నారు. పొద్దుపోయింది. పడుకోండి," అంటూ ఆమె లేచింది.

మెత్తటి పక్కమీద పడుకున్న రాఖాల్‌కు నిద్ర రాలేదు. ఇందుమతి ముఖమే అతనిముందు కళ్ళకు కట్టినట్టుంది !–

* * *

కృత్యాలు ముగించుకుని, రాఖాల్ పూజామందిరానికి వెళ్ళాడు. పీటమీద కూచున్నాడు. పెదరాణిగారు గంధం తీస్తూ అక్కడే కూచుంది. రాఖాల్ ఇరుకున పడ్డాడు. ఉపనయనం అయ్యాక ఏడాదిపాటు నియమంగా సంధ్యావందనంచేసినా, ఇప్పుడు ఒక్క ముక్కయినా జ్ఞాపకంలేదు. ఎప్పుడు నెత్తిన నీళ్ళు చల్లుకోవాలో, ఎప్పుడు ముక్కు మూసుకోవాలోకూడా గుర్తులేదు. రాణిగారి ఎదుట కపట సంధ్యావందనం చేస్తే,

వెంటనే పట్టుబడిపోవచ్చు. అందుకని, వేలికి యజ్ఞోపవీతం చుట్టుకుని నూట ఎనిమిది సార్లు గాయత్రి మాత్రం చేసి, పీటమీదినించి లేచాడు.

"అప్పుడే అయిపోయిందా నాయనా ?–" అని అడిగింది రాణి.

"అయిందమ్మా; మాకు శివగాయత్రి ఒక్కటే ముఖ్యం" అని చెప్పి తప్పించుకున్నాడు.

"అయితే రా. ఫలహారం చేద్దువుగాని. రా నాయనా !"

ఇంతలో నౌకరు వచ్చాడు.

"హుజూర్, తమ దర్శనంకోసం చాలామంది వచ్చారు. దివాన్‌గారు చెప్పి రమ్మన్నారు" అంటూ వార్త అందించాడు.

* * *

నుదురు ఒక్కసారి కొట్టుకుని, తనకోసం వచ్చివున్నవాళ్ళ మధ్యకి వెళ్ళి కూచున్నాడు రాఘాల్. సంభాషణ మెలకువగానే ప్రారంభమయింది. దివాన్ ఒకర్నిద్దరిని పరిచయం చేశాడు. 'భవేన్ జీవిత చరిత్ర'ను మనస్సులో వుంచుకుని జాగర్తగానే మసులుకున్నాడు రాఘాల్. ఊళ్ళో గ్రాంటుస్కూలు హెడ్మాస్టరుకూడా వచ్చాడు. అతనితో కాస్సేపు సంభాషణ సాగించాడు. అరగంటతరవాత వచ్చిన పెద్ద లంతా జారుకున్నాక, రాఘాల్‌కు ప్రాణం కాస్తంత కుదుటపడింది.

* * *

"బాబూ, నేను ముసలివాడి నయిపోయాను. నాన్నగారు పోయాక ఈ రెండేళ్ళ నించీ అన్నీ నేనే చూస్తూవచ్చాను. నావల్ల ఏవేనా పొరపాట్లు జరిగిఉండవచ్చు. కనుక, ఈ రెండేళ్ళ కాయితాలూ నువ్వొకసారి చూసుకుంటే మంచిది" అన్నాడు దివాను.

"మీ కాయితాలు నే చూసేదేమిటి బాబయ్యగారూ ! – అయినా, నా కేం తెలుస్తుంది ? – ఇన్నాళ్ళనుంచీ ఎలా చూస్తూవచ్చారో, అలాగే ఇకముందుకూడా మీరు చూడాల్సిందే" అన్నాడు రాఘాల్.

"బాబూ : – ఒంటిబలం ఎప్పుడూ ఒక్కలా వుంటుందా ? నాకూ అరవై యేళ్ళు దాటాయి; నావల్ల పొరపాట్లు ఏమైనా జరిగిఉండవచ్చు. డబ్బుదగ్గర చిన్నా పెద్దా యేమిటి నాయనా ! డబ్బు పాపిష్ఠిది. ఒక్కసారి లెక్కలన్నీ నువ్వు స్వయంగా చూసుకున్నావంటే నా మనస్సు నిశ్చింతగా వుంటుంది."

"బాబయ్యగారూ ! – ఈ కాగితాలు, వ్యవహారాల విషయంలో నేను మీ రనుకున్నంత పండితుణ్ని కాను. పొరపాట్లు ప్రతివాళ్ళకీ వస్తాయి. మీకు తెలియకుండా



ఏవయినా పొరపాట్లు జరిగాయే అనుకోండి; ఎప్పటికైనా అవి మీ కంటబడక మానవు. మీరన్నట్టు, డబ్బు మంచి దికాదు. కాని, మిమ్మల్నందర్నీ వదిలిపెట్టి ఉండలేకపోయాను. మళ్ళీ ఈ బంగారుసంకెళ్ళు వేసుకొనక తప్పటంలేదు."

"ఇప్పుడు కాకపోతే పోనీ నాయనా! – నాన్నగారి సంవత్సరీకం వెళ్ళాకయినా సరే, నీ యిష్టం. మనం మొట్టమొదట కలెక్టరుకు రాసి పేరు మార్పించాలి. జడ్జి గారి దగ్గరనుంచి సర్టిఫికెట్టు తెప్పించితేగాని బ్యాంకులో ఉన్నమొత్తం నీపేర ట్రాన్స్ఫరుకాదు. కంపెనీ బాండులమీద నాన్నగారి సంతకాలున్నాయి కాబట్టి ఫరవాలేదు."

"బెంగాల్ బ్యాంకులో ఎంత వుంది, బాబయ్యగారూ ?"

"ఏభైవేల పైచిలుకు."

"కంపెనీ బాండులూ ?"

"సుమారు ఆరులక్షలు."

లోపల్లోపల లొట్టలువేస్తున్న రాఘాల్ పైకిమాత్రం ఇలా అన్నాడు: "బాబయ్య గారూ! – నేను మళ్ళీ గృహస్థాశ్రమంలోకి వచ్చినా, ఆస్తిపాస్తులూ, వ్యవహారాలూ అంటే నా కేమంత ఆసక్తిలేదు. నా కాలాన్ని తీర్థయాత్రలు, పూజాపునస్కారాలు, శాస్త్రపఠనంలో గడపాలని నా వుద్దేశం."

"అదేమిటి నాయనా! – నువ్వు అలా అంటే ఎలా? నేను ముసలితో క్కు-నయ్యాను, నాన్నగారున్నట్టయితే, ఇవన్నీ నీకు అప్పజెప్పి, ఈపాటికే మే మిద్దరం కాశీయాత్రకు పోయేవాళ్ళం. నీకు నా వయస్సు వచ్చాక నువ్వూ అలాగే చేద్దువుగాని. ప్రస్తుతం సంసారధర్మం నిర్వహించు. దేవుడి దయవల్ల నలుగురు పిల్లలు పుట్టాక, వాళ్ళు చేతికందివచ్చాక, నువ్వు పారమార్థిక చింతలో పడుదువుగాని"

దివాన్ ఈ మాట అనేసరికి రాఖాల్‌కు ఇందుమతి గుర్తుకువచ్చింది. గతరాత్రి సంఘటన మనస్సులో మెదిలింది. మళ్ళీ మరొకసారి ఆ దివ్యసుందరమూర్తిని దర్శించాలని ఆసక్తి కలిగింది.

* * *

భోజన మయ్యాక తాంబూలం వేసుకుంటూ రాఖాల్ దివాన్‌తో తన గదిలోకి వెళ్ళాడు. దివాన్ జమీందారీ వ్యవహారాలు ముచ్చటిస్తున్నాడు.

"ట్రాన్స్‌ఫర్ దరఖాస్తు పెట్టాక, ఒకసారి కృష్ణనగర్ వెళ్ళి కలెక్టర్ను కలుసు కోవటం ముఖ్యం."

"ఏ బట్టలతో వెళ్ళను?–"

"కాషాయిగుడ్డలతో వెళితే ఎలాగో వుంటుంది."

"మఠంలో వుండగా ఓ సారి గవర్నర్ని ఈ దుస్తులతోనే కలుసుకున్నాను."

"అయితే కలకత్తాలో పురమాయించు."

"అలాగే – నే నెలాగూ ఒకసారి కలకత్తా వెళదామనుకుంటున్నా. ఒక మోటారు కారుకూడా కొనుక్కోవాలి. చేతిలో నగదు ఏమాత్రం వుంది?–"

"మోటారా! – చాలా ఖరీదు వుంటుందే?–"

"అహఁ – పెద్దఖరీదు ఏమీ పెట్టను. ఏ దెనిమిది వేలకంటె ఎక్కువ కానివ్వను."

"అయితే కాషియర్ దగ్గర వుంటుంది. నువ్వెప్పుడు బయల్దేరుతావో చెప్పు. అప్పటికి చేతిలో పనులు పూర్తిచేసుకుంటా."

"ఎప్పుడు వెళతానో ఇంకా నిర్ణయించుకోలే. వెళితే రేపే వెళతానేమో!"

"రేపే అయితే నా కేం ఇబ్బందివుండదు. నా పనులు తిరిగివచ్చాక చూసు కుంటా; ఓ వారంరోజుల్లో తిరిగిరావచ్చుగా?"

"ఏమో – పది పదిహేను రోజులు కావచ్చు. అయినా, నాయనగారి అబ్దీకం వస్తూంది; కావలిసినవి సమకూర్చుకోవాలి గదా. మీ రిక్కడ లేకపోతే ఎలా?–"

కూడా తను వెళ్ళడం అతనికి ఇష్టంలేదని గ్రహించాడు దివాన్. అయితే, 'బాబుని కొన్నాళ్ళవరకూ ఎక్కడికీ ఒంటరిగా వెళ్ళనీయవద్దు. కూడా నువ్వు వెళ్ళు' అని చెప్పిన రాణీగారి మాటలు దివాన్‌ను హెచ్చరించాయి.

"అవును. అన్నట్టు నాన్నగారి ఆబ్దీకం కదూ ? బాగా జ్ఞాపకం చేశావు. ఆబ్దీకం నాటికి సరకూ సప్పరా సమకూర్చుకుని, వంట బ్రాహ్మణ్ని పురమాయించుకో వద్దూ ? — "

"ఏం ? మనవూళ్ళో వంటబ్రాహ్మ లెవరూ దొరకరూ ? "

"అవి పూర్వకాలపు రోజులు నాయనా. ఈనాడు ఆమాత్రం సాయంచేసేవా రెవ రున్నారు ? — 'నా చేతిమీదుగా నలుగురికీ వండి వడ్డించటం నా అదృష్టం' అని ఒకప్పుడు నడుం బిగించిన ధర్మాత్ములు ఈనాడు 'ఏం ? — నే నేం వంటబ్రాహ్మ ణ్ణనుకున్నావా ? ' అంటూ జారుకుంటున్నారు."

ఈ దివాను తనవెంట రాకుండా వదిలిపెట్టడని గ్రహించాడు రాఖాల్. 'ఈ పాటికి ఇందుమతి భోజనం చేసి వుంటుంది. ఈ దివాను ఇక్కడినించి విరగ డయితే బాగుండును.' అనుకుని, ఆవలించి ఒక్క చిటిక వేశాడు.

దివాను ఇది గ్రహించి, "మరి నే వస్తా" అంటూ లేచాడు. రామాన్ని పిలిచి, బాబుకి పక్క వేయమని పురమాయించాడు.

*   *   *   *   *

జరీఅంచు తెల్లచీర ;

పొట్టిచేతుల జాకెట్టు ;

కాళ్ళని పాంజేబుగొలుసులు ;

చేతుల్ని నాలుగుజతల గాజులు ;

ఇందుమతీదేవి ప్రత్యక్షమయింది.

"ఎక్కడికి వెళ్ళావ్ ? " అడిగాడు రాఖాల్.

"ఎక్కడికీ వెళ్ళలేదే ? "

"అహాఁ — ఇంత సేపూ ఎక్క డున్నావు ? "

"పూజామందిరంలో."

"నిలబడ్డావేం, కూచో."

ఆమె సిగ్గుపడుతూ, తెరచివున్న గుమ్మంకేసి చూసింది.

పరదా లాగి వచ్చాడు రాఖాల్. ఇద్దరూ కూచున్నారు.

కలకత్తా వెళుతున్నారటగా ? "

"అవును. వెళదా మనుకుంటున్నా."

"ఇప్పుడేం తొందర ? "

"పను లున్నాయిగా ? "

"అత్తగారు ఏడుస్తున్నారు" అంటూ, ఇందుమతి నీళ్ళు నిండిన కళ్లతో తలెత్తి చూసింది.

"ఏం, ఎందుకూ ?"

"మీ రెందు కిప్పుడు వెళ్ళటం, చెప్పండి. దివాన్‌గా రున్నారుగా ? మీ కేం కావాలో రాసిస్తే, ఆయన కొనుక్కొస్తారుగా ?"

"గుడ్డలూ అవీ కుట్టించుకోవాలి. స్వయంగా వెళ్ళకపోతే ఎలా ?"

"గుడ్డలు కుట్టించుకుందికి మీరు వెళ్ళాలా ? — గుడ్డల నమూనాలు తీసుకువస్తారు పెద్ద షాపులోంచి. టైలరును పిలుచుకు వస్తారు. మీకు నచ్చిన గుడ్డలు తీసుకోండి; కొలత లివ్వండి. ఏమంటారు ?"

"సరే. అమ్మా, నువ్వూ ఏడుస్తూంటే ఎందుకు ? నే వెళ్ళను. నువ్వూ, అమ్మా భోంచేశారా ? ఇంద — తాంబూలం వేసుకో," అంటూ తమలపాకుల పొందాను ఇందుమతివైపు జరిపాడు.

"లేదు, ఇంకా భోజనం కాలేదు. మీరు కలకత్తా వెళుతున్నా రని దివాన్‌గారు చెప్పారు. ఆమాట విని ఆవిడ ఏడుస్తూకూచున్నారు."

"నిన్ను అమ్మే పంపించిం దనుకుంటా ! లేకపోతే ఇప్పుడు వచ్చేదానివా ?" అంటూ రాఖాల్ పరిహాసమాడాడు.

సిగ్గుతో, చిరునవ్వుతో ఇందుమతి అవునన్నట్లు తల ఆడించింది.

"అమ్మగారూ ! — బాబుగారి పక్క ఏ గదిలో వెయ్యమంటారూ ? —" అని అడుగుతున్న రామా గొంతు వినిపించింది.

ఇందుమతి రాఖాల్ పక్క ఏర్పాటు చూసింది.

"మళ్ళీ ఎప్పుడు కనిపిస్తావ్ ? —" అడిగాడు రాఖాల్.

"ఎందుకూ ! — మీరు నన్ను వదిలిపెట్టి కలకత్తా వెళుతున్నారుగా ?"

"రెండు రోజులపాటు వెళ్ళివద్దా మనుకున్నా, అంతేగా ? — నువ్వెళ్ళి భోంచెయ్యి. ఎండకాస్త తగ్గాక ఇద్దరం అలా తోటలోకి వెళ్ళి తిరుగుదాం."

"ఇద్దరం కలిశా ? ఛీ ! —" ఇందుమతి ముఖం సిగ్గుతో ఎర్రబడింది.

"నువ్వు రాకపోతే నే నొక్కణ్ణీ వెళ్ళి ఏం చెయ్యనూ ? —"

"నే ముందుగా అక్కడికి వెళ్ళి వుంటా, మీరు రండి."

"తప్పకుండా."

"ఆఁ — తప్పకుండా ?"

"మరిచిపోవుకదా ?''

"మీరూ మరిచిపోకండి," అంటూ నవ్వుతూ వెళ్ళిపోయింది ఇందు.

* * * *

ఇందుమతీదేవి తోటలోకి వచ్చింది కాని, మరీ సిగ్గుపడసాగింది. ఎవరేనా చూస్తారేమో, అటువేపు వస్తారేమో నని ఊరికే కంగారుపడిపోయింది. ఆ కంగారుతో, భయంతో ఆమె తోటలో రాఘాల్ దగ్గర ఎక్కువసేపు ఉండలేకపోయింది.

ఇందుమతి వెళ్ళిపోయాక రాఘాల్ ఉద్యానంలో అటూ ఇటూ తిరుగుతున్నాడు.

* * * *

గంగ ఒడున స్నానం చేస్తూ సురబాల, కనకలత మాటాడుకుంటున్నారు :

"చినరాణీగారికి చాలా సంతోషంగా ఉందికదూ ?" అడిగింది సురబాల

"ఏం సంతోషం లెద్దూ. ఇలాంటి సంతోషం ఓ సంతోషమా యేమిటి ? అయినా, బాబుగారి కిదేంబుద్ధి ? ఇంకా ఆర్నెల్లు వ్రత మున్నప్పుడు, ఆర్నెల్లూ పోయాకనే రాకూడదూ ? ఇది చాలా అన్యాయం."

"అన్యాయం ఏమిటీ ? ఇంకా ఆర్నెల్లయితే, ఆ ముసలావిడకూడా ఉంటుందో, ఉండదో. కొడుకును చూసుకునే యోగం ఆమెకి దక్కకపోయేది."

"ముసలావిడ సంగతికాదు నే నన్నది చినరాణీ సంగతి."

"చినరాణికి మాత్రం ఏం ? — ఈ ఆర్నెల్లూ భర్తని చూడగలగటం, భర్తసేవ చేయగలగటం అదృష్టంకాదూ ?"

"సర్లెద్దూ, పెద్ద ముత్తయిదువలా మాటాడకు. ఇంతకీ, ఆ వచ్చినవాడు భవేంద్రుడు కాక మరెవరైనా అయితే ? "— అన్నది కనకలత.

"ఛా ఛా, అలాంటి మాట లనకు. ఆయన భవేంద్రబాబు కాకపోతే, ఇంట్లోవాళ్ళకి తెలియదా ? తెలిస్తే ఊరుకుంటారా ?''

''అబ్బో ! — ఇలాంటి నాటకాలు ఎన్నో చూశాం మేము. ఒకసారి కమలా థియేటర్‌లో అచ్చుమచ్చు ఇలాంటిదే ఒక నాటకం చూశాను. అయితే నాటకంలోని ఆ మోసగాడికంటే వాస్తవంగా కనబడుతున్న ఈ మోసగాడే ఎక్కువ తెలివయిన వాడు."

"ఛీ, అలాంటి మాట లనకు. మన చినరాణీ మహాపతివ్రత. ఆమెను భగవంతు డెపుడూ అన్యాయం చేయడు."

ఒళ్ళు తుడుచుకున్నారు; పొడిబట్టలు కట్టుకున్నారు. ముందు సురబాల, వెనకాల కనకలత మెల్లిగా మాటాడుకుంటూ, అంతఃపురంవేపు నడిచివెళుతున్నారు. కొంత

దూరం వచ్చాక చెట్లగుబురు దాటగానే సురబాల అట్టె నిలబడిపోయింది. ఆశ్చర్య పోయింది. ఏమిటా అని కనకలత ముందుకు వచ్చి చూసింది.

రాఖాల్ :—

సురబాల ముఖం వెలవెలబోయింది. ఆమె కాళ్ళూ, చేతులూ వణుకుతున్నాయి.

సురబాల పరిస్థితి చూచి కనకలత "బాబుగారు — !" అంది.

"బాబుగారా ! — ఏ బాబుగారు ?"

"భవేంద్రబాబుగారు ! — కాదు, కాదు. భవేంద్రబాబు రూపంలో వచ్చిన బాబుగారు," అంటూ, సురబాల ముఖంలోకి తీక్షణంగా చూసింది కనకలత.

"భవేంద్రబాబు రూపంలో వచ్చినవారా ? అదేమిటీ !"

"ఏమో ! — నా కేం తెలుస్తుంది ? నీకు తెలియాలి, ఆయనకు తెలియాలి. ఇంకా ఎన్నే శ్ళిక్కడ నించుండిపోతావ్ ? పద, పద."

"ఏమిటి నువ్వంటున్నది నా కేం బోధపడటంలేదు" అంటూ కలలోనించి తేరు కున్నట్టు సురబాల తెలివిలోపడ్డది. కనకలత వెంట అంతఃపురానికి దారితీసింది.

* * * *

తోటలో సంఘటన కనకలతలో ఎన్నెన్నో ఆలోచనలు కలిగించింది. ఈ సురబాల ఎవరు ? ఈ మాయాభవేంద్రు డెవరు ? వీళ్ళిద్దరికీ ఏమిటి సంబంధం ? ఇద్దరి మధ్యనీ ఏదో పూర్వపరిచయం ఉన్నమాట మాత్రం నిశ్చయం. అందు కేమీ సందేహం లేదు — ఇలా సతమత మవుతూవుంది కనకలత.

రాత్రి తొమ్మిది.

రాఖాల్ భోజనానికి కూచున్నాడు. ఎదురుగా పెద్దలైటు వెలుగుతోంది. పక్క నున్న చీకటిగదిలోంచి అతన్నే కన్నార్పకుండా చూస్తూవుంది.

ఎవరు ? —

సురబాల !

ఇది కనకలత కళ్ళబడింది. గబగబా వచ్చి, వెనకనించి సురబాల కళ్ళు మూసింది.

"కనకలత అక్కా !"

"ఎవరే అక్కా ? నీకంటె నే పెద్దదాన్నా యేం ? — అక్కా అని పిలుస్తావేం ?

"తియ్, తియ్. కళ్ళమీద చేతులు తియ్ ! !—"

"పోవే ! — కళ్ళమీద చేతులు తియ్యాలేం ? పెద్దమనిషి భోంచేస్తూవుంటే, ఎందుకే అలా చూస్తావ్ ? ఆయనకి తిన్న దేమయినా ఒంటబట్టాలా ?"



''ముందు చేతులు తియ్యవే."

"చూడవే, చూడు, కరువుతీరా చూడు; అయినా, ఎక్కడయిందే ఈ పరిచయం ?"

"పరిచయమా !"

"అఁ — అఁ — అదే — స్నేహం..."

"ఎవరు చెప్పారే నీకు ?"

"ఎవ రేమిటి, ఆయనే చెప్పారు."

"ఎవరితో ?"

"చినరాణిగారితో,"

"ఏమని చెప్పారు ?''

"నిన్ను ఒకప్పుడు వా రెరుగుదు రని."

"ఎన్నడూ అలా చెప్పిఉండరు."

"అయితే అసలు సంగతేమిటో నువ్వే చెప్పు."

సురబాల గబగబా తన గదిలోకి పోయింది. తలగడలో తల దూర్చి, ఏడుస్తూ పడుకుంది.

కనకలతగదిలో దీపంమాత్రం రాత్రి ఒంటిగంటదాకా అలా వెలుగుతూనేవుంది.

ఉత్తరం చదివి ముగిస్తూనే ఖగేంద్రుడు గడియారంకేసి చూశాడు. మూడు గంటలయింది. వెంటనే లేచాడు. అలమర తెరిచాడు. చిరిగిపోయిన చొక్కా, అంచులేని పాతధోవతీ, మాసిపోయిన సిల్కు ఉత్తరీయం ధరించి, మెట్లు దిగాడు. చేతిలో ఒకటోరకం సిల్కు గొడుగు. వెండిపిడి వేసింది ఉంది. నౌకరు ఖుదీరామ్‌ని పిలిచాడు. "నీ గొడుగు తీసుకురా" అన్నాడు

ఖుదీరామ్ తన పాతగొడుగు తెచ్చి ఇచ్చాడు. ఆ గొడుగు తీసుకుని, కొత్త గొడుగు ఖుదీరామ్ కిచ్చి, "నీ గొడుగు నే వేసుకు వెళుతున్నాను. దీన్ని తీసుకువెళ్ళి పైన పెట్టు" అని ఖగేంద్రుడు గబగబ వెళ్ళిపోయాడు

"ఆ—!" అంటూ ఆశ్చర్యపోయాడు ఖుదీరామ్. ఖగేంద్రుడి ఈ వేషం, తీరూ చూసి. 'ఖగేన్‌బాబు ఇవాళ ఇన్కమ్‌టాక్సు ఆఫీసుకి వెళుతున్నారులా వుంది' అని, తనలో తనే నవ్వుకున్నాడు.

ఖగేంద్రుడు మెయిన్ రోడ్డులోకి వచ్చాడు. ధరమ్‌తలా పోయే ట్రాం వచ్చింది. జేబులో డబ్బుంది. అయినా ట్రామ్ ఎక్కలేదు. ఎండలో గొడుగు వేసుకుని, నడిచే వెళ్ళాడు.

అది అరవై అయిదు నంబరు మానిక్‌తలా వీధి. అక్కడ ఒక ఒరియా నౌకరు కనబడ్డాడు. ఆ నౌకరుని మంచి చేసుకుని లోపలికి ప్రవేశించాడు ఖగేన్. అయితే దివాన్ నిద్రలో వున్నాడు

ఖగేన్ తొందరపడలేదు తీరికగా కూచుని, దీక్షగా ఆలోచించసాగాడు :

"ఎవ రీ మాయాభవేంద్రుడు ? —

ఎవరీ సురబాల ? —

ఈ చిక్కుసమస్య నెలా భేదించటం ? —

ఇందుమతిని పెళ్ళిచేసుకోవటం ఎలాగూ పడలేదు,

పోనీ —

ఈ మాయాభవేంద్రు డెవరో, వీడి అంతు కనుక్కుంటాను. కనుక్కునితీరతా..."

ఇంతలో దివాను తన స్థూలకాయాన్ని మోయలేక మోయలేక మోసుకుంటూ వచ్చాడు.

ఖగేంద్రుడు లేచి నమస్కారం చేసి, "నేను జ్ఞాపకం వున్నానా ? —" అన్నాడు.

"ఎవరూ, ఖగేంద్రబాబా ! — కూచో, కూచో" అని కూచోబెట్టాడు దివాన్.

కుశల ప్రశ్నలతో కాస్సేపు గడిచింది. ఖగేంద్రుడు తన పేదరికాన్ని రకరకాల వర్ణించి చెప్పాడు :

"ఇంతకాలమూ , నా చెల్లెలు మీ ఆశ్రయంలో ఉండటంవల్ల నిశ్చింతగా వున్నాను. బాబుగారు తిరిగి వచ్చారాయె. ఇప్పుడు చినరాణిగారికి మా చెల్లెలి అవసరం ఏముంటుంది ? — చెల్లెలు ఇక్కడికి వచ్చేసిం దంటే నేను మెస్ వదిలి, ఇల్లు అద్దెకు తీసుకోవాలి. నాకు వచ్చే యాభై రూపాయల్లో ఇల్లు గడపటం కష్ట మవుతుంది..."

"సరే, ఆ విషయమై నువ్వు బెంగ పెట్టుకోకు. నేను చినరాణిని అడుగుతాను. మరో ఏడాదో రెండేళ్ళో కనకలత అక్కడ వుండేలా ఏర్పాటు చేస్తాను. నువు ప్రాక్టీసు పెట్టి, కాస్త సాగటం మొదలెట్టాక, వచ్చి నీ చెల్లెల్ని తీసుకువెళ్ళు."

"బాబుగారు ఇన్నాళ్ళూ కాశీలోనే వున్నారా ? —" అంటూ ధోరణి మార్చాడు ఖగేన్.

"ఉహుఁ — ఇంటికి వచ్చేముందు కొద్దిరోజులుమాత్రం వున్నా రక్కడ."

"అలాగా ! — ఆహా ! — కాశీ చాలా సుందరమైన క్షేత్రం సుమండీ. మా నాన్నగా రుండగా మే మక్కడ ఆర్నెల్లున్నాం. దశాశ్వమేధఘట్టంలోనే మా బస. సాయంత్రం అక్కడ కూచుంటే, మరి లేచిరాబుద్ధి కాదు. బాబుగారు ఎక్కడుండేవారేమిటి ? —"

"దశాశ్వమేధఘట్టం దగ్గరలోనే, ఒక యాత్రికు లింట్లో."

"ఏ యాత్రికు లింట్లో ? —"

ఈ ప్రశ్న వినగానే ఖగేంద్రుడ్ని శంకాదృష్టితో చూశాడు దివాన్.

"అహఁ — నే నెరిగిన యాత్రికుడు ఒక డున్నాడు రామదాస్ అని..." అంటూ నపిగాడు ఖగేన్.

"ఏమో. నే నా సంగతి బాబుగారి నడగలేదు. ఎందుకు ? — నీ కవసర మేమిటి ? —" అని అడిగాడు, అలా తీక్ష్ణంగా చూస్తూనే.

పరిస్థితి గ్రహించి, ప్రసంగం మార్చాడు ఖగేంద్రుడు.

"మీ రింకా వుంటారుగా ? — "

"ఆఁ — ఇంకా నాలుగైదురోజు లుంటా."

"మీరు ఇక్కడ ఉన్నన్నాళ్ళూ హడావిడిగా వుంటా రనుకుంటా. ఈ పేదవాడి మాటమాత్రం మరిచిపోకండి" అని సెలవు తీసుకు వెళ్ళిపోయాడు.

* * * * *

ఖగేంద్రుడు ఇంటికి వెళ్ళి, రాత్రీ పగలూ తెగ ఆలోచిస్తున్నాడు. ఆలోచన తెగక, బుర్ర బదలు గొట్టుకుంటున్నాడు. ఎలా అయితే నేం, పన్నాడు ఒక వ్యూహం. దొరికింది ఒకదోవ ! —

కాగితం కలం తీసుకున్నాడు. గబగబ ఏదో రాశాడు.

మర్నాడు ఆ ముషాయిద్దా అచ్చు కిచ్చాడు.

ఫొటోగ్రాఫర్ భువన్‌ను కలుసుకున్నాడు.

"భువన్!— నీతో ముఖ్యమైన పనివుండి వచ్చాను. నువ్వొక పల్లెటూరు వెళ్ళి రావాలి. ఒక జమీందారుకి ఫొటో తీసి తీసుకురావాలి. అతని జీవిత విశేషాలుకూడా రాసుకురావాలి.

"ఏమి టిదంతా?— అసలు సంగ తేమిటి?—"

"ఏమిటీ అని నెమ్మదిగా అడుగుతా వేమిటి; దేశం దేశ మంతటా సంచలనం వుడితే. నేను వంగ జమీందారుల చరిత్ర అచ్చువేస్తున్నాను. నీ కింకా తెలియదా?—"

"ఏమేనా అమ్ముడుపోతుందా?"—

"అమ్ముడుపోవటమా! అప్పుడే ఏడెనమిదివందల పుస్తకాలకి ఆర్డర్లు వచ్చాయి."

"ఎలా అయినా— మీ తెలివితేటలే వేరు. ఆఁ— ఇంతకీ, నే నేవూరు వెళ్ళాలి?"

"బాళులీపాడా. ఇవాళరాత్రి రైలుకే బయల్దేరి వెళ్ళాలి. తగిన ప్రతిఫలం ముడుతుంది. మరొకసంగతి — నువు సాధ్యమైనంత త్వరలో ఈ పని ముగించుకురావాలి. మూడునాలుగు రోజులకంటె ఎక్కువ పట్టకూడదు."

"ఏం, ఎందుకని ? —"

"ఆ జమీందారుకి ఓ ముసలి దివానున్నాడు. ఆ దివాను వున్నాడంటే మన పని చెడుతుంది. అతను లేనప్పుడు వెళితే, పాతిక కాపీలకు ఆర్డరు సంపాదించవచ్చు. దీనికి సంబంధించిన నోటీసులు ఒంటిగంటకి తీసుకువచ్చి ఇస్తా.

"మరొక ముఖ్యమైనసంగతి —

పొరబాటు నాయినాసరే, నా పేరుమాత్రం అక్కడ తీసుకురాకేం. జాగర్త. ఇదంతా ఎవరు చేస్తున్నా రని అడిగితే, నీ నోటికివచ్చిన ఏదేనా పేరు చెప్పు.

"ఈ పని పూర్తి చేసుకువస్తే, నీకు రావలసిన ప్రతిఫలం గాక, పైని నిన్ను సంతోషపెడతా. ఇదుగో, ఇది నీ ఖర్చులకు తీసుకో."

* * *

నాలుగోనాటికి భువన్ ఉత్తచేతు లూపుకుంటూ తిరిగివచ్చాడు.

"ఏం జరిగిం దేమిటి ?" అడిగాడు ఖగేన్.

"ఏముంది జరగటానికి ? — మొదటి రెండురోజులూ జమీందారు దర్శనమే కాలేదు. ఎప్పుడు వెళ్ళినా, ఎప్పు డడిగినా అంతఃపురంలో ఉన్నా రనేవాళ్ళు. నిన్న



ఉదయం దర్శనం దొరికింది. నోటీసులు ముందే పంపించాను. కానీ - ఏం లాభం ?- నానామాటలూ అన్నారు.

'ఇదంతా దొంగఎత్తు. దేశంలో పెద్దపెద్ద జమీందార్లుండగా నా దగ్గిరికే ఎందుకు వచ్చావ్ ? - వర్ధమాన్‌వారు, కూచ్‌బిహార్‌వారు, నాటోర్, కాశిమ్‌బాజార్, దీఘాపతియా జమీందార్లెంద రున్నారు. వాళ్ళదగ్గిరికి వెళ్ళక, మాదగ్గిర కెందుకు వచ్చావ్-" నేను ఫోటో తీయించుకోను, నా జీవితగాథా చెప్పను' అన్నారు."

అంతా విన్నాడు ఖగేంద్రుడు.

"ఆఁ ! -" అన్నాడు, ఏదో నిశ్చయానికి వచ్చినట్టు.

ఆవేళ సాయంత్రమే మళ్ళీ దివాన్‌దగ్గిరికి వెళ్ళాడు. "మా చెల్లెల్ని చూసి చాలా కాల మయింది. నాకూ సెలవు లిచ్చారు. మీరు అనుమతిస్తే, మీ వెంట బాఖలీపాడా వస్తాను" అన్నాడు.

"సరే. అయితే; నేను ఎల్లుండి వెళుతున్నాను, వస్తే రా."

* * *

కనకలతని కలుసుకోవాలని ఖగేన్ ఎంతో ఆరాటపడ్డాడు. కాని, ఏర్పాటు చేసే దెవరు ?- జమీందారుని కలుసుకుని దివాను వెంటనే వెళ్ళిపోయాడు. మళ్ళీ పొద్దుటికి గాని రాడు.

రాత్రి పదింటికి అక్కడి సిబ్బందితోపాటు భోజనం చేశాడు. మళ్ళీ డ్రాయింగ్ రూముకి వచ్చి కూచున్నాడు.

ఇంతలో ఒక నవుకరు లాంతరు పుచ్చుకు వచ్చాడు "దొరగా రొస్తున్నారు ! !" అంటూ. అక్కడివాళ్ళు గుసగుస లాడుకున్నారు.

రాఖాల్ వరండాలోకి రాగానే ఖగేంద్రుడు లేచినించుని వంగి తలవంచి నమస్కారం చేశాడు.

"ఎవరు మీరు ?–" అడిగాడు రాఖాల్. నౌకరు దీపం కొంచె ఎత్తిపట్టుకున్నాడు.

"నన్ను ఖగేంద్రు డంటారండి."

"ఓఁ ! – దివాన్‌జీతో కలకత్తానించి వచ్చినవారా ?–"

"చిత్తం – మా చెల్లెలు......"

"ఆఁ – నాకు తెలుసు. మీ భోజన మయిందా ?"

"చిత్తం."

"వీరికి పక్కా అదీ వేశారా ?–" రాఖాల్ నౌకర్లను అడిగాడు.

"చిత్తం. దీపాలగది పక్కన మూలగదిలో ఏర్పాటు చేశామండీ. ఇదివరకుకూడా వా రక్కడే పడుకునేవారు.

"ఆఁ – తెలుసు, తెలుసు. మీ కేమీ ఇబ్బందిగా లేదుగా –" అంటూ, సమాధానంకోసమయినా ఎదురు చూడకుండా, పడకగదిలోకి వెళ్ళాడు భవేన్.

ఖగేన్ ఆశ్చర్యపోయాడు !–

"దోమతెర పాతది వేశారేం, ఇంకొకటి లేదూ ? – "

"చిత్తం – రేపు మార్చేస్తాం."

"చెంబుతో మంచినీళ్ళు పెట్టలేదేం ? – వేసవికాలం, రాత్రిపూట దాహం వేస్తే ?– వెళ్ళు – మంచినీళ్ళు పట్టుకొచ్చి పెట్టు – మంచం కాస్త ఇటు జరిపితే, రెండు కిటికీల్లోంచీ గాలి బాగా వేస్తుంది. ఉక్కగా లేదూ ?–"

రాఖాల్ చెప్పినట్టు నవుకర్లు మంచం మార్చారు. మంచినీళ్ళు తెచ్చిపెట్టారు.

"మీ రింక విశ్రమించండి, పొద్దుపోయింది" అంటూ రాఖాల్ అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

రాఖాల్ ప్రవర్తన ఖగేంద్రుడి కెంతో ఆశ్చర్యం కలిగించింది. ఎన్నెన్నో సమస్యలను రేకెత్తించింది.

"నేను పూర్తిగా చెప్పకముందే 'నాకు తెలుసు' అన్నాడు. ఇంతపెద్ద లోగిలిలో నిత్యమూ ఎంతోమంది వస్తూ పోతూ వుంటారు. ఎవ రేగదిలో బసచేసిందీ గుర్తు

పెట్టుకోవటం వింతగానే వుంది. నన్నేం అనుమానించలేదుగద ?— నా ప్రాణాల కేం ముప్పు లేదుకదా ?—

తెరిచివున్న రెండు కిటికీలకేసి చూశాడు ఖగేన్. అతని కేదో భయం పట్టుకుంది.

"..........నిద్దట్లో వుండగా, నన్ను ఎవరిచేత నయినా హత్య చేయించరు కదా ! ఆ ఫొటోగ్రాఫర్ నన్ను గురించి ఇక్కడేమీ ఊదలేదుకదా ! — జమీందారుని గురించి గుచ్చి గుచ్చి అడిగానని దివాన్‌గాని ఏమీ హెచ్చరించలేదు కద. ఏమో ? నన్ను హత్యచేయట్టాని కేమేనా చాటుమాటున ఏర్పాట్లు చేశారేమో ! — లేకపోతే, నా గదిలోకి వచ్చి ఎందుకు చూస్తాడు ?— నామంచం అదీ ఎందుకు జరిపిస్తాడు ?—నేను తెలుసునని కూడా అన్నాడే ! — కిటికీ పక్కగా వుంటే, కర్రతో ఓపెట్టు పెట్టడానికి వీలుంటుందనే, మంచం ఇలా ఏర్పాటు చేయించివుంటాడు..."

"...ఇప్పు డేం చెయ్యను ?— తలుపులు తెరుచుకు బయటికి పారిపోనా ?— నాచుట్టూ పహరా పెట్టించాడేమో !—"

ఈ భయంతో ఖగేంద్రుడు వెంటనే లేచి, కిటికీతలుపులు వేసేశాడు. తలుపులు గట్టిగా పడ్డాయో లేదో అని మరోసారి చూసి, మళ్ళీ వచ్చి పడుకున్నాడు. కాని నిద్రపట్టలే.

ఒకటి — రెండు — మూడయింది ! —

కాస్సేపు కునుకు పట్టిం దప్పుడు,

ఏదో కల ! — పీడకల ! —

ఉలిక్కిపడి లేచి కూచున్నాడు ! —

* * * *

"ఎలా అయినా నువ్వు ఆ సురబాల సంగతి కూపీ లాగావంటే...?"

"మీ పని నెరవేరుతుంది. అంతేనా ?" అంటూ, ఖగేన్ మాట పూర్తిచేసింది కనకలత.

"అవును, కుట్రదార్లు ఇద్దరిలో ఒకళ్ళసంగతి కనుక్కుంటే చాలు, రెండోవాళ్ళ సంగతి ఇట్టె బయటపడుతుంది."

"అయితే మీకు నేను సహాయపడగలను. సురబాల పుట్టిల్లెక్కడో నాకు తెలుసు."

"ఏవూ రేవూరు ? — ఎక్కడ ? —"

"వసంతపూరు"

"ఎలా తెలుసుకున్నావ్ ?"

"ఒకనాడు మాటమీద మాట వచ్చి, 'మా వసంతపూర్ లో...నా చిన్నప్పుడు...' అంటూ చెప్పబోయి, నాలి క్కరుచుకుంది."

"వసంతపూరు ఆమె పుట్టిల్లో అత్తిల్లో ఎలా చెప్పగలవ్ ?"

"చిన్నప్పుడు — అందిగా !—"

"ఆఁ — అవును. పుట్టిల్లే అయివుండవచ్చు. ఒకవేళ అత్తవారి ల్లయినా ఫరవా లేదు. వసంతపూర్ అంటే — ఎక్కడి వసంతపూరో చెప్పగలవ్ ?—"

"దాని మాటా తీరూ చూస్తే వర్ధమాన్ జిల్లా మనిషిలా వుంది. మాట సాగదీసి మాటాడుతుంది."

"సరే, నే నివాళే వెళ్తాను."

"ఒకసంగతి — దాని అసలుపేరు సురబాల అయివుండదేమో...?"

"ఆసంగతి నాకు చెప్పాలా ? — అవునుగాని. ఆమె గంగలో కొట్టుకు వచ్చినప్పుడు కట్టుకున్నచీర ఎక్కడుంది ?—"

"ఉంది. ఏం ? — ఎందుకూ ?"

"ఒకసారి చూపించు."

చీర జాగ్రత్తగా చూశాడు ఖగేంద్రుడు. జేబులోంచి కత్తెర తీశాడు. దానిమీద వున్న చాకలిగుర్తు కత్తిరించి జేబులో వేసుకున్నాడు.

"ఇక నే వెళతాను. ఈ మాయాభవేంద్రుడి గుట్టుమట్లు బయటికి లాగకపోతే నా పేరు ఖగేంద్రుడేకాదు; వస్తా."

* * * *

బాళులీపాడానుంచి కలకత్తా చేరుకున్న ఖగేంద్రుడు అవసరమైన దర్యాప్తులు చేశాడు. వర్ధమాన్ జిల్లాలో వసంతపూరులో వాలాడు. టపాబండిలో ఊళ్ళోకి చేరుకున్నాడు.' బండి దిగుతూనే, తన పుస్తకప్రచారం ప్రారంభించాడు. బండి పోస్టాఫీసు ముందు ఆగింది. ఖగేంద్రుడు పోష్టుమాష్టరికీ, ఆయన పక్క నున్న ముఖర్జీకీ వెరొక కరపత్రం ఇచ్చాడు. ఎవరిచేతా చెప్పించుకోకుండానే అక్కడున్న స్టూల్ బల్లమీద కూచున్నాడు.

ముఖర్జీ కరపత్రం చదివి, "మీ పుస్తకం పాడ్యమినాడా వెలువడుతుంది?—మీరేమీ అనుకోకండి, ఒకమాట చెబుతాను ! నెలలో మొదటిరోజు మంచిదికాదు. అగస్త్యుడు వెళ్ళిపోయినరోజు......"

"చిత్తం. అందుకనే, ఆ రోజున వెలువరిచటం," అన్నాడు ఖగేంద్రుడు నవ్వుతూ.



"అదేమిటి ?" అన్నాడు ముఖర్జీ ఆశ్చర్యంగా.

"వెళ్ళిపోయిన అగస్త్యుడు మళ్ళీ తిరిగిరాలేదు, అవునా ? — అలాగే, నా పుస్తకాలు కూడా దేశంలోకి నలుమూలలా వెళ్ళాలనీ, బాగా అమ్ముడు పోవాలనీ, ఆరోజున వెలువరిస్తున్నా." అన్నాడు ఖగేంద్రుడు వినయంగా.

చిత్రమైన అతనిధోరణి చూసి, ముఖర్జీ ముచ్చటపడ్డాడు. "అయితే, మీ రిక్కడ ఏమిటి సేకరిస్తారు ?"

"ఈ పూరి రాయ్ జమీందార్ల వంశచరిత్ర సేకరించాలి. ఎప్పుడు వెళ్ళితే వారి దర్శనం లభిస్తుంది ?"

"పొద్దున్న ఎనిమిది, తొమ్మిదింటికి వెళ్ళితే, వారిని కచేరీలో చూడవచ్చు. మీ రీవూళ్ళో ఎన్నాళ్ళుంటారు ?"

"ఆ — నాలుగు రోజులైనా ఉండాలి. ఇక్కడ ఇల్లేదైనా అద్దెకి దొరుకుతుందా?"

"అద్దెకు ఇళ్ళు దొరకటానికి ఇవి కలకత్తా కాదుగా ?—" పోస్టులో 'వంగవాసి' పత్రిక రాకపోవటంతో, ముఖర్జీ ముఖం ఇంతైపోయింది.

ఖగేంద్రుడు తను కూడా తెచ్చుకున్న పత్రిక లన్నీ బయటపెట్టాడు. ఆ పత్రికలు చూచేసరికి ముఖర్జీకి ఎక్కడలేని సంతోషమూ వచ్చింది. "వీటిని ఇంటికి తీసుకెళ్ళి చదివి, మీ కిచ్చేస్తాను. మీ రెక్కడుంటారు?"

"అదె ఇంకా తేలలే. అద్దెకు ఇల్లుకూడా దొరక దన్నారుగా? ఎక్కడ ఉండటమూ అని ఆలోచిస్తున్నా."

ముఖర్జీ లేచి, "చాలు, చాలు నీవంటివాణ్ని మా ఇంటికే తీసుకెళ్ళివుందును. కాని, ఇంటికి చుట్టా లొచ్చారు. నీకూ ఇబ్బందిగా వుంటుంది. మరొక ఏర్పాటు ఏదైనా చేస్తాను రా. ఆ చెట్లచాటున కనబడేదే మా బడి స్కూల్లో ఒకగది ఇప్పిస్తాను. మాతో పాటే నాలుగు మెతుకులు తిందువుగాని," అంటూ ఖగేంద్రుణ్ని కూడా తీసుకుపోయాడు ముఖర్జీ.

'మీవల్ల మరొక ఉపకారం కావాలి. నా గుడ్డలు బొత్తిగా మాసిపోయాయి. ఇక్కడెవరైనా చాకలి దొరుకుతాడా?"

"ఆఁ, ఆఁ - మీ కలకత్తా చాకళ్ళలా ఉతకలేకపోయినా, ఏదో, బాగానే ఉతుకుతాడు మా చాకలి వాడిపేరు నీలమణి. ఇంటికి వెళ్ళి వాడికి కబురెడతాను" అంటూ ముఖర్జీ వెళ్ళిపోయాడు.

ఖగేంద్రుడు టీ పెట్టుకునే ప్రయత్నంలో వున్నాడు.

* * * * *

జమీందారుగారి తమ్ముడు నవీనచంద్రుడు గత మాఘంనించీ కనబడటంలేదు.

కృషదసుఘోషాల్ కూతురు లీలావతి పత్తా తెలియటంలేదు

వీళ్ళిద్దరూ మాయమైన రోజుకి క్రితంరాత్రి సైరభి అనే దాసి నవీనబాబుతో కలిసి గాజన్ తలా సంతవీధిదగ్గర కనిపించింది.

—ఇవీ, ఖగేంద్రుడు కొత్తగా వసంతపూర్ లో తెలుసుకున్న విషయాలు.

'అఁ!- దొరికింది కిటుకు. గంగలో కొట్టుకువచ్చిన సురబాల లీలావతి తప్ప మరెవరూ కాదు ఇదిమాత్రం నిశ్చయం అయితే - నవీనచంద్రుడే భవేంద్రుడా?- అన్న విషయంమటుకు ఇంకా నిశ్చయంగా చెప్పలేం.

'చాకలి నీలమణిని ఆరా తీయాలి. సైరభిని కలుసుకుని కూపీ లాగాలి...' అనుకున్నాడు ఖగేంద్రుడు.

నాలుగోరోజున మధ్యాహ్నం పోస్టాఫీసుకి వెళ్ళాడు.

అక్కడ గాజన్‌తలా ఠాణా సబిన్స్పెక్టరు తారసపడ్డాడు.

ఖగేన్ కి ఇన్‌స్పెక్టరుతో పరిచయమై, స్నేహం కలిసింది.

ఖగేంద్రుడు కరపత్ర మొకటి ఇన్‌స్పెక్టరు కిచ్చాడు. అది చూచి ఇన్‌స్పెక్టరు ఏవేవో ప్రశ్న లడిగాడు

"మీకు అభ్యంతరం లేకపోతే, నాకు కాసిని నోటీసు లివ్వండి. గాజన్‌తలాలో జనం ఎక్కువగా వచ్చే చోటలో వేలాడగట్టిస్తాను," అంటూ, ఇన్‌స్పెక్టరు లేచాడు.

ఖగేంద్రుడు ధన్యవాదాలు తెల్పి, కొన్ని కరపత్రా లతని కిచ్చాడు.

* * * * *

"మీ పేరేనా ఖగేంద్రబాబు?–" అడిగాడు జమీందారు శారదాబాబు.

"చిత్తం."

"మీ కరపత్రం చదివాను. మీరు వంగ జమీందారుల చరితమాల ప్రకటిస్తున్నారు కదూ?"

"చిత్తం."

"చరితమాల—మాల—మాల—మాల వేటితో తయారు చేస్తారు ఖగేంద్రబాబూ?"

"పూలతోను, ముత్యాలతోను......"

"అంటే, మాల మంచిమంచి పూలతోనే తయారు చేస్తారన్నమాట లేదా, అందమయిన వస్తువులతో తయారుచేస్తారు. అంతేకాని పిడకలు, పాతచెప్పులు దండ గుచ్చితే మాల అవుతుందా?– ఈ వంగ జమీందారుల చరిత్రలు మాల గుచ్చవలసినంత గొప్పవని మీ రనుకుంటున్నారా?–"

"ప్రభువులు సరిగ్గా సెలవిచ్చారు. సుందరమైనవి పవిత్రమైనవి మాత్రమే మాల గుచ్చుతారు. అయితే చేతికి అందిన వన్నీ మాల గుచ్చరు. మంచివాటిని ఏరి మరీ గుచ్చుతారు. పూలలో ఎన్నెన్నో రకాలున్నా – మల్లి, మొల్ల, గులాబి – పువ్వులు మాత్రమే దండ గుచ్చుతారు. అలాగే – నేను మంచివాటితో మాత్రమే ఈ మాల తయారు చేద్దామనుకుంటున్నాను. తమరు ఎక్కడో ఈ మూల పల్లెటూళ్ళో ఉన్నా, తమ పేరుప్రఖ్యాతులు కలకత్తాలోనే విన్నా. పువ్వులు సువాసనలను దాచుకోలేనట్టు, ప్రభువులు ఔదార్య మనే పరిమళాన్ని ఎలా దాచుకోగలరు?–"

ఖగేంద్రుడి వాక్చాతుర్యాన్ని శారదాబాబు మెచ్చుకున్నాడు. ఖగేంద్రుడి పుస్తకాన్ని గురించి మరికొన్ని ప్రశ్నలు వేశాడు. అయిదు పుస్తకాలకు చందా కట్టేందుకు అంగీకరించాడు. ఖగేంద్రుడు జమీందారు జీవితాన్ని గురించి వివరాలు రాసుకుని, "తమ తమ్ములు నవీన్‌బాబుగారిని గురించి ఏమీ రాయనేలేము. వారిని ఒకసారి కలుసుకోవచ్చా?–"

"సహీనా ? — వా డిక్కడ లేడుగా ! —"

"మరి ఎక్క డున్నారు ?"

"కలకత్తాలో"

"కలకత్తాలో అయితే. నే స్వయంగా వెళ్ళి కలుసుకుంటా. వారి అడ్రసు ఇవ్వండి"

శారదాబాబు తమ్ముడి అడ్రెసు రాయించి ఇచ్చాడు. ఖగేంద్రుడు సెలవు తీసుకున్నాడు.

* * * * *

ఇన్స్పెక్టరు దగ్గర్నుంచి ఖగేంద్రుడికి ఉత్తరం వచ్చింది — "ఎల్లుండి ఉదయం ఇద్దరు పెద్ద జమీందార్లు వస్తున్నారు. చాలా పుస్తకాలుకు చందా రావచ్చు. కనుక, రేపు తొమ్మిది పది మధ్య ఒకసారి రండి" అని. ఉత్తరం తెచ్చిన కానిస్టేబిల్ను కాస్సేపు బయట కూచోమన్నాడు.

ఈలోగా నీలమణి గుడ్డలు తీసుకువచ్చాడు

ఖగేంద్రుడు తన గుడ్డలు తీసుకున్నాడు. సురబాల చీరె తాలూకు ముక్క వాడికి చూపిస్తూ. "ఇదుగో, ఈ గుడ్డముక్క చూడు. దీని మీద ఈ గుర్తు నువ్వు వేసిందేనా ?—

ఇంటిముందు కానిస్టేబిలు, ఖగేంద్రుడిలా అడగటం చూసి, నీలమణి గాబరా పడ్డాడు. అనుమానంతో గుటకలు మింగుతూ, "చిత్తం — నాకు సరిగా గుర్తులేదు బాబూ ! — ఇది మీ కెలా వచ్చిందీ ?—"

"నా కెలా వచ్చిందో నీ కెందుకు ? అడిగినదానికి సమాధానం చెప్పు — ఊఁ—"

"చిత్తం, చిత్తం — నేను పేదవాణ్ని బాబూ, కరుణించండి" అంటూ నీలమణి చేతులు జోడించాడు.

"నువు పేదవాడి వైతే ఎవరిక్కావాలి, ధనవంతుడివయితే ఎవరిక్కావాలి ? — ఇది నువ్వు వేసిన మార్కు అవునా, కాదా ?—"

"ఏం జరిగింది బాబుగారు ?—"

"ఖూనీ !—"

"ఆఁ — ఆఁ — అమ్మాయిగారు ఖూనీ అయిందా ?—"

"ఆఁ, ఖూనీ చేశారు మీ అమ్మాయిగారి పే రేమిటో చెప్పు —ఊఁ—"

"లీలావతి, బాబూ !—ఘోషాల్గారి కూతురు పాపం ! ఖూనీ చేసిం దెవరు బాబూ ?—



“ఇంకెవరు ?—మీ జమీందారుగారి తమ్ముడు.”

“చినబాబుగారా ! అయ్యో...నాకు అప్పుడే తెలుసు, అయితే — మీరు పోలీసులా బాబూ ?—”

“ఆ — అవును, నేను డిటెక్టివ్‌ని,” అంటూ, మీసంమీద చేయి వేసి తిప్పుకున్నాడు ఖగేన్.

”మీ కెన్నయినా దణ్ణాలు బాబయ్యా !— నేను బీదవాణ్ని, నా కేం తెలియదు. నన్ను మాత్రం సాక్షుల్లో వేసుకోకండి. కావాలంటే మీ బట్టలు ఊరికే ఉతికిస్తాను. దయవుంచండి, టిక్‌టిక్ బాబూ !—’’

“సరే, వెళ్ళు వెళ్ళు — ఈ సంగతి ఎక్కడా చెప్పక. జాగర్త !—”

“చిత్తం బాబూ ! — నా నాలిక తెగ్గోసినా చెప్పను.”

* * * * *

శారదాబాబూ దొడ్డివేపు వసారాలో సంధ్య వార్చుకుంటున్నాడు.

నీలమణి ఆయాసపడుతూ వచ్చాడు, “కొంప మునిగింది, హుజూర్ !— కొంప మునిగింది !!— మీ చేతికింద నీళ్ళు తాగుతున్నవాణ్ని గనక ఒక్క మాట చెప్పిపోదామని వచ్చా. ఖూనీ కేసు, హుజూర్ !— ఖూనీ కేసు !! ఊళ్ళోకి పోలీసువా

క్లొచ్చేశారు. డిక్కీ డిక్కీ బాబు వచ్చాడు. ఈ సంగతి నే చెప్పానని మాత్రం చెప్పకండి హుజూర్!– వీదవాణ్ని. చచ్చిపోతాను చినబాబు ప్రాణాలు రక్షించండి. బాబయ్యా. రక్షించండి. నే పోతున్నా బాబయ్యా!– దండాలు." అంటూ. ఇంటి దోవ పట్టాడు

జమీందారుకి సంధ్య సాగలేదు పోస్టాఫీసులో ఇన్స్పెక్టరూ, ఖగేంద్రుడూ కలుసుకోవటం, ఖగేంద్రుడికోసం అడపా దడపా కానిసేబిల్ రావటం. కలకత్తాలో ఉన్న నవీన్ అడ్రెసుకోసం ఖగేంద్రుడు ఆరా తీయటం.– ఇవన్నీ జమీందారుకి ఇదివరకే తెలుసు. ఇప్పుడా సంగతులన్నీ మళ్ళీ మళ్ళీ జ్ఞాపక మొచ్చాయి. నీలమణి ఇప్పుడు చెప్పింది నిజమే ననిపించింది.

శారదాబాబు గబగబ రెండో అంతస్థులోకి వెళ్ళి, ఆడవాళ్లతో ఏదో ఆలోచించాడు.

రాత్రి తొమ్మిదింటికి నమ్మకమైన ఒక ఉద్యోగిని ఖగేంద్రుడి మకాంకు పంపాడు జమీందారు.

* * * * *

"హుజూర్!– ఐదు వేలకి కానీకూడా తగ్గడట. ఖూనీ ఆధారాలు కావలసినన్ని ఉన్నాయిట. అయితే, ఖూనీ చేయబడిన స్త్రీ ఎవరో తెలియలేదట. అది కూడ ఇక్కడికి వచ్చాక తెలిసిందట ఇప్పుడు సగం–అంటే, రెండు వేల ఐదువందలూ ఇవ్వాలిట తగిన ఆధారాలు దొరకలేదని రిపోర్టు రాశాక తక్కిన మొత్తం ఇవ్వాలిట" అని చెప్పాడు, ఖగేంద్రుడి దగ్గరనుంచి తిరిగివచ్చిన ఉద్యోగి.

శారదాబాబు మళ్ళీ అంతఃపురంలోకి వెళ్ళి ఆలోచించాడు.

* * * * *

ఖగేంద్రుడి ఎత్తు ఫలించింది. రెండు వేల ఐదువందల కరుకులూ చేతిలో పడ్డాయి. "వాహ్!– తల యెత్తిందో లేదో, గెలు వేసిం దీ ఎత్తు!" అని ఎగిరి గంతేశాడు.

మళ్లీ తన ఆలోచనలో పడ్డాడు

"మాయాభవేంద్రు డెవరయిందీ కనిపెట్టి తీరాలి. నే ననుకున్నట్టు అతను నవీన్ కాదేమో?– ఏమో!– అయితే కానూవచ్చు. బాహుపాశాలో భవేంద్రుడుగా నటిస్తూ, ఉత్తరాలు మాత్రం కలకత్తానించి పోస్టు చేయిస్తున్నాడేమో! ఇదేం పెద్ద ఆధారమేం కాదు.

"ఊ!– ముందు కలకత్తా వెళ్లి, అక్కడ నవీన్ నిజంగా వుంటున్నాడో లేదో ఆరా తియ్యాలి. ఒకవేళ నవీన్ కలకత్తాలోనే వుంటే?– ఇంకేంటి చెయ్యడం?......

"ఆఁ — లీలావతి ఎక్కడెక్కడ తిరిగిందో, ఏమేం చేసిందో ఆచూకీ తియ్యాలి. అప్పుడే ఈ మాయాభవేంద్రు డెవడో బయట పడతాడు. ఇవన్నీ తెలుసుకుని, సైరంధ్రిని అడిగి తక్కిన విషయాలు లాగాలి. ఆదిమాత్రం ఓ పట్టాన చెబుతుందా?— నేను డిటెక్టివ్ నన్న సంగతి రేపు ఈ పాటికి ఎలాగూ ఊరు ఊరంతా పాకిపోతుంది. అప్పుడిహ ఏ సంగతి తెలుసుకోవాలన్నా కష్టమే...

"నేనే గనక పోలీసు డిపార్టుమెంటువాడి నయితే—ఎంత బాగుండును?— ఇద్దరు ముగ్గురు కాన్‌స్టేబిల్స్‌ని తీసుకువెళ్ళి సంకెళ్లు చూపించి భయపెట్టి, బెదిరించి, ఉబ్బించి ఏదేనా చెయ్యటానికి వీలుండేది..."

మళ్ళీ కాస్సేపు ఆలోచిస్తూ, గదిలో అటూ ఇటూ పచార్లు చేశాడు.

"ఆఁ— అన్నట్టు— ఈ ఇన్‌స్పెక్టరొకడున్నాడుగా? ఇతనేం డబ్బు కతికే బాపతుగా కనబడటంలే

"ఆ — ఇతనికి కవిత్వంపిచ్చి ఒకటుంది. ఏదేనా కథగాని కథ— కట్టుకథ ఒకటి కల్పించి, ఇన్‌స్పెక్టరు చేత నా పని చేయించుకోవాలి......

రేపే — రేపు పొద్దున్నే వెళతాను......"

* * * * *

"కాస్త టీ పుచ్చుకుంటారా?—" ఇన్‌స్పెక్టరు ఖగేంద్రుణ్ని అడిగాడు.

"థాంక్స్ — ఇప్పుడే తీసుకున్నా."

"ఇంత దూరమూ నడిచివచ్చారుగా, మరొకసారి తీసుకోండి" అంటూ, టీ తెప్పించి ఇచ్చాడు.

తరవాత —ఇద్దరూ కాస్సేపు ఖులాసాగా కబుర్లు చెప్పుకున్నారు.

"మీ రింత పొద్దున్నే వచ్చారు కాని, మీకు కావలసిన చందాదారులు, వాళ్ళ పనులూ అవీ పూర్తి అయితేగాని రారు."

పోనీలెండి జమీందారుల చరిత్ర వేస్తున్నా నని నే నిలా రావటం ఒక వంకనే" "అన్నాడు ఖగేంద్రుడు, ముసిముసిగా నవ్వుతూ.

ఇన్‌స్పెక్టరు ఖగేంద్రుడి ముఖంకేసి ఆసక్తిగా చూస్తూ "అవునవును, నాకూ తెలుసు" అన్నాడు

ఖగేంద్రుడు ఆశ్చర్యపోయాడు "ఎలా తెలుసుకున్నారు?"...

"ఆవేళ మిమ్మల్ని పోస్టాఫీసులో కలుసుకున్నప్పుడే మీమీద నాకు కాస్త అనుమానం కలిగింది. మీ కరపత్రం కలకత్తా కమీషనర్‌కి పంపాను."

"ఆఁ — ?" ఖగేంద్రుడి గుండె దడదడలాడింది. ముఖం పాలిపోయింది.
"ఇంకా ఏం తెలుసుకున్నారు?"

'మీరు పరారీలో ఉన్నావారు కారనీ, మీరు అనుమానితుల పట్టీలో లేరనీ కూడా తెలుసుకున్నాను."

' ఇంకా ?—"

"మరేం లేదు. ఇప్పటివరకూ ఇంతే తెలుసుకున్నాను."

నా మీద అనుమానం కలిగినప్పుడు నా పుస్తకానికి చందాదారుల్ని ఎందుకు ప్రయత్నించారూ?— నన్ను ఎందుకు కబురు చేశారూ?"—

"మీకు కబురు చేసేటప్పటి కింకా కమీషనర్ దగ్గరనించి టెలిగ్రాం రాలేదు. మరొక విధంగా గనక టెలిగ్రాం వచ్చి వున్నట్టయితే, అరెష్టు చెయ్యటానికి మిమ్మల్ని వెదకవలసి వస్తుందేమో నని, ముందుగానే మీకు కబురంపాను. మీ భాషలో చెప్పాలంటే, నేను చందాదారుల్ని చూడట మంతా వట్టి నటనే" అంటూ, ఇన్‌స్పెక్టర్ పకపక నవ్వాడు.

ఖగేంద్రుడి ముఖం చిన్నబోయింది. తల దించేసుకున్నాడు.

"ఏమిటి ఖగేన్‌బాబూ!— ఈ పాటిదానికే కోపం తెచ్చుకున్నారా?— చూడండి నేను పోలీసువాణ్ని. ప్రతీదాన్ని అనుమానించటమే నా వృత్తి నా డ్యూటీ నేను చేశాను అందుకు మీరు విచారించటం దేనికి?— ముఖం చిన్నబుచ్చుకున్నా రెందుకని?—"

మీరు నన్ను దొంగగా, నీతి బనివానిగా అనుమానించారు. కాని, అందుకు నేను విచారించటంలేదు మీ మీద నే నొక ఆశపెట్టుకు వచ్చాను నా ఆశ నిరాశ అవుతున్నదే అని నా విచారం"

"మా మీద ఆశపెట్టుకు వచ్చారా?— ఏ విషయంలో?—"

"కొన్ని సంగతులు దర్యాప్తు చేసి తెలుసుకుందా మని నే నీప్రాంతానికి వచ్చాను. నా జీవితం ఈ సంగతులమీద ఆధారపడివుంది. మీరు పోలీసు అధికారులు గనుక, ఆ సంగతులు నాకు దర్యాప్తు చేసిపెట్టగలరు."

"అస లింతకీ — విషయ మేమిటో చెప్పటంలేదు మీ పేరు ఖగేన్‌బాబే అయి వుంటే, మీకు ఆశాభంగం కలగటానికి కారణ మేమిటో స్పష్టంగా వివరిస్తే చెబితే, అప్పుడు నేను మీ కేదైనా సహాయం చేయగలిగిందీ చేయలేందీ చెబుతా."

"మీకు నా పేరుమీదనే నమ్మకం లేనప్పుడు, మీరు నాకు సహాయం చేస్తారని ఎలా ఆశించగలను?— ఈ ప్రాంతానికి నేను పూర్తిగా కొత్తవాణ్ని నా పేరు నిజంగా ఖగేంద్రనాథ వంధ్యోపాధ్యాయే అని ఎవరిచేత రుజువు చేయించగలను?—"

ఇన్‌స్పెక్టరు అరక్షణం ఆలోచించాడు. "న్యాయ విరుద్ధం కాని ఉపకారం ఏదేనా వీలుంటే తప్పకుండా చేస్తాను."

"న్యాయాన్ని వదలకుండానే, మీరు నా కా ఉపకారం చేయ్యగలరు. ఈ ఉపకారం నా ఒక్కడికే కాదు — వంగదేశంలోని ఒక గౌరవ కుటుంబానికి మీరు చేసినవా రవుతారు."

"అయితే ఏమిటో వివరంగా చెప్పండి."

"ఒక యువతి, ఒక యువకుడు ఒక చోటికి వెళ్ళి, ఒక పెద్ద మోసం చేసే ప్రయత్నంలో వున్నారు. నేను వాళ్ళ మోసాన్ని అడ్డగించ దలుచుకున్నా. ఆ స్త్రీ ఎవరయిందీ ఇక్కడికి వచ్చాక తెలుసుకో గలిగాను; కానింకా, ఆ పురుషు డెవరయిందీ ఖచ్చితంగా తేలలేదు."

ఎక్కడ జరుగుతున్న దీ మోసం?—"

"ఆ సంగతి ఇప్పుడే అడక్కండి, చెప్పను. ఈ జిల్లాలోదీ, ఈ డివిజన్‌లోదీ మాత్రం కాదు."

"ఆ స్త్రీ ఎవరు?—"

"వసంతపూర్‌లో కృష్ణదాస్ ఘోషాల్‌గారి కూతురు; పేరు లీలావతి. ఈ సంగతి ఎలా తెలుసుకున్నా నంటారేమో - వినండి ......" అంటూ, ఇప్పటి వరకూ జరిగిన తన పరిశోధన గురించి చెప్పాడు.

"మీరు చూడగా, అపర షెర్లాక్ హోం లా వున్నారే. ఎవరిమీదయినా మీకు అనుమాన ముందా ___"

"ఉంది. ఆవాళ రాత్రి లీలావతి తన అత్తగారి వూరినించి పారిపోయింది. పారిపోయిన రాత్రి ఆమె ఈ గాజన్‌తలా దగ్గర సైరధి అనే స్త్రీతోను, నవీన్ చంద్రుడితోనూ కలిసి వెళ్ళింది. ఆ రాత్రే లీలావతి ఎత్తా తెలియలేదు అంచేత, నవీన్‌తో ఆమె లేచిపోయిందేమో ననీ, వాళ్ళిద్దరూ కలిసి ఈ మోసం చేస్తున్నా రేమో ననీ, నా అనుమానం......"

ఇన్‌స్పెక్టరు ఆనాటి పాత డైరీలు తెప్పించి చూశాడు. చౌకీదారు రాయించిన డైరీలో ఖగేంద్రుడు చెప్పిన వివరా లన్నీ వున్నాయి.

"ఈ మోసానికి మీరు అడ్డుపడటం, ఈ దర్యాప్తు చేయటం అదీ అంతా, ధర్మ బుద్ధితోనూ పరోపకారబుద్ధితోనే చేస్తున్నారా ?___" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

"అదేం కాదు. ఇందులో నా స్వార్థమూ వుంది..." అంటూ, అల్లిబిల్లి కథ ఒకటి అల్లి చెప్పాడు.

చివరికి ___ "లా ప్రకారం నే చెయ్యగల సహాయం వుంటే పూర్తిగా చేస్తాను" అని ఖగేంద్రుడికి మాట ఇచ్చాడు ఇన్‌స్పెక్టరు.

* * * * *

ఖగేంద్రుడు కనకలతకు ఇలా రాశాడు :

.........మరికొన్ని కొత్త సంగతులు తెలుసుకోగలిగాను. ఇక్కడ సబ్ ఇన్‌స్పెక్టరు సహాయంతో సైరధిని క్రాసుపరీక్ష చేశాను. చాలా సంగతులు తేలాయి

నవీనచంద్రుడు డబ్బు ఆశ చూపి దానిని మయనాపల్లికి పంపాడట. అక్కడ లీలావతిని కలుసుకుని, "మీ అమ్మని చూపించి, మళ్ళీ తీసుకువచ్చి దిగబెడతాను" అని చెప్పిందిట. లీలావతి సైరధితో వచ్చేసింది. ఊరిబయట చెట్లచాటున దాక్కొని వున్న నవీనచంద్రుడు లీలావతిని పట్టుకుని, నోట్లో గుడ్డలు కుక్కి, బండిలో ఎక్కించుకుపోయాడు. బండివాణ్ణి కూడా పరీక్షచేశారు ఇన్‌స్పెక్టరుగారు. వాళ్ళు నయన పూర్ దగ్గర్లో ఒక మేడలో దిగారట. ఎల్లుండి ఇన్‌స్పెక్టరుగారితో నయనపూరు వెళ్ళుతున్నాను.

* * * * *

నయనపూరు దర్యాప్తుకు ఇన్‌స్పెక్టరు ఒక్కడే వెళ్ళాడు......

నెల్లాళ్ళకి పైగా లీలావతి అక్కడ బంధించబడి వున్నదిట. నవీనుడు ఆమెను ఎన్నో విధాల బతిమాలాడేవాడట? లీలావతి ఎప్పుడూ ఏడుస్తూ, 'దగ్గరికి వచ్చావంటే ఈ మేడమీదినించి దూకి చస్తా' నంటూ బెదిరించేదిట.

అక్కణ్ణించి లీలావతిని కాల్‌నాకి తీసుకువెళ్ళాడట. ఇన్‌స్పెక్టరుగారు నన్ను కాల్‌నా పంపిస్తున్నారు......

సురబాల — అంటే లీలావతి నవీనుణ్ని విడిపించుకుపోయిందేమో ననిపిస్తుంది.

... ...

కనకలత ఖగేంద్రుడికిలా రాసింది!

...మీ ఉత్తరాలు రెండూ అందాయి. నేను ఒక్క సంగతి మాత్రం తెలుసుకోగలిగాను, ఇక్కడికి భవేంద్రుడుగా వచ్చినతడు ఇక్కడికి రావటానికి పూర్వం తిన్‌తారియా మఠాధిపతిగా ఉండేవాడుట. ఈ సంగతి ఒకసారి అతను దివాన్‌తో చెబుతూ ఉండగా నే విన్నాను......

భవేంద్రుడు ఎవరేనా కానీండి — చినరాణి ప్రేమలో పడ్డాడు. ఈ మధ్య చినరాణికి జ్వరం వచ్చింది. ఒక రోజు కాస్త ఎక్కువగా వుంటే ఆనాడు ఆమె పక్కదగ్గిరే కుర్చీ వేసుక్కూర్చున్నాడు అతను అతని కళ్ళమ్మట నీళ్ళు నేను స్పష్టంగా చూశాను ఇలా మనస్ఫూర్తిగా ప్రేమించుకున్న వీళ్ళని చూస్తే నాకెంతో ముచ్చటగా వుంది......

... ...

కాల్నానుంచి ఖగేంద్రుడు కనకలతకిలా రాశాడు :

నీ ఉత్తరం అందింది. నువు చెప్పిన తిన్‌తారియా మఠం ఎక్కడ వుందో అంతు పట్టటంలేదు. తెలుసుకోవాలి.

ఇక్కడ వున్న ఇన్‌స్పెక్టర్‌గారి సాయంతో పల్లెవాళ్ళను వాకబు చేశాను. వారిలో దరిబుల్లా అనేవాడు ఒక సంగతి చెప్పాడు...ఒక పెద్దమనిషి జబ్బుగా వున్న స్త్రీతో అతని పడవ ఎక్కాడట ఆమెకి అతనంటే ఇష్టం లేదట. ఎప్పుడూ ఏడుస్తూ వుండేదిట. తిండి సరిగా తినేదికాదట. ఆ పెద్దమనిషిని మాత్రం దగ్గరకు రానిచ్చేది కాదుట.

ఒకరోజు ఆమె ఉరిపోసుకుందట. కానీ, ఆ పెద్దమనిషి వెంటనే ఉరితాడు కోశేశాడట చాలా సేపటికిగాని ఆమెకు తెలివి రాలేదు

పడవలో ఆమె ఒంటరిగా పడుకునేది. ఒకనాడు పొద్దున్నే చూస్తే ఆమె కనబడలేదట. దేరాన్‌గంజ్ దగ్గరలో రాత్రి ఎదో నీళ్ళలో దూకినట్టయిందట.

ఆరోజు ఫాల్గుణ బహుళ చతుర్దశి.

సురబాల అక్కడికి ఏరోజున వచ్చి చేరుకుందో రాయి ...

... ...

ఖగేంద్రుడికి కనకలత రాసింది :

డోలోత్సవంనాటి పర్నాడు ఉదయమే సురబాల ఇక్కడ రేవుదగ్గిర దొరికింది.

... ...

కనకలతకు ఖగేంద్రు డిలా రాశాడు :

నా దర్యాప్తు అంతా వ్యర్థ మయింది. ఈ మాయాభవేంద్రు డెవరయిందీ నా కేమీ అంతుపట్టటంలేదు.

నవీన్‌చంద్రుడి జాడ తెలుసుకుందామని నేను కలకత్తా వచ్చాను. అతని అడ్రెసు కనుక్కొని వెళ్ళాను. వెళితే, మెడికల్‌కాలేజి ఆస్పత్రిలో ఉన్నా డని తెలిసింది.

ఆస్పత్రికి వెళ్ళాను. గుర్రపుబగ్గీ బోల్తా పడటంవల్ల బలంగా గాయాలు తగిలి, కొన్నాళ్ళనించీ ఆస్పత్రిలో వుంటున్నాడు. నాలుగయిదుసార్లు కలుసుకున్నాను.

మొన్ననే నవీన్ చచ్చిపోయాడు. చచ్చిపోయేముందు వకీలుచేత వీలునామా రాయించాడు. దైవానుగ్రహంవల్ల తన ప్రయత్నం నెరవేరలేదనీ, లీలావతికి శీలభంగం కాలేదనీ రాశాడు. తన పాపానికి ప్రాశ్చిత్తంగా తన ఆస్తిలో సగం లీలావతికి చెందేలా రాశాడు. ఆ వీలునామామీద నేనూ సాక్షిసంతకం చేశాను.

ఎల్లుండి నేను కాశీ వెళుతున్నాను. తిన్‌తారియా మఠం ఎక్కడ వున్నదీ తెలుసుకుని, మాయాభవేంద్రు డెవరయిందీ తేలుస్తాను.

... ...

తిన్‌తారియా మఠానికి వెళ్ళాను. బాళులీపాడా భవేంద్రుడు అక్కడ కొంతకాలం మఠాధిపతిగా వున్నాడుట. కొద్దిరోజుల్లో మళ్ళీ వస్తా నని చెప్పి, కిందటి ఫాల్గుణంలో అతను వంగదేశానికి బయలేరాడట. తరువాత అతని సంగతే తెలియలేదుట.

పోలీసు రైల్వే శాఖలో కనుక్కోగా—ఆ రోజుల్లో ఒక సన్యాసి శవాన్ని రైల్లోనించి ఖుస్రుపూర్‌లో దించినట్లు తెలిసింది. ఆ సన్యాసి పెట్టె అవీ అతనివే నని మఠంలో శిష్యులు గుర్తించారు.

ఇంకా ఎక్కువ సంగతులు తెలుసుకుందామని ఖుస్రుపూరు వెళ్ళాను. సన్యాసి శవాన్ని అక్కడ దింపారుట. అప్పుడు మయనావతి నివాసి రాఖాల్ భట్టాచార్య—



అంటే లీలావతి భర్త డ్యూటీలో వున్నట్టు తెలుసుకున్నాను. ఆ తర్వాత ఒకటి రెండు రోజులకే రాఖాల్ ఉద్యోగం వదులుకుని కాశీ వెళ్ళాడుట.

మయినావతి వెళ్ళాను. అక్కడ రాఖాల్ అన్న వున్నాడు. ఇప్పటివరకు రాఖాల్ సంగతు లేవీ అతనికి తెలియలేదుట. తమ్ముడు బతికివున్నాడో, లేదో కూడా అతనికి తెలియదుట.

ఇప్పుడంతా తెలిసిపోయింది. రాఖాలే చచ్చిపోయిన సన్యాసి కాగితాల్లోంచి అన్నీ సంగ్రహించి, భవేంద్రుడి రూపంలో బాఘురీపాడా చేరుకున్నాడు. అందుకే — నువ్వు రాసినట్టు ఆవేళ అతన్ని చూసి సురబాల ఉలిక్కిపడింది.

మరికొన్ని సంగతులు తెలుసుకోవాలి. అవికూడా తెలుసుకున్నాక బాఘులీపాడా వచ్చి దిగుతున్నాను.

*　　*　　*　　*　　*

వారంరోజులనించీ తెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఖర్‌ఖర్ మని దగ్గుతూ, కచేరీ పనులు చూసుకుంటూ, దివాన్‌జీ — బాబుగారి కోసం ఎదురు చూస్తున్నాడు.

అంతఃపురంలోకి ముమ్మారు కబురంపాడు. ఇదుగో వస్తున్నా, అదుగో వస్తున్నా అనటం తప్ప. బాబు ఇవతలికి ఊడిపడందే ! —" ఇంతటి స్త్రీలోలుడు ఆస్తిపాస్తుల నెలా కాపాడుకుంటాడో !— అజమాయిషీ లేకపోతే ఎక్కడి దక్కడ పాడై, అంతా ఒక కొలిక్కి వచ్చేలావుంది. ఇద్దరూ గువ్వపిట్టల్లా అంతఃపురంలో కూచుంటే, తక్కిన వ్యవహారా లన్నీ ఏంకాను ?— పైగా ఇతను వ్రతం చేస్తున్నాట్ట !— ఏం వ్రతమో, నా తలకాయవ్రతం. కుర్రవాడిప్పుడు భార్యావ్రతంలా ఉంది...

'ముమ్మారు కబురంపినా, ఎక్కడా మనిషి జాడాలేదు...హుం — ఇది పనికాదు, నీళ్ళలో పడితేగాని ఈత రాదు. నేను ఏదో సాకుతో కొన్నాళ్ళపాటు తప్పుకుంటే, ఆస్తిపాస్తుల భారమంతా నెత్తిన పడితే, అప్పుడుగాని బాబుకి చైతన్యం వచ్చేలా లేదు...'

దివాన్‌జీ విసిగిపోయాడు

రాత్రి పది దాటాక నౌకరు ముందు లాంతరుతో నడుస్తూవుండగా — గొడుగు వేసుకు బయలేరాడు రాఘల్. తనకోసం బెంచిమీద కాచుక్కూచున్న దివాన్‌ను చూసి, "బాబయ్యగారూ !— ఇంకా ఇంటికి వెళ్ళలేదూ ?—"

"లేదు బాబూ ! — అర్జెంటు పని ఒకటి వుంది. అందుకని..."

"ఓ — అవునవును, నాకోసం కబురంపారుకదూ ?"

"అవును. రెండు మూడుసార్లు..."

"అవునవును. ఆ సంగతే మరిచిపోయా నసలు. నన్ను మన్నించండి బాబయ్యగారూ ! — మీకు చాలా శ్రమ ఇచ్చాను."

"లేదుబాబూ ! — శ్రమ ఏముందీ ? —"

"చీకటిరాత్రి, వానా వంగుతూను, బురదలోపడి వెళ్ళారి మీరు. వెలుగుండగానే వెళ్ళలేకపోయారా ? — అంత అవసరమైన పని వుందేమిటి ? — సరే, అయితే పైకి పదండి."

"ఇవాళ పట్నంనుంచి పేష్కార్ మతిబాబు ఉత్తరం రాశారు. కలెక్టరుగారు ఎల్లుండి మీర్హాట్ రాధారి బంగళాలో దిగుతారుట. మూడురోజు లుంటా రక్కడ. కనక, బాగా మర్యాదలూ అవీ జరగాలి. జిల్లా అధికారి కదా ? —"

"కానుకలూ అవీ ఇవ్వాలా ? —"

"కానుక లెలాగూ ఇవ్వాలి. వాటన్నిటికీ అన్నీ ఏర్పాటు చేశాను. మీర్హాట్‌లో మన కచేరీ లేదు. భద్రకాళిలో వుంది. రెండంతస్తులమేడ— చిన్నప్పుడు మీరు

నాన్నగారితో రెండు మూడుసార్లు వెళ్ళారు. మన గుమాస్తాకి ఫర్మానా పంపాను. అతనే అన్నీ సరఫరా చేస్తాడు. అయితే, గుమాస్తాకి బాధ్యత అంతా అప్పజెప్పి నిశ్చింతగా కూచోటం మంచిదికాదు...''

"పోనీ, మీరు వెళ్ళేసరి."

"నేను వెళ్ళగలను గాని, మీరు వెళ్ళటమే మంచిది బాబూ! –"

''ఇప్పు డెలా వెళ్ళటం? –"

"చిన్నరాణీగారు క్రమంగా ఆరోగ్యం పొందుతున్నారు. ఇలాంటి సామాన్య జ్వరాల్ని వైద్యుడు రెండు మూడు రోజుల్లో నయం చేసేస్తాడు. మరేం భయంలేదు. నేనూ వుంటానుగా? – ఎప్పటికప్పుడు కనుక్కుంటాను. మీరు వెళ్ళకపోతే బాగుండదు. మీరు వచ్చినప్పట్నించీ కలెక్టరును కలుసుకోనే లేదు. ఇప్పుడయినా వెళ్ళకపోతే ఏమేనా అనుకుంటారు."

"నేను వెళ్ళి ఏం చెయ్యాలి?"

''మీరు పల్లకీలో వెళ్ళండి. వెళ్ళి, దొరగారిదగ్గిరికి మీ కారు పంపించండి. రమ్మని కబురు రాగానే వెళ్ళి షేక్‌హాండ్ ఇచ్చి కుశలప్రశ్నలు వెయ్యండి."

"బెంగాలీలోనా? –"

"అహఁ హఁ – ఇంగ్లీషులోనే మాటాడండి. ఒకటి రెండుసార్లు యువర్ ఆనర్ అనీ, సర్ అనీ అనండి, చాలు. 'దొరగారికోసం కోహ్నూ. గుఫ్తా అనీ ముందుగానే పంపుకున్నాను. హుజూరు ఈ చిన్నికానుక స్వీకరిస్తే కృతార్థుణ్ణి.' అని సైగ చెయ్యండి మన మనిషి ఆ బహుమతి దొరగారిముందు పెడతాడు.''

"అబ్బా! – చాలా తతంగం వుందే? –"

"ఏం చేస్తాం బాబూ! – దొరలంటే కలియుగదేవతలు.''

"వాళ్ళకి పూజ చేశాక, తిరిగి నే నిక్కడికి వచ్చేసెయ్యవచ్చునా? –"

"అహఁ – బాగుండదు. ఆయన మూడు రోజు లుంటారు. రోజూ పొద్దున్నే వెళ్ళి, ఓసారి దర్శనం చేసుకోవటం ముఖ్యం..."

గత్యంతరం లేక సమ్మతించాడు రాఘవ్.

* * * *

"ఎలావుంది ఇందూ? – జ్వరం తగ్గిందా? –"

"ఏమో నా కేం తెలుస్తుంది? – శరీరానికి తెలియాలి."

ఆమె అభిప్రాయం గ్రహించాడు రాఘవ్.

"నా దురదృష్టం నువ్వెరుగుదువుగా ఇందూ? –"

"అహ, - ఊరికే అన్నాను. మీ రేం కోపం తెచ్చుకోకండి. నా వంట్లో ఇప్పుడు కులాసాగానే వుంది. జ్వరం లేదు."

"ఇంతవరకూ చేసిన వ్రతాలూ అవీ చాలు. ఈ వ్రతాన్ని ఇక్కడితో ముగిద్దామా అనుకుంటున్నా."

"అహ, - అలా ఎన్నటికీ జరగటానికి వీల్లేదు. మిమ్మల్ని నేను అధర్మ పథానికి ఎన్నటికీ లాగను. ఒకటి గనుక జరిగితే, నేను స్వార్థంతో ఒకపని చెయ్యవచ్చు. అప్పుడు మీకు వ్రత భంగం తప్పదు."

"ఏమి టది ఇందూ ? -"

"మీ వ్రతం పూర్తి అవటానికి ముందే, నాకు ఆఖరి గడియలు రావటం తట స్థిస్తే..."

"ఇందూ !- ఏమి టా మాటలు ?- అలాంటి అమంగళాన్ని తలపెట్టకు తప్పు."

"అమంగళ మేముంది ? - ఆడదానికి అంతకంటె మంగళప్రదమైన దేముంది?- అటువంటి రోజేకనక వస్తే - చచ్చిపోయేముందు నా తలను మీ ఒళ్ళో పెట్టుకోక మానను. అప్పు డింక మీ వ్రతాన్ని పాటించేది లేదు." ఇందుమతి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"అవునూ - మన ఎస్టేటులోకి కలెక్టరుగారు వచ్చారుట. ఏ వూరికి వచ్చారూ?" అంటూ ప్రసంగం మార్చింది ఇందుమతి.

"ఆం- మీర్జాహాట్ కి వచ్చారుట."

"ఎంతదూరం ? -"

"భద్రకాళి దగ్గర."

"చాలా దూరమే - ఏర్పా టన్నీ జరిగాయా ? - "

"ఆ - అన్నీ జరిగాయట. కానీ, నాకే చిక్కు వచ్చింది."

"ఏం?... ఏం చిక్కు వచ్చింది ? - "

"నీ వంట్లో బాగుండలేదా ? - ఇటువంటి పరిస్థితిలో నిన్ను వదిలి, మూడు రోజులు అక్కడికి వెళ్ళి ఎలా వుండేది ? - "

"మూడు రోజులకే ఇలా బాధపడుతున్నారు. పదహారేళ్ళు ఎలా వుండగలిగారూ ?... ఏం, కోపం వచ్చిందా ? పాపిష్ఠిదాన్ని. ఎందుకో ఇవాళ అన్నీ మీకు కష్టమైన మాటలే అంటున్నా. నన్ను క్షమించండి. ఏమండీ, మీ మనసు బాధపడకపోతే మరెవరిదగ్గర అభిమానం తెచ్చుకోను; చెప్పండీ ? - "

రాఘవ్ ముఖకవళికలు చూసింది. మళ్ళీ ప్రసంగం మార్చివేసింది ఇందుమతి.

"ఏమండీ, భద్రకాళిలో మహత్తు గల కాళికాదేవి వుంది, మీకు తెలుసా ? —"

"ఏం, అంత మహత్తు గలదా ? — "

"అవును. అందరూ చెప్పుకుంటారు."

"అయితే — నీకు వెంటనే ఆరోగ్యం చిక్కితే అమ్మవారి పూజ చేయిస్తానని మొక్కుకుంటా."

"అదికాదు; కులాసా చిక్కితే, ఇద్దరమూ వచ్చి పూజ చేయిస్తామని మొక్కుకోండి. అమ్మవారి ప్రసాదం, కుంకుమ నాక్కాస్త తెచ్చిపెట్టండి "

"తప్పకుండా తెస్తా."

* * * *

హుజూర్, సెలవైతే, మేమేదేనా ఇంత తిని, నీళ్ళు తాగి, కాస్త అలసట తీర్చుకు వస్తాం'' అన్నారు పల్లకీ బోయీలు.

"సరే — కానివ్వండి. ఇదేవూరూ ? — " అడిగాడు రాఘాల్.

"బేడాగ్రామం, హుజూర్ ! — మాగంజిసింగి దొరవార్లది. ఇక్కడ సాయెబు లెక్కువ, హిందువులు తక్కువ."

బోయీలు వెళ్లారు.

రాఘాల్ పల్లకీ దిగి, అలా అలా నడుస్తూ, అటు ఇటు చూసుకుంటూ, ఊళ్ళోకి వెళ్లాడు.

ఒకచోట పెద్ద గుంపు. ఏదో దెబ్బలాట. రాఘాల్ అక్కడికి వెళ్లాడు.

"నా ప్రాణాలు పోయినా సరే, ఈ మేకపిల్ల నివ్వను" అంటున్నా డొక సాయెబు.

"ఇవ్వవూ ? – ఏమనుకుంటున్నావో. ఇది జమీందారుగారి హుకుం !– "

"జమీందా రయితే కానీ, జమీందారుకి నే నేం శిస్తుబకాయి లేను. నా మేకని నే నెందు కివ్వాలి ? – "

రాఘాల్ గుంపులోనించి ముందుకు వచ్చాడు

"ఏమిటీ గొడవ ? – " అని అడిగాడు.

"సలాం, బాబూ ! – మీరు హిందూ సాధువులు. మీరు చెప్పండి. ఈ మేకను నా ప్రాణంకంటె ఎక్కువగా పెంచుకుంటున్నాను. నే తినటం మాని, దానికి పెడుతుంటాను. ఇది నా చేతుల్లోనే పెరిగి పెద్దదయింది ఇప్పు డీ మేకను నే నెందు కివ్వాలి ?– దీన్ని తీసుకుపోయి, కోసుకుతింటారు, బాబయ్యా. నన్నూ, నా మేకనూ రచ్చించండీ," అన్నాడు సాయెబు.

"వీడి మొండితనం చూడండి బాబూ ! – రేపు జమీందారుగారింట్లో విందు. కలకత్తానించి గొప్పగొప్పవా ళ్ళంతా వస్తున్నారు ఈ మేక నివ్వడుట ఇవ్వవూ ? ఇవ్వవూ ? – ఇస్తావా, మర్యాదగా ఇయ్య లేకపోతే, చెప్పుతీసుకు పళ్ళు రాలగొడతా" అంటూ మేకకు కట్టిన తాడు గుంజాడు మేకపిల్ల కుయ్యో మొర్రో మంటూ కింద పడి అరిచింది.

"ఎవడివిరా నువ్వు ? – " కోపంగా అడిగాడు రాఘాల్

"ఆ–దిగాడు దొర, మాలావు సాధువు. నేను సింహాదొరల సిపాయిని. ఎవర్ని లెఖ్ఖచెయ్యబోవయ్యా నువూ..." అంటూ వెటకారం చేశాడు సిపాయి.

"నోర్ముయ్ !– అతని సొత్తు అత నిష్టం. అత నివ్వనంటూంటే నువ్వెలా జబర్దస్తీ చేస్తావ్ !– నీ కేమేనా బుద్ధి వుందా, లేదా ?" అని కేకవేశాడు.

అప్పటిదాకా వెనక్కి నక్కివున్న ముసల్మానులు ముందుకు వచ్చారు.

"హబీబ్ భాయ్ !– ఇవ్వొద్దు. నీ మేకని నువ్వెందు కివ్వాలి ?–"

"ఏమిటీ జులుమ్ ?– మన మింతమందిమి వుండగా, ఈ కుర్రసిపాయి మేక నెలా లాక్కెడతాడో చూదాం."

నలుగురూ నాలుగు మాట లన్నారు.

సిపాయి తగ్గిపోయాడు. ''నే నేం వూరికే అడగటంలేదు. దానిఖరీదెంతో సుకో, ఇస్తా.''

''నీ డబ్బు నువ్వే వుంచుకో. నాకు ప్రాణప్రదమైనదాని ప్రాణాన్ని ఎందుకు యనిస్తాను ?- నా ప్రాణం పోయినా మేక నివ్వను" అన్నాడు హబిబుల్లా.

''ఓయి సిపాయీ !- నువ్వు క్షేమంగా వెళ్ళా లనుకుంటే మెల్లిగా ఇక్కడినించి రుకో. మీ యజమానికి మాంసం తినాలనుంటే, అమ్ముకునే వాళ్ళదగ్గర కొనుక్కో. ంతేగాని, పేదవాళ్ళమీద జులుమ్ చెయ్యకు.'' అన్నాడు రాఖాల్.

''సరే, వుండండి - జమీందారుకే అవమానం చేశారుగా ? కానీండి : చూపిస్తాం డాఖా.'' అంటూ ధుమధుమలాడుతూ వెళ్ళిపోయాడు సిపాయి.

"ఇదుగో - మీ జమీందారు మీ మీద అత్యాచారాలు చేస్తున్నట్టయితే రేపు కలెక్టరు రి దేరా పడబోతూంది. మీర్జాహాట్‌లో ఆయన మూడురోజులు మకాం చేస్తారు. యన దగ్గరి కెళ్ళి మీ బాధలు చెప్పుకోండి'' అంటూ రాఖాల్ వెళ్లిపోయాడు.

* * *

"నాకు ప్రాణప్రదమైనదాని ప్రాణాన్ని ఎందుకు తియ్యనిస్తాను ?-" అన్న సాహెబు మాటే రాఖార్ చెవుల్లో మారుమోగుతున్నది. అతని హృదయంలో చొచ్చుకు పోయిం దా మాట. అతని శరీరంలో అణువణువునా ప్రసరించిం దా మాట......

......అతని కళ్ళలోంచి కన్నీళ్ళు తొణికిసలాడాయి......

ఇందుమతిని గురించే అతని ఆలోచన.

"చదువు సంధ్యలు లేని అ సాయెబుకి వున్నంత జ్ఞానమైనా నాకు లేదు. తనకి ప్రాణమైనదాని కంఠాన్ని నులమటానికి ఒకడు సిద్ధమయితే - సాయెబు తన ప్రాణాలు ప్పగించాడు. హుం - కాని, నేను......?

......నేను......ప్రేమిస్తున్నవారి కంఠంలోనే కత్తితో పొడవటానికి సిద్ధ డుతున్నాను...ఏమి టీ జన్మ ?- ఎందు కీ జన్మ ?-''

రాఖాల్ ఆలోచన ఎంతకీ తెమలటంలేదు.

* * *

"నాయనా !- నీ ముఖం అలా వుందేం, నాయనా ?- వంట్లో ఎలా వుందీ ?-" డిగింది పెద్దరాణి.

''ప్రయాణపు బడలికవల్లనేమోనమ్మా" అని చెప్పి తప్పుకున్నాడు రాఖాల్.

"అలా వున్నారేం ?- కళ్ళూ, ముఖమూ పీక్కుపోయినట్టున్నాయేం ?-" అడిగింది ందుమ.

"అబ్బే. ఏం లేదే ?–"

"భద్రకాళి దర్శనం చేసుకున్నారా ?–"

"లేదు" అని, ఒక్కటేమాట సమాధాన మిచ్చాడు రాఘాల్. ఇందుమతి ఆశ్చర్యపోయింది.

జరిగిం దేమిటో ఆమె కేమీ బోధపడలేదు.

రాఘాల్ అక్కడ ఎక్కువసేపు వుండలే

* * *

"బాబూ !– నా కొక నెల్లాళ్ళు సెలవిప్పించాలి" అడిగాడు దివాన్

"ఎందుకు బాబయ్యగారూ !–"

"నా ఆరోగ్యం ఏమీ బాగుండటేదు. కొంతకాలం డార్జిలింగ్‌లో ఉండివస్తా."

"మీ ఆరోగ్యానికి అవసరమని తోస్తే, సరే, అలాగే వెళ్ళిరండి."

"అయితే– ఇక్కడ పనులూ అవీ నువ్వు కాస్త జాగర్తగా చూసుకోవాలి బాబూ !– మన మేనేజరు చాలా అనుభవం ఉన్నవాడే. అయినా, నీ ఆస్తి నువ్వు స్వయంగా చూసుకోకపోతే తీన్‌తేరా అయిపోతుంది.'

మరి కాస్సేపు మాటాడి, దివాన్‌జీ సెలవుతీసుకు వెళ్ళిపోయాడు

* * *

"అదేం నాయనా, ఏమీ తిననేలేదూ ?–" అడిగింది పెదరాణి.

"అట్టే ఆకలిగా లేదమ్మా "

"ఒంట్లో ఎలా వుంది ?–"

"బాగానే వుంది."

"కాదు నాయనా ! నా దగ్గిర దాచకు. నీ వంటో బాగుండలేదు. వైద్యుడికోసం కబురంపనా ?–"

"అహాఁ – వైద్యుడక్కర్లేదమ్మా !– దానంతటదే సర్దుకుంటుంటుంది," అంటూ చెయి కడుక్కున్నాడు.

పడుకుందుకి వెళ్ళేముందు, రోజులాగా ఇందుమతిని చూడటానికి వెళ్ళలేదు. తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు రాఘాల్

హుక్కా తీసుకువచ్చిన నౌకరు చాలాసేపు, తలుపు తీస్తాడేమో నని చూసి, వెళ్ళిపోయాడు.

* * *

రెండురోజులు గడిచాయి.



దివాన్‌జీ డార్జిలింగ్ వెళ్ళాడు.

ఇందుమతి పథ్యం తిన్నది

రాఖాల్ మనస్సుకిమాత్రం ఇంకా స్వస్థత చిక్కలేదు

సాయంత్రం నాలు గయింది.

రాఖాల్ అంతఃపురానికి వెళ్ళాడు.

"పద – కాస్సేపు తోటలో తిరిగివద్దాం."

"ఏం, అలా వున్నారు ?–" శంకిస్తూ అడిగింది ఇందుమతి.

"ఏం, బాగానే వున్నానే ?–"

"అహఁ – మీ కంఠస్వరం బరువుగా వుంది మీ కళ్ళు ఉబ్బివున్నాయి "

"తోటల్లోకి రా, అక్కడ చెబుతా."

*　　*　　*

తోటలో –

రాఖాల్ ఏదో చెబుదా మనుకున్నాడు. కాని, చెప్పలేకపోతున్నాడు. బ్రహ్మ ప్రయత్నం చేశాడు. అతనివల్ల కాలే.

"నామాట ఒకటి చెల్లిస్తారా ?–" అడిగింది ఇందుమతి.

"ఏమి టది ?-

"మీకు మనస్సూ, ఆరోగ్యమూ కూడా బాగుండడంలేదు. పదహారేళ్ళు ఎక్కడెక్కడో తిరిగి, హఠాత్తుగా రావటంవల్ల ఈ వాతావరణం మీకు సరిపడినట్టులేదు. మీ మనస్సు ప్రశాంతంగాలేదు. మనం కొన్నాళ్లపాటు పశ్చిమప్రాంతానికి వెళ్ళివద్దాం. అత్తగారుకూడా తీర్థయాత్రలు చేసుకురావా లంటున్నారు. నెలా నెలాపదిహేనురోజులు అలా తిరిగివద్దాం, ఏమంటారూ ?"

"ఆఁ ? -" అని ఉలిక్కిపడ్డాడు, ఏదో ఆలోచనలో వున్న రాఖాల్.

"ఏమంటారూ ? - వెడదామా ? -"

''ఎక్కడికీ ? -''

"నే నింత సేపూ చెప్పింది వినలేదా ? -

''నేను వేరేసంగతి ఆలోచిస్తున్నా; ఏం చెప్పావ్ ? -"

ఇందుమతి మళ్ళీ చెప్పింది.

అంతా విని, ''సరే చూదాం" అని పూరుకున్నాడు రాఖాల్.

ఇంకా రాఖాల్ ఆలోచన తెగలేదు.

*　　　*　　　*　　　*

టంగ్‌మని గడియారం ఒకటి కొట్టింది.

బయట ఏదో అడుగుల సవ్వడి వినిపించింది.

అది ఆమెకు పరిచిత మయినదే !

ఇందుమతి పమిటా అదీ సర్దుకుని, లేచి నించుంది.

రాఖాల్ లోపలికి వచ్చాడు.

"ఇవాళ నే నింత సేపటికి జ్ఞాపకం వచ్చానా ? -" అంటూ కాస్త ఎత్తిపొడిచింది.

రాఖాల్ ఏమీ మాటాడలేదు. తల వంచుకున్నాడు.

"కూర్చోండి "

"ఉహుఁ - " అంటూ, అంగరఖాలోకి చెయి పోనిచ్చాడు.

వణుకుతున్న చేతులతో ఏదో ఉత్తరం తీసి ఇచ్చాడు.

"ఎవరిదీ ఉత్తరం ? -"

"నీది."

"ఎవరు రాశారు ? -"

"తీసి చూడూ -" అంటూ, తాగినవాడిలా తూలుతూ, బయటికి వెళ్ళిపోయాడు రాఖాల్

ఆమె ముఖం చిన్నబోయింది.

కాళ్ళూ చేతులూ వణకసాగాయి.

కవరు చించింది.

ఉత్తరం తీసింది...

* * * *

"నిన్ను ఏమని సంబోధించాలో తెలీటంలేదు. నా జీవితంలో నువ్వు ఏకైక సుఖానివి, ఏకైక ఆనందానివి. కానీ, దైవవంచన మూలంగా నిన్ను నేను వంచించినవాడి నయ్యాను.

నేనేమంత చదువుకోలేదు. నా మనస్సులో దంతా పూసగుచ్చినట్టు చెప్పగల సత్తా లేదు నాకు.

పుట్టినప్పటినుంచీ నేను దుఃఖజీవిని. ఇన్నాళ్ళకి భగవంతుడు నాకు సుఖాన్ని చవిచూపబోతున్నాడు కదా అని ఆశపడ్డాను. కాని, అదృష్టాన్ని ఎవరమూ చూస్తూ చూస్తూ వదులుకోలేము.

నేను వట్టి దుర్మార్గుణ్ని, అసమర్థుణ్ని. నీపట్ల నే చేసిన అపరాధానికి క్షమాపణ అనేదిలేదు. పతివ్రత అయిన ఏ హైందవస్త్రీ కూడా నన్ను క్షమించలేదు. నీ క్షమకు నేను అనర్హుణ్ని.

నిన్ను ప్రేమించటంవల్ల సంపాదించిన జ్ఞానంవల్ల ఈ ఉత్తరం రాస్తున్నాను.

నిన్ను చూడనిక్రితం నాకు జీవితంలో ప్రేమఅంటే ఏమిటో తెలియదు. నిన్ను ప్రేమించాను కనుక మోసం చేయలేను. నన్ను పూర్తిగా నమ్మిన నీ గొంతుకను నులిమివేసేటంత అధముణ్ని కాను నేను.

ఇక – అసలుసంగతి విను

నేను భవేంద్రుణ్ని కాను. నీ భర్తను కాను; నీ భర్త పరలోకవాసి. ఆస్తిమీద ఆశతో నేను భవేంద్రుడివేషం వేసుకుని......"

...అంతే – మరి చదవలేకపోయింది ఇందుమతి. ఆమెకు కళ్ళు చీకట్లు కమ్మాయి; స్పృహ తప్పింది సోఫాలోంచి అమట్టునే చాపకట్టుగా కింద పడి పోయింది.

కొద్దిక్షణాలు గడిచాయి.

కనకలత ఆ గదిలోకి వచ్చింది

ఆశ్చర్యపోయింది

అటు ఇందుమతి ! – ఇటు ఉత్తరం ! !

గబుక్కున ఉత్తరం తీసి, అక్కడక్కడ చదివింది. సంగతి గ్రహించింది. దాన్ని రవికలో దాచేసి, నలుగుర్నీ కేకవేసింది.

* * * *

కనకలత తన గదిలోకి పోయి, తలుపు వేసేసుకుంది.

జాకెట్‌లో దాచుకున్న ఉత్తరం తీసి చదివింది.

ఉత్తరంలో చివర ఇలా రాసివుంది :

* * * * *

"నేను వేసుకువచ్చిన ఎత్తు పూర్తిగా ఫలించినట్టే. మాయావి నని ఎవరూ నన్ను గుర్తించలేకపోయారు. ఈ ఐశ్వర్యాన్నంతటినీ ఏ అడ్డూ లేకుండా నే ననుభవించ గలను.

అయితే — మనుష్యుల మనఃప్రవృత్తిని ప్రేమ ఎలా మార్చి వేసేదీ ఇదివరకు తెలియదు. ఇప్పుడు తెలుసుకున్నాను.

నీపట్ల నే చేసిన అపరాధాలకు క్షమాపణ చెప్పుకుని, శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నాను.

నీ జీవితం — ధర్మమార్గంలో సుఖంగా, ఖులాసాగా ఉండేలా చెయ్యమని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను.

నీ దగ్గిర దాపరికం లేకుండా అన్ని విషయాలూ వెల్లడించాను.

ఇక — పెదరాణిగారితో కూడా చెప్పి క్షమాపణ కోరుకుని వెళ్ళటం భావ్యంగా వుంటుంది. అయితే — అందువల్ల ఇదంతా గొడవ గొడవయిపోతుందేమో ! — లోకం నీకు కళంకం అంటగడుతుందే ! — ఈ సంగతి క్రమక్రమంగా ఊరూరా, వాడవాడలా, దేశదేశాలా పాకిపోతుందే ! ! —

ఏదో — చేసిన ఘోరం ఏదో చేశాను. ఇంతకంటె ఎక్కువ చెయ్యలేను. నా సంగతి నీ మనసునించి తుడిచివెయ్యి. ఈ దుర్మార్గుడింక భూమిమీద ఉండడు.

ఇట్లు
రాఘాల్ భట్టాచార్య

తా. క:—

ఈ కొద్దికాలంలో నన్ను గురించి నీ మనఃప్రవృత్తి ఎలా మారిందో నాకు తెలియదు. నేను నిన్ను ప్రేమించినట్టే నువ్వూ నన్ను ప్రేమించినట్టయితే, వితంతు వివాహానికి నువ్వు సమ్మతించేట్టయితే, శాస్త్రీయంగా మనం వివాహం జేసేసు

కుందాం. నీకు అంగీకారం కాకపోతే, ఆ సంగతి తెలియగానే నే నిక్కడినుంచి శాశ్వతంగా వెళ్ళిపోతాను.

నా అపరాధా లన్నీ క్షమించు. ఇదే నా కడపటి ప్రార్థన.

ఇట్లు
రాఖాల్ భట్టాచార్య

* * * * *

ఈ ఉత్తరం చదివి, కనకలత ఇలా అనుకుంది: "ఇంకా నయం, ఈ ఉత్తరం అదృష్టవశాత్తు నా చేతిలో పండింది కనక సరిపోయింది. మరెవరి చేతిలో నయినా కనక పడివుంటే ఈ పాటికి గోంగోల అయిపోయి వుండేది. రాఖాల్ వెళ్ళిపోవటం మంచిదే. భవేంద్రుడికి ఇంటో మనసు నిలవలేదు. అందుకని వెళ్ళిపోయా డనుకుం టారు లోకులు. అంతే...

"అతను మనిషి అయివుండడు. ఏ దేవుడో! – అతని పాదధూళి నా శిరస్సున ధరించా లనిపిస్తూంది..."

* * * * *

రాత్రి పది దాటింది.

గదిలో రాఖాల్ తలుపులు వేసుకూర్చున్నాడు.

ఏమీ తోచటంలే దతనికి
నిద్ర పట్టలే.
ఆపసోపాలు పడుతున్నాడు.
ఉన్నట్టుండి తలుపు తట్టిన చప్పుడు.
ఉలిక్కిపడ్డాడు రాఖాల్
"ఎవరూ – ?"
"............"
వణుకుతున్న చేతులతో తలుపులు తీశాడు.
ఒక యువతి – వితంతు లోపలికి వచ్చింది. తలుపులు వేసింది
"నువ్వ — ఎవరు మీరూ?–" అడిగాడు రాఖాల్.
"కనకలతని..."
"ఏమిటి సంగతులు ?— చినరాణికి ఎలా వుంది ?—"
"ఏం బాగా లేదు. వైద్యుడు ఆశ వదులుకున్నాడు రాత్రి గడవటం సందేహమే"
ఈ మాట వినగానే రాఖాల్ తల పట్టుకు కూచున్నాడు "చినరాణి మిమ్మల్ని నా దగ్గరికి పంపిందా ?—"
"ఉహుం!– ఆమె కసలు స్పృహే లేదు మీరు ఉత్తరం ఇచ్చివెళ్ళినప్పటినించీ అలాగే వుంది. ఒకటి రెండు సార్లుమాత్రం క్షణం, క్షణంసేపు తెలివొచ్చింది."
రాఖాల్ ఏమిటో ఆలోచించసాగాడు.
"రాఖాల్ బాబుగారూ!– మీ రివాళ చినరాణిగారి కిచ్చిన ఉత్తరం అదృష్టవశాత్తూ ముందుగా నా చేతిలోనే పడింది. నేను దాచేశాను." అన్నది కనకలత.
ఆశ్చర్యపోయాడు రాఖాల్.
"మీ రెందుకు దాచారు ?–"
"ఆ వుత్తరం మరొకరి చేతిలో పడితే, ఇం కేమేనా వుందా?– పోలీసులు వచ్చి సర్వనాశనం చెయ్యరూ ?– మిమ్మల్ని సంకెళ్ళు వేసి తీసుకువెళ్ళరూ ?–"
"దాన్నిగురించి మీ కెందుకూ బాధ ?–"
"హృదయం వున్నప్పుడు బాధ కలగకుండా వుంటుందా ? నా మనస్సు రాయి కాదు,...మీరు మాటిమాటికీ నన్ను 'మీరు మీ' రని ఎందుకు మన్నిస్తారు ?– నా కేమిటో సిగ్గుగావుంది. నేను తమకు దాసీనిమాత్రమే."
"నీ ఉద్దేశం ఏమిటి ?–" అడిగాడు, రాఖాల్.

కనకలత అతన్ని క్రీగంట చూసి, సిగ్గుతో భయపడుడూ, "ఈ దాసికి తమ పాదసన్నిధిని – అనంత – ఆశ్రయం – లభిస్తుందని వచ్చాను."

రాఖాల్ అసహ్యించుకున్నాడు.

"చూడండీ !– చినరాణికి రాసిపెట్టినట్టు జరిగింది. తెల్లవారేలోగా అంతా అయిపోవచ్చు. ఇంతడబ్బూ ఎవరికి అందినది వాళ్ళు ఎగరేసుకుపోతారు. దీన్నంతటినీ మీరే ఎందుకు అనుభవించకూడదూ ? వితంతువివాహం మీకు అభ్యంతరం లేదుగా?– నేనూ బ్రాహ్మణ యువతినే. నా తలితండ్రులూ కులీనులే. మీరు వచ్చిన ఈ భవేంద్ర వేషంలోనే ఇకముందుకూడా ఉండవచ్చు ఎవరూ తెలుసుకోలేరు మనం ఉభయులం రాజవైభనం అనుభవించవచ్చు. చెప్పండి ఈ దాసికి తమ పాదసన్నిధిని ఆశ్రయ మిస్తారా ?–"

రాఖాల్ పళ్ళు పటపట కొరికాడు. కళ్ళు ఎర్రపడ్డాయి.

"నిన్ను వెల్లికిలా పడేసి, కాళ్ళురెండూ నీ కంఠంమీద పెట్టి, తొక్కి వేయా లని పిస్తూంది. ఒక స్త్రీని ఎలాగూ హత్య చేశాను రెండో హత్యకూడా చెయ్యమని నా మనస్సు లాగుతూంది."

కనకలత లేచి నిలబడింది.

ఆమె భావభంగిమ అంతా మారిపోయింది.

"రాఖాల్‌బాబూ !– నువ్వు అలా నన్ను హత్యచేసిననాడు నా జన్మ తరిస్తుంది. కాని అదంతా జరిగేపనికాదు. మీదంతా పట్టికవిత్వం. ఏదీ, మీ పాదధూళి కాస్త నా శిరస్సున ధరించనివ్వండి," అంటూ చటుక్కున అతని పాదాలు ముట్టుకుంది

రాఖాల్ తెల్లబోయాడు.

"మీ ఉత్తరం చదివినప్పటినించీ మీ పాదధూళి శిరస్సున ధరించాలని తహతహలాడిపోయాను. మనుషులలో ఇంకా ఇంత మంచివాళ్ళూ, త్యాగులూ ఉన్నారని నే నెన్నడూ అనుకోలేదు నేను మీకు నా ప్రేమను వెల్లడించాలని రాలేదు, రాఖాల్‌బాబూ !– నా భక్తిని వెల్లడించుకోవటానికే వచ్చాను. మీ ముందు కూడా కాస్త నా అభినయం చూపుదామన్న ఉద్దేశంతో ఇలా కొంటెతనం చేశాను.

"నేను నియమ నిష్ఠలు గల వితంతువునీ కాదు, గితంతువునీకాదు. నే నొక నటిని రంగులు పులుముకుని, రంగస్థలంమీద నిలబడి, ప్రేమగీతాలుపాడిపాడి, నాముఖంలో రక్తం ఎండిపోయింది. నే నెవరినయిందీ ఇక్కడివాళ్ళ కెవరికీ తెలీదు. ఇవాళ మీకుమాత్రం తెలిసింది. మీరు ఎలా వేషంలో వచ్చారో, నేనూ అలాగే వచ్చాను.

"నే నిక్కడికి ఇలా ఎందుకు వచ్చానో, చాలా కథ వుంది. మరొకప్పుడు చెబుతాను నే నిక్కడికి రావటం ఒకవిధంగా అదృష్టమనే చెప్పుకోవాలి లేకపోతే, ప్రపంచంలో మీలాంటివ్యక్తి ఒక రున్నారని ఎలా తెలుస్తుంది చెప్పండి ఇక్కడ నేను ఎక్కువరోజు లుండను. నేను ఉండే ఈ కొద్ది రోజుల్లోనూ మీ కేదేనా ఉపకారం చేసి మరీ వెళతాను. మీ రిప్పు డేం చెయ్యదలచుకున్నా రిహ ? —"

"నే నిక్కడినుంచి వెళ్ళిపోతాను. ఎక్కడికో ఇంకా నిర్ణయించుకోలేదు."

"అయితే – రాఖాల్‌బాబూ ! — నా కోరిక ఒకటి చెల్లిస్తారా ? —"

"ఏమిటీ ? —"

"మీరు వెళ్ళేముందు ఒక్కసారి నన్ను కలుసుకువెళ్ళండి."

"ఎందుకు ? —"

"చాలా ముఖ్యమైన కారణ ముంది. అదేమిటో అప్పుడే చెబుతాను. ఒకవేళ మీరు నన్ను కలుసుకోకుండా వెళ్ళారంటే మీకు తెలియకుండానే అమాయకులు మరొకర్ని సర్వనాశనం చేసినవా రవుతారు."

"మీ మాటల్లో నిగూఢరహస్య మేమిటో నాకు అంతుపట్టటంలేదు."

* * * *

"నమస్కారాలు బాబుగారూ !—"

"నమస్కారాలు. ఏమిటి, హఠాత్తుగా వచ్చారు · ఎక్కడ్నించి?–

"కలకత్తానుంచే. మీతో అత్యవసరమైన పని వుంది."

"పని వుందా ?— సరే, అయితే స్నానం అవీ ముగించుకుని, ఫలహారం చెయ్యండి. తరవాత చూసుకోవచ్చు."

"అహఁ– అలాకాదు. చాలా అర్జంటు పని."

"సరే ఉండండి నాకు కాస్త తీరిక చిక్కగానే మీకు కబురు పంపుతాను." అంటూ రాఖాల్ మెట్లెక్కి పైకి వెళ్ళిపోయాడు.

ఖగేంద్రుడు అక్కడే కూచుండిపోయాడు,

అరగంట దాటింది. కబురు లేదు.

ఖగేంద్రుడు విసుక్కున్నాడు, కసుక్కున్నాడు.

చివాల్న లేచి, బూట్లు టక్‌టక్‌మని చప్పుడు చేసుకుంటూ మెట్లెక్కి పైకి వెళ్లాడు.

* * * * *

ఈజీఛైర్‌లో పడుకుని ఏదో ఆలోచించుకుంటున్నాడు రాఖాల్.

హఠాత్తుగా బూట్ల చప్పుడు.

గుమ్మం కేసి చూశాడు రాఖాల్.

"బొత్తిగా తీరికలేకుండా వున్నారల్లేవుందే" అని వ్యంగ్యంగా అంటూ, తనూ ఒక కుర్చీ లాక్కు కూర్చున్నాడు ఖగేంద్రుడు.

"ఏం కావాలి మీకు ?—"

"నాకు డబ్బు కావాలి."

"అయితే నా దగ్గర కెందుకు రావటం ? — మీ చెల్లెలి జీతం తాలూకు ఏదైనా రావలసివుంటే, వెళ్ళి ఆమె నడగండి. దివాన్‌గారు లేరు. మేనేజరు లెక్క చూసి ఇస్తాడు."

"చిత్తం, అది కాదు. చెల్లెలి జీతం కాదు. మీ దగ్గర్నుంచే కొంత ఆశిస్తున్నాను. ఎక్కువ అక్కర్లేదు. ప్రస్తుతం ఒక లక్ష. ఆ తరవాత నెలనెలా బెంగాల్‌బ్యాంకి మీద రెండువేల రూపాయలకు ఒక చెక్కు అయితే చాలు..."

"తాగి ఏమైనా వచ్చారా ?—"

"తాగేవాడినే. కాని ఇప్పుడు మాత్రం తాగి రాలేదు. బాగా తెలివిగా ఉండే వచ్చాను.

"నేను మీకు డబ్బు ఎందు కివ్వాలి ?—"

ఖగేంద్రుడు నవ్వాడు. "నేను మీకు సోదరుణ్ణవుతాను. అంటే — దొంగకి దొంగ ఏమవుతాడో అలాంటిది మన సంబంధం. ఇంత ఆస్తినీ ఒక్కరే కాజేస్తారా ? — ఈ వేలు విడిచిన సోదరుడికికూడా కొంత వాటా ఇవ్వండి. ఇంతకీ అసలు సంగతి తెలుసా ?—"

"ఏమిటది ? —"

"మీరు భవేంద్ర చటర్జీ కాదు — రాఖాల్ భట్టాచార్య. ఖుస్రుపూర్‌లో టిక్‌టిక్ మని టెలిగ్రాంలు కొడుతూ, చక్‌చక్ మని టికెట్లు అమ్ముతూ, పాతబూట్లు వేసుకుని ప్లాట్‌ఫాంమీద తిరిగే రాఖాల్ భట్టాచార్య మీరు ఇప్పటికయినా తెలిసిందా. ఇంకా టీకా—టిప్పణీ కావాలా ?—"

"ఈ సంగతు లన్నీ మీ రెలా తెలుసుకున్నారూ ?—"

"బోలెడంత శ్రమపడి, బోలెడంత డబ్బు ఖర్చుపెట్టి."

"అయితే — మీరు పడిన శ్రమ, పెట్టిన ఖర్చు అంతా వృధా."

"కారణం ?—"

"మీకు డబ్బు రాకపోవటం."

"రాదూ ?—"

"రాదు."

"రాఖాల్‌బాబూ !_ ఇదంతా వర్ఠి బుకాయింపు అనుకుంటున్నారేమో మీరు. నేను కలకత్తావాణ్ని. చేతావాయ కాని పని చేసేవాణ్నికాను. కావాల్సిన సాక్ష్యాలూ, ఆధారాలూ అన్నీ సిద్ధంగా వున్నాయి. మీ మయినావతీ, వసంతపూరూ, ఖుస్రూపూరూ, తిన్‌తారియా మఠం, అన్నీ తిరిగాను మీ సిగ్నల్‌మానూ, గాంగ్‌కూలీలూ, తిన్‌తారియా సన్యాసులూ మీ యింటో విందులు కుడుస్తూ కూచున్నారు. వాళ్ళంతా మిమ్మల్ని పోల్చుకోగలరు. ఆనవాలు పట్టగలరు. డబ్బు ఆశ చూపి సాక్షుల్ని తిప్పుకుందుకి చూస్తారేమో. ఆ సావకాశ మేమీ నేను ఉంచలేదు అంతా విన్నారు గనుక, ఇహ తియ్యండి; డబ్బు పైకి తియ్యండి. లేదూ అంటే – కృష్ణనగర్ వెళ్ళి పోలీసులకు అంతా రిపోర్టు ఇస్తాను. మూడేళ్లు శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు. చూసుకోండి. ఇప్పుడేనా మీ అభిప్రాయాన్ని మార్చుకున్నారా ?_"

"మీరు అనవసరంగా శ్రమపడుతున్నారు. వృధాగా నన్ను భయపెడుతున్నారు. మీకు దీనివల్ల చిల్లిగవ్వంత కూడా లాభించదు. నిన్ననే యదార్ధ మంతా చినరాణి గారితో చెప్పేశాను."

ఈ మాట వింటూనే ఖగేంద్రుడు కుప్పలా కూలిపోయాడు. అతనికి నెత్తిన పిడుగు పడినట్టయింది.

"ఆఁ !_చెప్పేశారా ?_" అన్నాడు ఖంగారుగా.

"ఆ, – చెప్పేశాను. మీకు చెల్లె లవుతుందో ఏమవుతుందో, ఆ కనకలతని అడిగి తెలుసుకోండి" అంటూ రాఖాల్ నౌకరుని పిలిచాడు

"బాబుగారిని కిందికి తీసుకువెళ్లు; స్నానానికీ దానికీ ఏర్పాట్లుచూడు. వారి చెల్లెల్ని చూడాలంటే పెద్దరాణిగారికి కబురు పంపించు."

* * * * * * *

ఖగేంద్రుడు స్నానం చెయ్యలేదు; ఫలహారం చెయ్యలేదు; ఏమీ చేదు.

కోటుజేబులోంచి వెండిఫ్లాస్కు పైకితీసి, నీళ్ళు కలియని బ్రాందీతో గొంతు తడుపుకుంటున్నాడు.

కనకలతను కలుసుకుందికి అనుమతి వచ్చింది.

తూలుతూ తూలుతూ నౌకరు వెంట వెళ్ళాడు

"ఇలా గయిపోయా రేమిటీ ?_ ఏం జరిగింది ?_" అడిగింది, కనకలత.

"తెలియదూ ?____"

"చినరాణికి అంతా చెప్పేశా నని అన్నాడు. నిజమా, అబద్ధమా ?"



"నిజమే."

మరో గుక్కెడు బ్రాందీ తాగాడు ఖగేంద్రుడు. "ఇంటోవా ళ్ళంతా విని ఏమన్నారూ ?—"

"ఇంటో ఎవరికీ తెలియదు. ఒక్క చినరాణికి మాత్రమే తెలుసు. ఏమి టిదీ ?— పరగడుపున బ్రాందీ తాగుతున్నా రెందుకూ ?—"

"మెదడుకి మంచిది. కాస్త నువుకూడా ?—"

"ఇక్కడ తాగకండి. మర్యాదస్తుల ఇంటో ఏమి టీ పనీ ?—"

"నాకు బుద్ధి అనేది నశించింది ఇప్పుడు తాను ఖగేంద్రుడు కాదని తెలిసినా చినరాణి తనని వదల దని అంతా చెప్పేసి, ఏ సివిల్ మారేజో చేసేసుకుందా మనకున్నాడు కాబోలు. వాహ్:- ఏం తెలివి, ఏం తెలివి! — కానీండి, వారంవారం 'వంగవాసి'లో మీ మీద కవిత్వం రాసి ప్రకటిస్తాను. మీరు తలెత్తుకోకుండా చేస్తా. కనకా !— నువ్వు ఎందుకూ పనికిరానిదానివి. చినరాణిచేత నన్ను పెళ్ళి చేసుకుందుకు వప్పించలేకపోయావ్ !—" అంటూ, పిచ్చిపిచ్చిగా ఏవేవో పాటలు పాడుతున్నాడు.

"ఖగేంద్రబాబు !- మీ రిలా చేస్తున్నా రేమిటి ?- మీ ఎత్తు లన్నీ విడిచిపెట్టండి. మీ కింక డబ్బు చిక్కే ఆశ ఏమాత్రం లేదు."

"ఆశ ఏ మాత్రం లేదా, ఏ మాత్రం లేదా ?—" అంటూ, కనకలతమీదికి దూకి, ఆమెను ఒక్క తోపు తోశాడు.

కనకలత కింద పడింది.

"పాపాత్మురాలి కిదే శాస్తి" అంటూ, తూలుతూ తూలుతూ లేచి, మెట్లు దిగి, మెల్లాలోకి వచ్చాడు.

చేతులు తిప్పుతూ, "వినండొహోయ్ !— వినండి !— ఎక్కడెక్కడి వాళ్ళూ వినండి ; అతను భవేంద్రుడు కాడు. రాఖాల్, అతను రాఖాల్; సురబాల రాఖాల్ పెళ్ళాం," అంటూ అరచుకుంటూ, తూలుతూ, అంతఃపురమూ కచేరీ దాటి వీధిలోకి వెళ్ళిపోయాడు.

* * * * * * *

పూజాగృలోంలోంచి పెద్దరాణి కంగారుగా పరుగెత్తుకు వచ్చింది, "ఏమని వెళ్ళాడూ ? కనకలత అన్న ఏమిటీ అరుచుకుంటూ పోయాడూ?—'' అని అందరినీ అడిగింది.

ఎవరూ జవాబు చెప్పలేదు.

"ఏదీ కనకలతా ?— సురబాల ఏదీ ?— అంటూ, పిచ్చిదానిలాగా పరుగులెత్తింది.

"సురో! సురో!!— అతను మా భవేంద్రుడు కాడూ?—"

"కారు" అంటూ ఏడ్చింది సురబాల.

"నీ భర్తా ? —"

"ఊఁ—"

"ఏదీ కనకలత ఏదీ ?—" ఆఁ కనకా !— మీ అన్నయ్య మెల్లాలో నిలబడి ఏమిటీ అన్నడూ ?—"

సమాధానం చెప్పలేదు కనకలత.

"ఆ వచ్చినతను మా భవేంద్రుడు కాడూ ?—"

"కాదు" అంది స్పష్టంగా.

సురబాల భర్తా ?—"

"ఊఁ—"

మొదలు నరికిన చెట్టులా అక్కడే కూలబడిపోయింది పెద్దరాణి.

* * * * *

ఇదుగో, హనుమాన్ సింగ్ !— నీకు కావలసిన సిబ్బందిని తీసుకువెళ్ళి, ఇంటి చుట్టూ పహరా వుంచు. అతను పారిపోకుండా చూడు" అటూ, మేనేజరు హుకుమ్ జారీచేశాడు

జమాదార్ హనుమాన్‌సింగ్ వెళ్ళిపోయాడు

రెండు గ్లాసుల నీళ్ళు గటగటా తాగేసి, చెమట తుడుచుకున్నాడు. "నే నప్పుడే సందేహించాను; కాని, నా కెందుకని ఊరుకున్నాను. పదహారేళ్ళు పత్తా లేకుండా పోయిన మనిషి మళ్ళీ ఎక్కడయినా తిరిగి వస్తాడా ?— బాబాయ్‌గారూ ! 'బాబాయ్ గారూ!! అని పిలవగానే దివాను కరిగిపోయాడు. నేనే దివానునయితే, కళ్ళలో దుమ్ము కొట్టగలిగేవాడా ?— ఇప్పుడే దివాను గనక ఉన్నట్టయితే ఈపాటికి గోడ దూకి పారిపోయేవాడే !—" అంటూ, మరో గ్లాసు నీళ్ళకి ఆజ్ఞ ఇచ్చాడు.

"అయిందేదో అయింది. ఇప్పు డేమిటి కర్తవ్యం ?" అని అడిగాడు, ఒక వృద్ధ ఉద్యోగి

"రాణాకి కబురు చేస్తాను" అన్నాడు మేనేజరు, హుందాగా ఖాళీగ్లాసు కింద పెడుతూ.

"సబినస్పెక్టరు వచ్చి ఆయన ఖగేంద్రుడు కాడు అనటానికి ప్రమాణా లేమిటని అడిగితే ఏం చెబుతారూ ?..ఆ తాగుబోతుమాటలు తప్ప మరే ఆధారాలూ లేవే ?—"

మేనేజరు వెనక్కి తగ్గాడు.

'ఒకవేళ ఆ తాగుబోతుమాటే అబద్ధ మయితే..అం—బాబుగారి చుట్టూ పహరా పెట్టానే! వా రేమనుకుంటారో ?.. రేపే నా ఉద్యోగం లాగేస్తే ?—'

"అం.ఆ తాగుబోతు ఎక్కడికి పోయాడు ?— అతన్నే పిలిచి కనుక్కుంటే తేలి పోతుందిగా ?—" అంటూ, ఖగేంద్రుణ్ణి వెతికి పట్టుకురమ్మని హుకుమ్ చేశాడు.

"మీరు ఒకసారి మన పెద్దరాణిగారి దగ్గరికి వెళ్ళి మాట్లాడడం మంచిది. రాణాకి కబురు పంపమంటారో, దివాన్‌గారికి డార్జిలింగు తంతి ఇవ్వమంటారో తెలుసుకోవటం ముఖ్యం" అన్నాడు వృద్ధ ఉద్యోగి.

* * * * * * *

"అమ్మా !—మేము విన్న దంతా నిజమేనా ?—"

"నిజమే."

"ఇప్పు డేమిటి ఉపాయం ?—"

"భగవంతుడు చూపించినది"

"రాణాకు కబురు పంపనా ?— ఆయన చుట్టూ పహరా వుంచాను .—"

"రాణాకి కబురు పంపవద్దు. పాహరా వాళ్ళని తీసెయ్. అతన్ని ఎవరుగాని అవమానించటానికి వీల్లేదు. అతనికి కోపం తెప్పించకండి. అతని యిష్టం — అతనంతట అతి నెప్పుడయినా సరే, వెళ్ళనీ."

"ఇంకా హుకుమ్ ఏదేనా వుందా, అమ్మా?—"

''కోడలికి జబ్బు ఎక్కువగా వుంది. కృష్ణనగర్‌లో పెద్దడాక్టరికి తంతి యిప్పించు "

''దివాన్‌గారిని రమ్మని తంతి ఇవ్వమన్నారా ?—

''వద్దు."

* * * * * * * *

ఇందుమతికి స్పృహ వచ్చింది.

తలాపిదిక్కున కూచుని విసురుతున్న సురబాలను చూసింది.

"రాత్రంతా నువ్విలాగే కూచున్నావా ?—"

"లేదు. నేను వచ్చి ఎంతోసేపు కాలేదు. పెద్దరాణిగారు స్నానానికి వెళ్ళేముందు నన్నిక్కడ కూచోబెట్టారు. ఆవిడ ఈ రెండురోజులూ స్నానమూ, భోజనమూ ఏమీ చెయ్యలేదు

''రెండురోజులా ?—నాకు సుస్తీ ప్రారంభమై ఎన్నాళ్ళయిందీ ?"

''మొన్న మధ్యాహన్నం మీరు హఠాత్తుగా మూర్ఛ వచ్చి పడిపోయారు."

ఇందుమతి కళ్ళలో నీళ్ళు నిండాయి,

"నిన్న డాక్టరుగారు........."

ఏ డాక్టరుగారూ ?—ఎప్పుడు వచ్చారూ ?—''

''మొన్న సాయంత్రం కృష్ణనగర్‌నించి వచ్చారుగా ?—డాక్టరుగారు. ఆయన, మీకు కాస్త కులాసా చిక్కగానే గాలి మార్పుకి తీసుకువెళ్లాలని చెప్పారు.''

''ఇంక ఆ అవసరం లేదు."

"ఎందుకని ?"—

''అంతా విన్నావుగా ?—ఇంకా నేను బతికి ఏం ప్రయోజనం ?—ఈ కళంకిత జీవితం ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిది కదూ ?—"

"మీ రెందుకు అలాఅనుకోవటం ?—మీ దోషం ఏమీ లేదే ?—''

''అంతా నా అదృష్ట దోషం..."

"శిలా విగ్రాహాన్ని దేవుడుగా భావించి పూజిస్తూ వుంటాం ఆ పూజ రాతికి చెందుతుందా, దేవుడికి చెందుతుందా ?—అలాగే మీరు మీ దేవుణ్ణి పూజించారు."

ఇందుమతి కళ్లు మూసుకుంది

''సరే, ఆలోచించిచూస్తాను ... అవు నవును ... సరిగ్గానే చెప్పావు. అవును గానీ—నా కొక పని చేసిపెడతావా ?—"



"చెప్పండి "

"ఆ బీరువాలో కుడివేపు సొరుగులో ఎడంవేపు మూలగా దంతప్పెట్టె వుంది. దాన్నిలా తెచ్చిపెట్టు."

సురబాల తీసుకువచ్చింది

దానిని ఇందుమతి ఎంతో ఆప్యాయంగా గుండెలకు హత్తుకుంది.

"ఇందులో ఏ ముందమ్మా ?—"

పెట్టె మెల్లగా తెరిచి, అందులో కట్టిపెట్టివున్న పట్టురుమాలు విప్పింది. అందులో రంగురంగుల పావు లున్నాయి.

"ఏం పావులమ్మా ఇవి ?—"

ఇందుమతి ముఖంలో చిరునవ్వు తొంగిచూసింది. "పెళ్ళినాటి మర్నాడు— పూలపాన్పుకు ముందురోజున పావులు పెట్టి ఆడతారుకాదూ ?— ఇవి ఆనాడు మేం ఆడుకున్న పావులు "

సురబాలకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

* * * * * *

పెద్దరాణి రాకకోసం ఎదురుచూస్తున్నాడు రాఖాల్

ఆవిడి వచ్చింది, కానీ. కూచోలేదు.

రాఖాల్ ఒక్కొక్క అడుగే ముందుకు వెళ్ళాడు. తల నేలకి ఆన్చి నమస్కరించాడు "నా అపరాధా లన్నిటినీ క్షమించండి" అని మాత్రం అనగలిగాడు. తల వంచుకుని. అవిడ కళ్ళమ్మట నీళ్ళు కారుతున్నాయి.

రాఖాల్‌కు దుఃఖం ఆగిందికాదు. నీళ్ళు నిండిన కళ్ళతో, "మిమ్మల్ని 'అమ్మా!' అని పిలిచే అర్హత నాకు లేదు. నేను మహా పాపిని. మీ పాదధూళి తీసుకుని శాశ్వతంగా సెలవు తీసుకుంటాను" అన్నాడు.

పెద్దరాణి పెదవులు కంపించాయి, "నాయనా !—" అని మాత్రం అన్న దామె. కొంగు ముఖానికి అడ్డం పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చింది

"అనుకున్నంత నిర్భాగ్యుణ్ణి కాదు నేను. 'నాయనా!' అని నన్ను పిలిచి, 'అమ్మా!' అని పిలిచే అధికారాన్ని నాకు ప్రసాదించారు. అమ్మా !— ఇహ వస్తాను, సెలవు..." అని మళ్ళీ తల నేలకి ఆన్చి నమస్కరించాడు.

"వెళ్ళిరా నాయనా !— నీ మనస్సు న్యాయమార్గంలో ఉండాలనీ, నువ్వు మళ్ళీ సుఖంగా వర్ధిల్లాలనీ ఆశీర్వదిస్తున్నాను" అంటూ, ఆమె గుమ్మంవేపు వెళ్ళి వెనక్కి తిరిగింది, "కొంచెం ఆగు— కనకలత వచ్చి నిన్ను కలుసుకుంటుంది" అని ఆమె వెళ్ళిపోయింది.

*　　*　　*

"మీ రివాళే వెళుతున్నారా ?" అడిగింది కనకలత.

"సాయంకాలం రైలుకి వెళతాను చినరాణిగారి కెలా వుంది ?"—

"కులాసాగా వున్నట్టే. కాని, నేను మాత్రం అలా అనుకోను."

"మరి—ఎల్లుండే తీర్థయాత్రలకి బయల్దేరుతున్నారని విన్నాను ? ఇలా వున్నప్పుడు ప్రయాణం తలపెట్టడం మంచిదేనా ?—

"మే మంతా చెప్పిచెప్పి నెగ్గలేకపోయాం. ఇంక ఇక్కడ వుండటం ఆమె కెంతమాత్రం ఇష్టంలేదు."

"ఎక్కడికి వెళ్తారూ ?—"

"కాశీ ... ... మీ రెక్కడికి వెళ్తారూ ?—" అడిగింది కనకలత.

"కలకత్తా వెళుతున్నాను. తర్వాత అక్కడినుంచి మరెక్కడికయినా వెళ్తాను."

"అవునుగానీ — లీలావతి ఇక్కడ వున్న సంగతి మీరు విన్నారా ?—"

"ఆఁ — విన్నాను."

"ఆమె కేమిటి ఏర్పాటు చేశారు ?—"

"దాని ఏర్పాటదే చేసుకోగల్దు దానికి నే నేం చెయ్యగలను?—అన్నీ మీకు తెల్సుగా?—"

"నాకు తెలుసు. కానీ, మీకు తెలియదు. లీలావతి సంగతి నాకు తెలుసు. ఆమెను గురించి మీ రింకా ఎదో భ్రమలో వున్నారు. మీ భార్య ఉత్తమ ఇల్లాలు. అయితే కాస్త వెర్రిబాగులది. ఏదో తెలివితక్కువవల్ల ముప్పు తెచ్చుకుంది. అంతే నే నేదో కథ అల్లుతున్నా ననుకుంటున్నారా ?– అదేం కాదు మీకు దాఖలా కావాలంటే ఇవిగో—"అంటూ, ఖగేంద్రుడు తనకి రాసిన ఉత్తరాలు ఇచ్చింది.

ఉత్తరా లన్నీ చదివాడు రాఖాల్. ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చాడు.

"ఏమి టాలోచిస్తున్నారూ ? ఇం కేమైనా సందేహం వుందా ?–"

"పెద్దరాణిగారి కివంతా తెలుసా ?–"

"ఆఁ– ఆవిడకు ఇప్పు డన్నిసంగతులూ తెలిశాయి"

"అయితే–ఈ విషయంలో ఆవిడ ఉద్దేశ మేమిటి ?–"

"ఆవిడ చేష్టలను బట్టి మీ రింకా ఆవిడ అభిప్రాయం తెలుసుకోనేలేదా ?—"

"ఏమి టది ?–"

"నన్ను కలుసుకోమని మీకు చెప్పివెళ్ళలేదా ?–"

"ఆఁ–ఆఁ–అవును, నిజమే. అది సరేగానీ, పెద్ద రాణిగా రేమన్నారూ ?–"

"ఏమంటారూ?–అన్ని సంగతులూవిని, మీ ఆవిడ తెలివితేటల్ని ప్రశంసించారు."

"అది కాదు......"

"అవును, అర్థమయింది. లీలావతి నిర్దోషి అని తెలిశాకకూడా ఆమెను వదిలిపెట్టి, ఆమెకు అన్యాయం చెయ్యడు. రాఖాల్ అంతటి అధర్మం ఎన్నడూచెయ్యడు"అన్నారు.

'నువ్వు మళ్ళీ సుఖంగా వర్ధిల్లు' అని దీవించిన పెద్దరాణి మాటలో అర్థం ఇప్పుడు స్ఫురించింది రాఖాల్ కి.

* * * *

ఆరోజు మధ్యాహ్నం బాళులీపాడా జమీందారుగా రింటినించి రెండు మేనాలు బయల్దేరి వెళ్లాయి.

* * * *

బెంగాల్ - నాగపూర్ లైన్ లో రాఖాల్ భట్టాచార్య మళ్ళీ అసిస్టెంటు స్టేషన్ మాష్టరుగా కుదురుకున్నాడు.

రెండునెలల తరురాత ఒకనా డతని కొక ఉత్తరం వచ్చింది. అది లీలావతికి కనకలత రాసిన ఉత్తరం.

రాసపూర్ణిమనాడు చినరాణి ఇందుమతీదేవి కన్ను మూసిందిట. ఆమె కోరిక ప్రకారం ఆ పావుల్నికూడా ఆమె చితిమీద ఉంచారుట !–